www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఉన్నత విద్యలో నాన్-లోకల్ కోటా ఎత్తివేత

ఇకపై సీట్లన్నీ స్థానికులకే

15% నాన్-లోకల్ కోటా.. **14**

నాలుగు క్యాటగిరీలకు పంపిణీ

ఏపీ పునర్విభజన చట్టం పదేళ్ల గడువు పూర్తయిన నేపథ్యంలో జీవో

శుక్రవారం | 28-2-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 331 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి తె. 3.16 తదుపరి విదియ; నక్షత్రం: శతభిషం మ. 1.40 తదుపరి పూర్వాభాద్ర; వర్జ్యం: రా.7.27-8.54; దుర్ముహూర్తం: ఉ.8.57-9.44, మ.12.51-1.37; అమృతఘడియలు: ఉ.7.05-8.32; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.17 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



హెచ్‌సీఎల్ గ్లోబల్ డెలివరీ సెంటర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

తెలంగాణ పరుగు ఆగదు!

- రాష్ట్రం క్రేజ్ పెట్టుబడులతో తెలిసొచ్చింది
- అనుమానించిన వాళ్లే అభినందిస్తున్నారు
- రాష్ట్రాభివృద్ధిని ప్రపంచమే ఒప్పుకుంది
- హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ప్రారంభంలో సీఎం
- గోల్ఫ్ కోర్స్-విల్లా భూముల వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకుందాం
- సీఎంను కలిసిన 'ఎమ్మార్' వ్యవస్థాపకుడు
- గత అధికారుల కమిటీకి అదనంగా న్యాయ నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలన్న సీఎం
- వైఎస్ హయాంలో ఎమ్మార్ భూకేటాయింపులు
- ప్రస్తుత విలువ రూ.40 వేల కోట్ల పైనే

హైదరాబాద్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సత్తా ఏంటో, దానికున్న క్రేజ్ ఏంటో గత రెండు దఫాల దావోస్ సమావేశాల్లో కుదిరిన ఒప్పందాలతో, తాజాగా ముగిసిన బయోఏషియా సదస్సుతో ప్రపంచానికంతటికీ తెలిసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ రైజింగ్.. తెలంగాణ రైజింగ్ అని తాను అన్నప్పుడు మొదట్లో సాధ్యమేనా? అని కొందరు సందేహాలు వ్యక్తం చేశారని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్న భారీ పెట్టుబడులు, ఏర్పాటవుతున్న భారీ పరిశ్రమలు, జరుగుతున్న పరిణామాలతో అందరూ తమ సత్తాను అంగీకరిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని అనుమానించినవాళ్లే నేడు అభినందిస్తున్నారని చెప్పారు. దావోస్ సమావేశాల్లో మొదటి దఫా రూ.41 వేల కోట్లు, రెండోసారి రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలను సాధించామని ప్రస్తావించారు. నిన్ననే ముగిసిన బయోఏషియా అంతర్జాతీయ సదస్సులో దిగ్గజ ఫార్మా కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలు సానుకూల

మిగతా 13వ పేజీలో...

కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు మరింత కోత?

- ప్రస్తుతం ఉన్న 41 శాతం వాటా నుంచి 40 శాతానికి తగ్గించే యోచన
- 2026-27 నుంచి అమలు
- అక్టోబరులో ఆర్థికసంఘం ప్రతిపాదన!
- 4.8% ఆర్థికలోటు అంచనాలే కారణం
- ఆచరణలోకి వస్తే.. కేంద్రానికి ఏటా కనీసం రూ.35 వేల కోట్ల మిగులు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: కేంద్రం, బీజేపీయేతర రాష్ట్రాల మధ్య దూరం పెరుగుతున్న నేపథ్యంలో.. మోదీ సర్కారు మరో కోతకు సిద్ధమైందా? కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే వాటాను 41% నుంచి 40శాతానికి తగ్గించి, 1% మేర కోత విధించనుందా? ఆర్థిక సంఘం ఆ మేరకు సిఫారసు చేస్తే.. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందా? ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం దశలవారీగా చర్యలు తీసుకోనుందా? ఈ ప్రశ్నలకు ఔనని చెబుతూ రాయిటర్స్ వార్తాసంస్థ ఓ సంచలన కథనాన్ని ప్రచురించింది. మూడు వేర్వేరు విశ్వసనీయవర్గాలను ఉటంకిస్తూ.. కేంద్రం తీసుకోబోయే చర్యలను గురించి వివరించింది. తాజా బడ్జెట్ ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు జీడీపీలో 4.8శాతంగా ఉంది. రాష్ట్రాల ద్రవ్యలోటు కేంద్ర జీడీపీలో 3.2శాతంగా ఉంది. ఈ లోటును తగ్గించేందుకు పన్నువాటాలో

మిగతా 2వ పేజీలో...



ఎస్ఎల్‌బీసీ వద్ద సహాయక చర్యల పర్యవేక్షణలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అర్వింద్‌కుమార్, అధికారులు

యాడిట్ పెట్టండి.. ఎంత ఖర్చయినా భరిస్తాం!

- సొరంగం నుంచి బయటికెళ్లే ద్వారం ఏర్పాటు చేయండి
- అధికారులకు ఉత్తమ్ సూచన
- 14 కి.మీ. వద్ద ఏర్పాటు.. అర్వింద్‌కుమార్ ప్రతిపాదన
- **బురద తొలగింపు షురూ**
- లోకో ట్రైన్ కంటెయినర్లతో సొరంగం నుంచి బయటకు
- ప్లాస్మా, గ్యాస్ కట్టర్ల సాయంతో ఐరన్ వ్యర్థాలు, టీబీఎం కటింగ్
- **టన్నెల్ మధ్యలో ద్వారం!**
- 30 ఏళ్ల క్రితమే కేంద్రం ఓకే!
- పర్యావరణ, అటవీ శాఖ ఇచ్చిన అనుమతి తాజాగా వెలుగులోకి

(ఎస్ఎల్‌బీసీ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)

శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం ఇన్‌లెట్ (దోమలపెంట నుంచి) 14 కిలోమీటర్ల వద్ద యాడిట్ (సొరంగం నుంచి బయటికి వెళ్లే ద్వారం) పెట్టడానికి చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు చెప్పారు. అందుకు ఎంత ఖర్చయినా భరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. గురువారం సహాయక చర్యలు పరిశీలించడానికి వెళ్లిన ఆయన దోమలపెంటలో అధికారులతో సమీక్ష చేశారు. నేషనల్ జియో ఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు

మిగతా 3వ పేజీలో...

డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో సొరంగం!?

- సర్కారుకు జేపీ అసోసియేట్స్ ప్రత్యామ్నాయ ప్రణాళిక!
- 13.5 కి.మీ. నుంచి పక్కకు జరిగి 20వ కి.మీ. వద్ద లింక్
- ఈ పద్ధతిలో తవ్వితే త్వరగా పూర్తిచేయొచ్చని అంచనా
- ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్ఏ సూచనలతో ఎస్ఎల్‌బీసీ పూర్తికి ప్రత్యామ్నాయ మార్గం

3



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఓ పోలింగ్ కేంద్రంలో క్యూలో ఉపాధ్యాయులు

పోలింగ్ ప్రశాంతం

- ఉపాధ్యాయ స్థానాల్లో ఓటేసేందుకు పోటెత్తిన టీచర్లు.. 'నల్లగొండ'లో 93.5%
- 'కరీంనగర్'లో 91.9 శాతం నమోదు
- పట్టభద్రుల స్థానంలో 70.42 శాతం
- గోదాములకు బ్యాలెట్ బాక్సుల తరలింపు
- 3న కౌంటింగ్ నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు
- **ఒకటి పక్కా.. రెండింట్లో గట్టి పోటీ**
- ఎమ్మెల్సీ ఎన్నికలపై కమలనాథుల్లో చర్చ
- **ఏపీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ పోలింగ్**
- పెద్ద ఎత్తున పాల్గొన్న టీచర్లు, పట్టభద్రులు

(ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్)

రాష్ట్రంలో రెండు టీచర్ ఎమ్మెల్సీ స్థానాలు, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. పట్టణ ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల దాకా, కొన్ని

మిగతా 12వ పేజీలో...

కేటీఆర్ సన్నిహితుడు కేదార్ మృతిపై మౌనమెందుకు?

- విచారణ ఎందుకు కోరట్లేదు?.. ఎమ్మెల్సీ కవితను ప్రశ్నించిన కాంగ్రెస్ ఎంపీ చామల
- కేదార్‌తో అంటకాగిన వ్యక్తులెవరో
- కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలు తేల్చాలి: యెన్నం
- **ఆ మరణాలను బీఆర్ఎస్‌కు అంటగట్టడమేంటి?**
- రాజలింగమూర్తి, సంజీవ రెడ్డి, కేదార్ మరణాలపై సీఎం వ్యాఖ్యలకు కవిత స్పందన
- **పాలన చేతగాకే మరణాలపై రాజకీయం: కేటీఆర్**

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడైన కేదార్ మృతిపై మౌనమెందుకని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ప్రతి చిన్న విషయానికి స్పందించే కేటీఆర్, కవిత, బీఆర్ఎస్ పరివారం కేదార్ మృతిపై మాత్రం మౌనంగా ఉంటోందని.. దీనిపై విచారణ ఎందుకు కోరడం లేదని గురువారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఇది పలు సందేహాలకు తావిస్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పాటు తెలంగాణలో రూ.వేల కోట్లు దండుకుని విదేశాల్లో పెట్టుబడులు పెట్టారన్న సంగతి ప్రజలకు తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. 'కాంగ్రెస్, బీజేపీ ఒక జట్టు

మిగతా 12వ పేజీలో...



ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద మీడియాతో హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి

సర్కారు వైఫల్యమే

- టన్నెల్‌లో నామమాత్రంగా చర్యలు
- 6 రోజుల్లో తట్టెడు మట్టీ తీయలేదు
- సీఎంకు వచ్చి చూసే సమయం లేదా?
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ ధ్వజం
- టన్నెల్ లోనికి అనుమతించనందుకు రోడ్డుపైనే శ్రేణులతో బైఠాయింపు
- ఎస్ఎల్‌బీసీ జాప్యానికి వారే కారణం
- ఇరిగేషన్‌ను నాశనం చేసిందే కేసీఆరే
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శ
- హరీశ్‌వన్నీ అవాస్తవాలు: జూపల్లి

నాగర్‌కర్నూల్/నార్సింగ్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి ఆరు రోజులు గడుస్తున్నా లోపల చిక్కుకున్న 8 మందిని కాపాడలేకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంఘటనా స్థలాన్ని పరిశీలించే సమయం

మిగతా 3వ పేజీలో...

రేవంత్.. దమ్ముంటే నిరూపించు

- నేను ఒక్క ప్రాజెక్టు అడ్డుకున్నట్లు తేలినా.. దేనికైనా రెడీ
- మెట్రో ప్రాజెక్టు రెండో దశకు రాష్ట్రం వద్ద పైసలే లేవు
- కావాలనే నన్ను, కేంద్ర సర్కారును బద్నాం చేసే కుట్ర
- మోదీ అనుమతితోనే హామీలిచ్చారా?: కిషన్‌రెడ్డి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకు సంబంధించిన ఏ ప్రాజెక్టునైనా తాను అడ్డుకున్నానని నిరూపిస్తే దేనికైనా సిద్ధమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే నిరూపించాలని సవాల్ విసిరారు. గురువారం ఢిల్లీలోని నేషనల్ మీడియా సెంటర్‌లో కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. మెట్రో రెండో దశను కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. "ఎన్నికల ముందు హామీలిచ్చేటప్పుడు.. కేంద్రంలోని

మిగతా 12వ పేజీలో...

నేటితో కులగణన రీ-సర్వే ముగింపు!

13

ఇప్పటికీ వివరాల సేకరణ పూర్తిగా జరగలేదన్న బీసీ సంఘాలు

చంద్రుడిపైకి డ్రోన్

- నీటి జాడల అన్వేషణకు అమెరికా కంపెనీ ప్రయోగం
- జాబిల్లి దక్షిణ ధ్రువం మీద మార్చి 6న దిగనున్న ల్యాండర్
- దాంట్లోనే డ్రోన్.. 65 అడుగుల లోయలో నీటి కోసం శోధన

2



జస్టిస్ పీసీ ఘోష్

డీపీఆర్‌కు రూ.677 కోట్లా?

- లెక్కలన్నీ ఉన్నాయి.. అబద్ధాలు చెప్పొద్దు
- జలసంఘం లేఖలను దాచిపెట్టారా? లేదా?
- మాజీ అధికారులపై ఘోష్ కమిషన్ ఫైర్
- జ్ఞాపకశక్తి తగ్గిందన్న మాజీ ఈఎన్సీ మురళీధర్

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): బ్యారేజీ డీపీఆర్‌ల తయారీకే వ్యాప్కోస్‌కి రూ.677 కోట్లు ఏ విధంగా చెల్లించారని కాళేశ్వరంపై విచారణకు వేసిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో పని చేసిన ఉన్నతాధికారుల్ని ప్రశ్నించింది. కేవలం రూ.19 కోట్లు మాత్రమే ఇచ్చామని రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు బుకాయించబోగా బిల్లుల చెల్లింపుల లెక్కలన్నీ తమ దగ్గరున్నాయని, అబద్ధాలు చెప్పి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయొద్దని

మిగతా 13వ పేజీలో...

పసిమొగ్గలకు చచ్చేంత సమస్యలా?

- బైక్ కొనివ్వలేదని ఒకరు.. ఫోన్ ఇవ్వలేదని మరొకరు
- శుభాకాంక్షలు చెబితే ఫ్రెండ్ కొట్టిందని ఇంకొకరు
- చిన్న చిన్న కారణాలకే ప్రాణాలు తీసుకుంటున్న పిల్లలు
- రాష్ట్రంలో పెరుగుతున్న విద్యార్థుల బలవన్మరణాలు
- గత 12 నెలల్లో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే 46 మంది ఆత్మహత్య
- మందలింపునకే క్షణికావేశానికి లోనవుతున్న విద్యార్థులు
- మరణంతోనే తమ విలువ తెలిసొస్తుందనే ఆలోచనతోనే..
- నిపుణుల అభిప్రాయం

ఉదయం భోజనంలోకి రాత్రి వండిన కూర వడ్డించబోతే ఆ బాలిక తల్లిని వారించింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆవేదనతో ఆ అమ్మాయి ఇంట్లో తన గదిలోకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలో ఈ ఘటన జరిగింది. మృతురాలు ఇంటర్ విద్యార్థిని రాజేశ్వరి సాయి (16).



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

మునుపు.. పిల్లల లేత మనసులు గాయపడితే ఇట్టే తెలిసిపోయేది. బుంగమూతి పెట్టుకోవడమో.. అలిగి ఆ పూట అన్నం మానేయడమో.. చెప్పుకొని ఏడ్వడమో చేస్తే తల్లిదండ్రులు పసిగట్టేవారు. దగ్గరకు తీసుకొని లాలించి.. బుజ్జగిస్తే పిల్లలకు సగం బాధ పోయేది. కారణమేంటో కనుక్కొని, ఓస్ ఈ మాత్రం

మిగతా 14వ పేజీలో...



విచారణ కోసం పోసానిని తీసుకెళ్తున్న పోలీసులు

నన్ను అరెస్టు చేశారు రాజా!

- ఏపీలో పోలీస్ స్టేషన్ ముందు జనాన్ని ఉద్దేశించి పోసాని
- ఎస్పీ పర్యవేక్షణలో విచారణ.. ఎవరు చెబితే వారిని తిట్టారు?
- స్క్రిప్ట్ ఎవరిది? ఎవరి హస్తం ఉంది?.. ప్రశ్నల వర్షం
- రైల్వేకోడూరు కోర్టులో పోసానిని హాజరుపరిచిన పోలీసులు
- **5న విచారణకు రండి.. గోరంట్ల మాధవ్‌కు పోలీసుల నోటీసు**

రాయచోటి/రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 'నన్ను అరెస్టు చేశారు.. రాజా..!' సినీనటుడు పోసాని కృష్ణమురళి గురువారం ఉదయం ఏపీలోని అన్నమయ్య జిల్లా ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్‌లోకి వెళుతూ బయట ఉన్న జనంతో అన్న మాటలివీ! వైసీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్ సహా అనేకమందిని అసభ్య పదజాలంతో దూషించిన వ్యవహారంలో పోసానిని బుధవారం రాత్రి

మిగతా 10వ పేజీలో...

చంద్రుడిపైకి డ్రోన్

నీటి జాడల అన్వేషణ కోసం అమెరికా కంపెనీ ప్రయోగం




- జాబిల్లి దక్షిణ ధ్రువం మీద మార్చి 6న దిగనున్న ల్యాండర్ అథీనా

వాషింగ్టన్, ఫిబ్రవరి 27: చందమామ మీద నీళ్లున్నాయా?.. ఈ ప్రశ్న దశాబ్దాలుగా అంతరిక్ష శాస్త్రవేత్తలకు సవాల్ విసురుతూనే ఉంది. దీనికి సమాధానం కనుక్కోవటానికి అనేక ప్రయత్నాలు, పరిశోధనలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. దీంట్లో భాగంగానే, తాజాగా ఓ అమెరికా కంపెనీ డ్రోన్‌తో కూడిన ల్యాండర్‌ను చంద్రుడి మీదికి పంపించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంలో సూర్య రశ్మి పొడ లేకుండా, ఎల్లప్పుడూ నీడలోనే ఉండే ప్రాంతంలో దిగే ఈ ల్యాండర్.. అక్కడ నీటి ఆనవాళ్లపై సమాచారాన్ని అందించనుంది. ఇన్‌ట్యూటివ్ మెషీన్స్ అనే కంపెనీ రూపొందించిన ఈ ల్యూనార్ ల్యాండర్ పేరు అథీనా. నాసాకు చెందిన కెనడీ స్పేస్ సెంటర్ నుంచి దీనిని స్పేస్ ఎక్స్ సంస్థ బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. మార్చి 6వ తేదీన చంద్రుడిపై అథీనా దిగనుంది.

అక్కడ చీకటి లోయలు అనేకం

అథీనా పొడవు 15 అడుగులు. దీంట్లో మూడు అడుగుల పొడవున్న డ్రోన్ ఉంది. కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌కు ఆద్యుడిగా భావించే గ్రేస్ హోపర్ పేరు మీద ఈ డ్రోన్‌కు గ్రేస్ అని పేరు పెట్టారు. చంద్రుడి దక్షిణ ధ్రువం నుంచి 160కి.మీ.ల దూరంలో ఉండే ప్రాంతంలో అథీనా దిగాలనేది నిర్దేశిత లక్ష్యం. ఆ ప్రాంతానికి కేవలం 400 మీటర్ల దూరంలో శాశ్వతంగా నీడలో ఉండే 65 అడుగుల లోతైన భారీ లోయ ఉంది. చంద్రుడి ఉత్తర, దక్షిణధ్రువాల్లో సూర్యరశ్మి సోకని ఇటువంటి భారీ లోయలు అనేకం ఉన్నాయి. ఈ లోయల నిండా నీరు గడ్డకట్టి మంచు రూపంలో ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అదే నిజమైతే.. ఆ మంచు నుంచి.. భవిష్యత్తులో చంద్రుడి మీదకు వెళ్లే వ్యోమగాములు తాగటానికి అవసరమైన నీటి ని, పీల్చుకోవటానికి గాలిని, ఇంకా వీలైతే రాకెట్ల ఇంధనాన్ని కూడా తయారు చేయాలన్నది శాస్త్రవేత్తల స్వప్నం. అంతరిక్ష ప్రయోగాలనే మలుపు తిప్పే పరిశోధన ఇది. దీనికోసం అనేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. తాజాగా ఇన్‌ట్యూటివ్ మెషీన్స్ చేపట్టిన ప్రయోగం కోసం ఆ కంపెనీకి నాసా 6.2 కోట్ల డాలర్లను చెల్లించింది. అన్నీ అనుకున్నట్లు జరిగితే చంద్రుడి దక్షిణ ధ్రువం మీద దిగే అథీనా నుంచి గ్రేస్ విడివడి అక్కడి చీకటి లోయపై పరిశోధనలు జరుపుతుంది. అత్యంత శక్తిమంతమైన కెమెరాలు, లేజర్ల సాయంతో గ్రేస్ అక్కడి పరిస్థితులను రికార్డు చేస్తుంది. హంగరీ, జర్మనీ అంతరిక్ష పరిశోధన సంస్థలకు చెందిన కొన్ని పరికరాలనూ గ్రేస్‌కు అనుసంధానించారు. సదరు పరికరాలు లోయలో తవ్వకాలు జరిపి మంచు ఆనవాళ్ల కోసం అన్వేషిస్తాయి. చంద్రుడి చీకటి లోయల్లోకి వెళ్లి మరీ పరిశోధనలు జరపటం ఇదే తొలిసారి.

లోకం తీరు



ఉద్యోగాలు తీసేశారు.. జోక్యం చేసుకోండి

- ప్రధాని కార్యాలయానికి ఇన్ఫోసిస్ ట్రైనీల వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: తమకు న్యాయం చేయాలంటూ ఇన్ఫోసిస్ మైసూరు క్యాంపస్‌లో ఉద్యోగాలు కోల్పోయిన ట్రైనీలు ప్రధాని కార్యాలయాన్ని (పీఎంవో) ఆశ్రయించారు. బలవంతంగా తొలిగించిన తమ ఉద్యోగాలు తిరిగి ఇప్పించేందుకు జోక్యం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సామూహిక తొలగింపులు లేకుండా చూడాలని 100 మందికిపైగా ట్రైనీలు ఇటీవల పీఎంవోను అభ్యర్థించారు. దీనిపై స్పందించిన కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ కర్ణాటక లేబర్ కమిషనర్‌కు 25వ తేదీన రెండోసారి నోటీసు పంపింది. ఇన్ఫోసిస్ నుంచి సామూహికంగా ఉద్యోగుల తొలగింపుపై విచారణ చేయాలని ఆ నోటీసులో కోరింది. కార్మిక చట్టాల ప్రకారం ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఐటీ ఉద్యోగుల సంక్షేమాన్ని చూసే నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్‌కు కూడా ఆ నోటీసులు పంపింది. ఫిబ్రవరి7న మైసూరు క్యాంపస్ నుంచి సుమారు 700మంది ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించింది. అంతర్గత మదింపులో వారు విఫలమవడంతోనే తొలగించామని ఆ సంస్థ సమర్థించుకుంది.

గూగుల్ క్లౌడ్ విభాగంలో ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సెర్చ్ ఇంజన్ దిగ్గజం గూగుల్‌లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. తాజాగా క్లౌడ్ విభాగంలో కొందరు ఉద్యోగులను తొలగించారని బ్లూమ్‌బర్గ్ న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. జనవరి నుంచి ఇప్పటి వరకు ఎందరిని తొలగించారనే విషయంపై స్పష్టమైన సమాచారం బయటకు రాలేదు. అయితే ఇలా తరచూ లేఆఫ్‌లు, అస్థిరమైన నిర్ణయాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ అమెరికా, కెనడాకు చెందిన గూగుల్ ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. తొలగింపు సమయంలో మంచి ప్యాకేజీ కోసం కొందరు డిమాండ్ చేశారు. కంపెనీ దీర్ఘకాలిక విజయాల కోసం కీలక రంగాల్లో పెట్టుబడులు పెంచే క్రమంలో కొన్ని మార్పులు చేస్తున్నామని ఈ లేఆఫ్‌ను సంస్థ అధికారి ఒకరు సమర్థించుకున్నారు. కాగా, ఓపెన్‌ఏఐతో పోటీ మొదలైన తర్వాత గతేడాది డిసెంబరులో గూగుల్ మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో 10 శాతం కోతపెట్టింది. వ్యయాల తగ్గింపులో భాగంగా 2023 జనవరిలో 12 వేల మందికిపైగా ఉద్యోగాలు కోల్పోయారు.

నకిలీ ఓటర్లతో ఢిల్లీ, మహారాష్ట్ర ఎన్నికల్లో గెలుపు

- బీజేపీపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపణ

కోల్‌కతా, ఫిబ్రవరి27: బీజేపీతోపాటు ఎన్నికల కమిషన్ (ఈసీ)పై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసీ మద్దతుతో ఇతర రాష్ట్రాలకు చెందిన నకిలీ ఓటర్లను ఎన్నికల జాబితాలో చేర్చినట్టు ఆమె పేర్కొన్నారు. మహారాష్ట్ర, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడానికి బీజేపీ ఈ వ్యూహాన్ని అనుసరించినట్టు చెప్పారు. గురువారంనాడిక్కడ నేతాజీ ఇండోర్ స్టేడియంలో టీఎంసీ రాష్ట్ర సదస్సులో పాల్గొన్న సందర్భంగా మమత మాట్లాడారు. హరియాణా, గుజరాత్ నుంచి నకిలీ ఓటర్లను చేర్చడం ద్వారా ఢిల్లీ, మహారాష్ట్రలో బీజేపీ విజయం సాధించిందన్నారు. ఇప్పుడు పశ్చిమ బెంగాల్‌లోనూ ఇదే చేయాలని వారు లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ నియామకం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల జాబితాను సరిచేసే విధంగా తగిన చర్యలు తీసుకోకుంటే ఎన్నికల కమిషన్ కార్యాలయం ముందు తమ పార్టీ ధర్నా నిర్వహిస్తుందని మమత హెచ్చరించారు. కాగా 2026లో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకుగాను 215కు పైగా సీట్లను సాధించాలని మమత లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

గుంతల హైవేపై టోల్ వసూలు సరికాదు

- చార్జీలో 20 శాతమే వసూలు చేయాలి
- జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: జాతీయ రహదారుల్లో(ఎన్‌హెచ్) టోల్ వసూలపై జమ్మూకశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పు విస్తృత మార్పునకు, ప్రజా ప్రయోజనాలకు కేంద్రంగా నిలుస్తుంది. ఎన్‌హెచ్ 44లో రహదారి దారుణంగా దెబ్బతిన్న, నిర్మాణంలో ఉన్న ప్రాంతంలో టోల్ చార్జీని తగ్గించుకోవాలని జాతీయ రహదారుల సంస్థను ధర్మాసనం ఆదేశించింది. ఎన్‌హెచ్ 44లో రహదారి దుస్థితిని ప్రస్తావించి, టోల్ చార్జీలను మినహాయించాలని కోరుతూ సుగంధ సాహ్ని అనే మహిళ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ తాషి రబ్సాన్, జస్టిస్ ఎంఏ చౌదరితో కూడిన బెంచ్ ఈ పిల్ విచారణ సందర్భంగా ఎన్‌హెచ్ సంస్థ రహదారి అధ్వాన్నంగా ఉందని అంగీకరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది. అనంతరం ధర్మాసనం తీర్పు ఇస్తూ.. 'రహదారి దారుణంగా ఉన్నప్పుడు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారినప్పుడు వారి నుంచి రుసుము వసూలు చేయడం అన్యాయం. కనుక పఠాన్‌కోట్-ఉధంపూర్ మధ్య లఖన్‌పూర్, బన్ టోల్ ప్లాజాల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న దాంట్లో 20శాతమే వసూలు చేయాలి. ఈ ఆదేశాలు రోడ్డు బాగయ్యే వరకూ వర్తిస్తాయి' అని పేర్కొంది.

భారత్‌లో ఎక్కడా ఇల్లు, భూముల్లేవు

- కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా

బెంగళూరు/న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): యలహంక ప్రాంతంలోని అటవీ భూములను కాంట్రాక్టు ముగిసినా అప్పగించలేదని తనపై లోకాయుక్తకు అందిన ఫిర్యాదుపై కాంగ్రెస్ సీనియర్ నేత శామ్ పిట్రోడా ఎక్స్‌లో స్పందించారు. దేశంలో ఎక్కడా తనకు సొంత ఇల్లు, భూములు, షేర్లు లేవన్నారు. బెంగళూరు పరిధిలో 12.35 ఎకరాల భూమి తన పేరిట ఉందని పత్రికల్లో వచ్చిన కథనాలకు వివరణ ఇవ్వదలచానని పేర్కొన్నారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వానికి అనుబంధంగా, సలహాదారుడిగా తాను పనిచేశానని, అయినా ఎలాంటి జీతం తీసుకోలేదని చెప్పారు. కాగా ఐఐటీ రాంచీ విద్యార్థులతో వర్చువల్‌గా ప్రసంగిస్తుండగా.. ఎవరో హ్యాక్ చేసి అసభ్యకర వీడియోలు ప్రదర్శించారంటూ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలను కేంద్ర విద్యాశాఖ కొట్టిపారేసింది.

గేట్ 2025 ప్రాథమిక 'కీ' విడుదల

- మార్చి 19న తుది ఫలితాల వెల్లడి

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్ 2025) పరీక్ష ప్రాథమిక 'కీ'ని ఐఐటీ రూర్కీ గురువారం విడుదల చేసింది. దీనిని https://gate2025.iitr.ac.in/ వెబ్‌సైట్‌లో చూడవచ్చు. గేట్‌లోని 30 టెస్ట్ పేపర్ల కోసం ఫిబ్రవరి 1, 2, 15, 16 తేదీల్లో ఈ పరీక్ష జరిగింది. ప్రాథమిక 'కీ'పై అభ్యంతరాలను ఫిబ్రవరి 27 నుంచి మార్చి1 వరకు తెలియజేయవచ్చని ఐఐటీ రూర్కీ పేర్కొంది. అభ్యంతరం తెలిపిన ప్రతి ప్రశ్నకు రూ.500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. తుది ఫలితాలను మార్చి 19న వెల్లడిస్తారు. విద్యార్థులు తమ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ, మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి ఫలితాలను తెలుసుకోవచ్చు. స్కోర్ కార్డులను మార్చి 28 నుంచి మే 31 వరకు అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఇగ్నో బీఎడ్, బీఎస్సీ నర్సింగ్ రిజిస్ట్రేషన్లకు నేడే ఆఖరు

బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్), బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(నర్సింగ్) అడ్మిషన్ల కోసం ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) రిజిస్ట్రేషన్ల గడువు శుక్రవారంతో ముగియనుంది. ఆసక్తి గల అభ్యర్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్ ignou.ac.inలో రిజిస్టర్ చేసుకోవచ్చు. దీనికి సంబంధించిన ఎంట్రెన్స్ పరీక్ష మార్చి 16న నిర్వహించనున్నారు.

అసౌకర్యం కలిగితే క్షమించండి

- ఐక్యతా మహాయజ్ఞంగా మహా కుంభమేళా
- మేనేజ్‌మెంట్, ప్లానింగ్ నిపుణులకు ఇదో అధ్యయనాంశం
- ప్రపంచంలో దీనికి సమానమైన ఉదాహరణ మరోటి లేదు: మోదీ



కుంభమేళా ముగియడంతో పరిసరాల్లో చీపురుతో శుభ్రం చేస్తున్న యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 45రోజుల పాటు సాగిన మహా కుంభమేళా ఘనంగా ముగిసింది. ఈ నేపథ్యంలో కుంభమేళాను 'ఐక్యతా మహాయజ్ఞం'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. శతాబ్దాల అణచివేతకు ముగింపు, కొత్త శకం ఆవిర్భావానికి ఇది గుర్తు అని పేర్కొన్నారు. ఏర్పాట్ల విషయంలో భక్తులు అసౌకర్యానికి గురైతే క్షమించాలని కోరారు. కుంభమేళా గురించి ప్రధాని గురువారం తన బ్లాగులో రాశారు. 'మహా కుంభమేళా ముగిసింది. ఐక్యత మహా యజ్ఞం పూర్తయింది. ఒక జాతి మేల్కొన్నప్పుడు, వందల సంవత్సరాల నాటి బానిస మనస్తత్వ సంకెళ్లను విచ్ఛిన్నం చేసి, కొత్త చైతన్యంతో శ్వాస తీసుకోవడం ప్రారంభించినప్పుడు.. జనవరి 13నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఐక్యత మహాకుంభ్‌లో మనం చూసిన దృశ్యమే కనిపిస్తుంది' అని మోదీ పేర్కొన్నారు. 'ఈ కుంభమేళా ఐక్యతకు ప్రతీక. గత 45 రోజులుగా దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది ప్రతిరోజూ సంగమ తీరానికి తరలి వచ్చారు. పవిత్ర త్రివేణి సంగమంలో స్నానం చేయాలన్న భావోద్వేగాల ప్రభంజనం భక్తుల్లో పెరుగుతూనే ఉంది. గంగా, యమున, సరస్వతి నదుల సంగమం ప్రతి భక్తుడిలోనూ ఉత్సాహాన్ని, శక్తిని నింపుతోంది. కుంభమేళా నేటి ఆధునిక యుగంలో ప్రణాళికలు, విధానాల రూపకల్పన నిపుణులతో పాటు మేనేజ్‌మెంట్ నిపుణులకు ఒక కొత్త అధ్యయన అంశంగా మారింది. ఇంత గొప్ప కార్యక్రమాన్ని మొత్తం ప్రపంచంలో దేనితోనూ పోల్చలేం. దీనికి సమానమైన ఉదాహరణ మరొకటి లేదు' అని మోదీ రాసుకొచ్చారు. 'సంగమ తీరానికి ఇన్ని కోట్లమంది ప్రజలు ఎలా వచ్చారా అని యావత్ ప్రపంచం ఆశ్చర్యపోతోంది. ఈ కోట్లాది మందికి ఎవరూ అధికారికంగా ఆహ్వానాలు పంపలేదు. అయినా కుంభమేళాకు వచ్చిన ప్రజలు పవిత్ర సంగమంలో పుణ్యస్నానాలు చేశారు, అమెరికా జనాభా కంటే దాదాపు రెట్టింపు మంది పుణ్య స్నానాలు ఆచరించారు. భవిష్యత్తులో దీనినుంచి ప్రేరణ పొంది ఇదే విశ్వాసం, ఐక్యతతో ముందుకు సాగాలి' అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహా కుంభమేళాను విజయవంతం చేసినందుకు యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వాన్ని, ప్రయాగ్‌రాజ్ ప్రజలను ప్రధాని ప్రశంసించారు.

ప్రపంచ స్థాయి కార్యక్రమం: యోగి

మహా కుంభమేళాను విజయవంతంగా నిర్వహించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కొనియాడారు. ఇదో ప్రపంచ స్థాయి కార్యక్రమం అని పేర్కొన్నారు. ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి ప్రధాని దార్శనికత, దూరదృష్టి తమకు సహాయపడ్డాయని తెలిపారు.

కావాలంటే ప్రధాని మోదీ డిగ్రీని కోర్టుకు చూపిస్తాం

- అభ్యంతరాలు ఏమీ లేవు.. ఢిల్లీ హైకోర్టులో సొలిసిటర్ జనరల్ వాదనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చదివిన డిగ్రీకి సంబంధించి గురువారం ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఢిల్లీ విశ్వవిద్యాలయం నుంచి 1978లో ఆయన బీఏ. పాసయినట్లు ధ్రువీకరించే సర్టిఫికెట్‌ను కోర్టుకు చూపించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా చెప్పారు. ఆ సర్టిఫికెట్‌ను ఎవరైనా చూడవచ్చంటూ కేంద్ర సమాచార కమిషన్ (సి.ఈ.సి) జారీ చేసిన ఆదేశాలను మాత్రం తిరస్కరించాలని కోరారు. మోదీతో సహా 1978లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి పాసయిన బీ.ఏ. విద్యార్థుల డిగ్రీల ఫలితాలను చూడవచ్చని 2016లో అప్పటి కేంద్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ మాడభూషి శ్రీధరాచార్యులు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీఐ కార్యకర్త నీరజ్ కుమార్ దాఖలు చేసిన దరఖాస్తుపై ఈ ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాలు అమలు కాకుండా 2017 జనవరి 24న ఢిల్లీ హైకోర్టు స్టే విధించింది. దీనిపై మళ్లీ న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా చేశారు.

హిందీ వల్ల ఉత్తర భారతంలో 25కి పైగా భాషలు నాశనం

- భాషా నిర్బంధాన్ని అనుమతించబోం
- తమిళ భాషను కాపాడుకుంటాం: స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హిందీ విషయంలో కేంద్ర ప్రభుత్వం, తమిళనాడులోని డీఎంకే సర్కార్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. హిందీ నిర్బంధాన్ని అనుమతించేది లేదని సీఎం ఎంకే స్టాలిన్ గురువారం మరోసారి తేల్చిచెప్పారు. తమిళ భాషను, దాని సంస్కృతిని కాపాడుకుంటామని స్పష్టం చేశారు. 'హిందీ భాష ముసుగయితే... ఆ ముసుగులో దాగిన ముఖం సంస్కృతం' అని ఆయన పార్టీ శ్రేణులకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆధిపత్య హిందీ, సంస్కృతం భాషల దాడి కారణంగా ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్‌లలో మాట్లాడే మైథిలి, బ్రజ్‌భాష, బుందేల్‌ఖండి, అవధి వంటి 25కి పైగా ఉత్తర భారతదేశ భాషలు నాశనం అయ్యాయని స్టాలిన్ అన్నారు. ద్రవిడ ఉద్యమం తమిళ భాష, దాని సంస్కృతికి రక్షణగా నిలిచిందని పేర్కొన్నారు. ఇప్పుడు హిందీ, సంస్కృతంలను బలవంతంగా రుద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందనే.. జాతీయ విద్యా విధానాన్ని తమిళనాడు వ్యతిరేకిస్తోందని స్పష్టం చేశారు. ఎన్ఈపీ ప్రకారం మూడవ భాషగా విదేశీ భాష కూడా కావొచ్చనే బీజేపీ వాదనను తిప్పికొడుతూ.. త్రిభాష పాలసీ షెడ్యూల్ ప్రకారం అనేక రాష్ట్రాలు సంస్కృతంను ప్రోత్సహిస్తున్నాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తమిళనాట త్రిభాషా విధానాన్ని అంగీకరిస్తే మాతృభాష నిర్లక్ష్యానికి గురై అంతరించిపోతుందని పేర్కొన్నారు. పాఠశాలల్లో సంస్కృతంతో పాటు ఇతర భారతీయ భాషలను బోధించాలని, తమిళం వంటి ఇతర భాషలను ఆన్‌లైన్‌లో బోధించవచ్చని ఎన్ఈపీ నిబంధనలు చెబుతున్నాయని, అంటే తమిళం వంటి భాషలను తొలగించి, సంస్కృతాన్ని రుద్దడమే దీని అర్థమని స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

ఐదేళ్ల బాలిక తలను గోడకేసి బాది.. అత్యాచారం

- మధ్యప్రదేశ్‌లోని శివపురిలో 17 ఏళ్ల బాలుడి అఘాయిత్యం

భోపాల్, ఫిబ్రవరి 27: మధ్యప్రదేశ్ గ్వాలియర్ సమీపంలోని శివపురిలో ఐదేళ్ల బాలిక దారుణ అత్యాచారానికి గురైంది. పొరుగింట్లోని 17 ఏళ్ల బాలుడు, పాపను టెర్రస్ పైకి తీసుకెళ్లి.. ఆమె తలను పలుమార్లు గోడకేసి కొట్టి.. అఘాయిత్యానికి పాల్పడ్డాడు. రెండుగంటల పాటు చిన్నారి కోసం వెతికిన తల్లిదండ్రులు.. పంటిగాట్లు, గోర్లతో రక్కిన గీతలు సహా ఒంటినిండా తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో అచేతనావస్థలో పడివున్న బాధితురాలిని గుర్తించారు. ఐదురోజుల క్రితం ఈ ఘటన జరిగింది. బాధిత బాలికను గ్వాలియర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి మర్మాంగం వద్ద 28 కుట్లు వేశారు. కడుపులో పెద్దపేగు వద్ద తీవ్రగాయం కావడంతో కోలోస్టొమి శస్త్రచికిత్స చేశారు. అయినా బాలిక పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు వెల్లడించారు. ఆమె స్పృహలోనే ఉన్నప్పటికీ మాట్లాడలేకపోతోందని చెప్పారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఘటనకు పాల్పడినప్పుడు నిందితుడు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడికి మరణశిక్ష విధించాలని.. రోడ్డుమీద నిల్చోబెట్టి తుపాకీతో కాల్చేయాలని బాలిక తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

రూ.200 తేడా ఉందని 93 కోట్ల ఖాతాను నిలిపేస్తారా?

- బ్యాంకు ఖాతాల స్తంభనపై జాగ్రత్తలు అవసరం
- దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ హైకోర్టు సూచనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: సైబర్ నేరాలపై దర్యాప్తులో భాగంగా నిందితులు, అనుమానితుల బ్యాంకు ఖాతాలను సంపూర్ణంగా స్తంభింపజేసే సమయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని దర్యాప్తు సంస్థలకు ఢిల్లీ హైకోర్టు సూచించింది. హేతుబద్ధత లేకుండా ఖాతాలను నిలిపివేస్తే జీవితాలే తారుమారవుతాయని పేర్కొంది. ఖాతాల్లో కేవలం రూ.200 మేర తేడా ఉందన్న కారణంతో రూ.93 కోట్ల ఖాతాను పూర్తిగా స్తంభింపజేయడాన్ని తప్పుపడు తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసుపై న్యాయమూర్తి జస్టిస్ మనోజ్ జైన్ ఆదేశాలు ఇస్తూ "తగిన కారణాలు చూపకుండా, బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడమే పరిష్కారమార్గమని అనుకుంటే.. అది సంబంధిత ఖాతాదారుల ఆర్థిక స్థితిగతుల్లో ఉపద్రవం సృష్టిస్తుంది" అని వ్యాఖ్యానించారు. ఖాతాను మొత్తంగా స్తంభింపజేసే బదులు వివాదంలో ఉన్న మొత్తాన్ని ధరావతు రూపంలో పక్కనపెడితే ఖాతాదార్లకు ఇబ్బంది ఉండదని అభిప్రాయపడ్డారు. కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులకు కూడా సొమ్ము భద్రంగా ఉందన్న నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. ఇలాంటి తరహాలో పలు కేసులు వస్తున్నందున బ్యాంకు ఖాతాల స్తంభనపై ఏకరూప విధానాన్ని రూపొందించాలని కేంద్ర హోం శాఖను ఆదేశించారు. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, ఇతర భాగస్వాములతో చర్చలు జరిపి మార్గదర్శకాలు, ప్రామాణిక నిర్వహణ విధానాలను రూపొందించాలని సూచించారు. ప్రస్తుత కేసులో పిటిషనర్ ఎలాంటి సైబర్ కేసులో నిందితుడుగానీ, అనుమానితుడుగానీ కాదని, కానీ మొత్తం ఖాతాను స్తంభింపజేశారని తెలిపారు. నేరంతో ఎలాంటి సంబంధం లేకపోయినా, అనుకోకుండా లబ్ధి పొంది ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈయూపై 25% సుంకం విధిస్తాం

అమెరికాను దెబ్బ తీయడానికే కూటమి.. ఉక్రెయిన్ నాటో సభ్యత్వాన్ని మరిచిపోవాలి

- మూడేళ్ల యుద్ధానికి అసలు కారణం అదే
- మంత్రివర్గ సమావేశంలో ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 27: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో బాంబు పేల్చారు. యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి దిగుమతుల మీద 25 శాతం సుంకం విధిస్తానని హెచ్చరించారు. ప్రపంచ వాణిజ్యంపై అమెరికా ఆధిపత్యాన్ని దెబ్బతీయడానికే యూరోపియన్ యూనియన్ కూటమి ఏర్పడిందంటూ మండిపడ్డారు. బుధవారం ఆయన తన మంత్రివర్గ సభ్యులతో తొలిసారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, కెనడా, మెక్సికోల మీద విధించిన 25 శాతం సుంకాలు ఏప్రిల్ 2 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఈయూ దేశాలు అమెరికాను తేలిగ్గా తీసుకుంటున్నాయన్నారు. అవి అమెరికా వాహనాలను, వ్యవసాయ ఉత్పత్తులను ఏదో ఒక సాకుతో తీసుకోవడం లేదని చెప్పారు. అమెరికా మాత్రం ఎలాంటి షరతులు లేకుండా యూరప్ ఉత్పత్తులను స్వీకరిస్తోందని అన్నారు. అమెరికా మిత్రులు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాల వల్ల అమెరికా భారీ వాణిజ్య లోటును ఎదుర్కొంటోందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ దేశాల నుంచి అమెరికాకు తయారీ రంగంలో 14 లక్షల కోట్ల రూపాయల లోటు ఉంటే సేవారంగంలో యూరోపియన్ యూనియన్ 9.5 లక్షల కోట్ల లోటును అమెరికా నుంచి ఎదుర్కొంటోంది. ఈయూ ప్రధానంగా రసాయనాలు, ఔషధాలను అమెరికాకు సరఫరా చేస్తుంటే, అమెరికా ప్రధానంగా సాఫ్ట్‌వేర్‌ను, ఇతర బిజినెస్ సొల్యూషన్లను యూరప్ దేశాలకు సరఫరా చేస్తోంది. ట్రంప్ ప్రకటనతో ఈయూ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. ప్రధానంగా కార్ల షేర్లు పడిపోయాయి.

ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ శుక్రవారం తనతో సమావేశం కానున్నట్లు ట్రంప్ ప్రకటించారు. నాటో సభ్యత్వం విషయంలో ఉక్రెయిన్ ఆశలు వదులుకోవాలని ట్రంప్ స్పష్టం చేశారు. అసలు ఉక్రెయిన్ నాటో సభ్యత్వం ఆకాంక్షల వల్లే సమస్య ఇక్కడిదాకా వచ్చిందని వ్యాఖ్యానించారు. త్వరలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కూడా సమావేశం జరుగుతుందని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. మూడేళ్లుగా జరుగుతున్న ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే పరిష్కారాన్ని ఆ సమావేశంలో కనుగొంటామన్నారు. చైనా బలప్రయోగంతో తైవాన్‌ను విలీనం చేసుకుంటే అమెరికా అనుమతిస్తుందా? అన్న ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి ట్రంప్ నిరాకరించారు. చైనాతో సత్సంబంధాలను కోరుకుంటున్నట్లు చెప్పారు.

గోల్డ్ కార్డుతో అమెరికా సంస్థల్లో భారతీయులకు ఉద్యోగాలు

అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీ పొందిన భారత్ సహా ఇతర విదేశీ విద్యార్థులకు యూఎస్‌ఏలోని కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేందుకు కూడా గోల్డ్‌కార్డు ఉపయోగపడుతుందని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. రూ.43.5 కోట్లు చెల్లించి గోల్డ్ కార్డు కొనుగోలు చేసిన వారికి అమెరికా శాశ్వత పౌరసత్వం ఇస్తామని ట్రంప్ బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతమున్న ఈబీ-5 వీసా స్థానంలో గోల్డ్ కార్డును తీసుకొస్తామని తెలిపారు. అయితే, ఈబీ-5లో ఉన్న ఉద్యోగాల కల్పన అవకాశాలు గోల్డ్ కార్డులో ఎలా ఉంటాయనే దానిని వివరించలేదు. ఈ అంశంపై గురువారం ఆయన స్పష్టత ఇచ్చారు. "భారత్, జపాన్, చైనా తదితర దేశాలకు చెందిన వారు హార్వర్డ్, వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి ప్రముఖ సంస్థల నుంచి డిగ్రీలు తీసుకుంటున్నారు. డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందుతున్నారు. కానీ, ప్రస్తుతమున్న నిబంధనల వల్ల వారు అమెరికాలో ఎంతకాలం ఉంటారనే విషయంలో అనిశ్చితి నెలకొని అవకాశాలు కోల్పోయి స్వదేశాలకు వెళ్లిపోతున్నారు. ఎంతో మేధస్సు కలిగిన వారంతా తమ దేశాల్లో వ్యాపారాలు ప్రారంభించి ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. అయితే, అలాంటి విద్యార్థులు తమ వద్ద పని చేయాలని అనుకునే కంపెనీలు గోల్డ్ కార్డు కొనుగోలు చేసి వారికి ఉద్యోగాలు ఇవ్వవచ్చు" అని ట్రంప్ పేర్కొన్నారు. రెండు వారాల్లో గోల్డ్ కార్డు విక్రయాలను ప్రారంభిస్తామని ట్రంప్ ఇదివరకే ప్రకటించారు.

కేంద్రం పన్నుల్లో రాష్ట్రాలకు మరింత కోత?

(మొదటి పేజీ తరువాయి)

కోతకు కేంద్రం సిద్ధమైనట్లు రాయిటర్స్ కథనం స్పష్టం చేసింది. 1980లో 20శాతంగా ఉన్న రాష్ట్రాల వాటా క్రమంగా 41శాతానికి పెరిగిందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో అందులో 1% కోతకు సన్నాహాలు చేస్తోందని పేర్కొంది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వానికి సుమారుగా రూ.35 వేల కోట్లు మిగులుతాయని, ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యే 2025-26 ఆర్థిక సంవత్సరంలో వసూలయ్యే పన్నులను బట్టి ఇది ఇంకా ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేసింది.

వ్యూహాత్మకంగా ముందుకు

పన్ను వాటా కోతకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు రాయిటర్స్ పేర్కొంది. తొలుత(బహుశా మార్చి నెలాఖరులోగా) మోదీ నేతృత్వంలో జరగనున్న కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 1% పన్ను వాటా కోతకు ఆమోదం తెలపనున్నట్లు వెల్లడించింది. వెంటనే ఆ ప్రతిపాదనను కేంద్ర ఆర్థిక సంఘానికి పంపుతుందని వివరించింది. అన్ని వర్గాలతో చర్చించిన తర్వాత.. అక్టోబరు 31లోపు కేంద్ర ఆర్థిక సంఘం 1% పన్ను వాటా కోతను అధికారికంగా సిఫారసు చేస్తుందని తెలిపింది. అయితే.. కేంద్ర క్యాబినెట్ ప్రతిపాదనను ఆర్థిక సంఘం అలాగే సిఫారసు చేయాలని లేదు. పన్ను వాటాను పెంచడం లేదా.. ఇంకా తగ్గించడం ఆర్థిక సంఘం చేతుల్లో ఉంటుంది. నిజానికి జీడీపీలో రాష్ట్రాలు 60% వాటాను అందిస్తున్నాయని, 2017 జులై నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చాక.. రాష్ట్రాలకు సొంతంగా పన్నులను పెంచుకునే అవకాశాలు లేకుండా పోయాయయని రాయిటర్స్ వివరించింది. కొవిడ్ సమయంలోనూ కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను విధించిందని, వాటిల్లో ఏమాత్రం వాటా దక్కకుండా.. రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని వివరించింది.


రాష్ట్రాలతో మరింత దూరం?

కేంద్ర ప్రభుత్వ తీరుపై బీజేపీయేతర రాష్ట్రాలు ఇప్పటికే గుర్రుగా ఉన్నాయి. 1% పన్ను కోత జరిగితే.. కేంద్రం-రాష్ట్రాల మధ్య దూరం మరింత పెరిగే ప్రమాదముందని ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే.. కేంద్ర ఆర్థిక సంఘం ప్రగతిశీలతను సాధించడమే శిక్షగా తమకు అన్యాయం చేస్తూ.. జనాభా పేరుతో ఉత్తరాదికి నిధులను తరలిస్తోందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హిందీ భాష విషయంలో తమిళనాడులోని స్టాలిన్ సర్కారు.. పన్నుల వాటా, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారంటూ పశ్చిమబెంగాల్ సహా.. దక్షిణాది రాష్ట్రాలు బహిరంగంగా ఆరోపణలు చేస్తున్న విషయం తెలిసిందే..!

డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో సొరంగం!?

- సర్కారు ముందుకు ఎస్ఎల్‌బీసీ ప్రత్యామ్నాయం
- సొరంగంలో 13.50 కి.మీ. నుంచి 50 మీటర్లు పక్కకు జరిగి 20వ కి.మీ. వద్ద లింక్
- ఈ పద్ధతిలో తవ్వితే త్వరగా పూర్తిచేయొచ్చని అంచనా
- ఎన్‌జీఆర్‌ఐ, ఎన్ఆర్ఎస్‌ఏ సూచనతో ప్రత్యామ్నాయ ప్రణాళిక

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు ముందుకు సాగుతాయా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పుడున్న టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం) కట్టర్ భాగం మినహాయించి మిగతా యంత్రమంతా ధ్వంసమైంది. సహాయక చర్యల్లో భాగంగా టీబీఎంను కట్ చేయాలని నిర్ణయించడంతో మళ్లీ పనులు ప్రారంభించాలంటే కొత్త యంత్రం కావాలి. పాత దాన్ని అక్కడి నుంచి తొలగించడం కూడా కష్టమైన పనే. కొత్త టీబీఎం అంటే నిర్మాణ సంస్థకు భారం కావడంతో పాటు ప్రభుత్వం కూడా ప్రాజెక్టు అంచనా వ్యయాలను పెంచాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు 18 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో నిర్మాణ సంస్థ జేపీ అసోసియేట్స్ ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. దాన్ని ప్రభుత్వం ముందు పెట్టనున్నట్లు సమాచారం. ఎన్‌జీఆర్ఐ, ఎన్ఆర్ఎస్ఏ సూచనలతో పాటు కంపెనీ చైర్మన్ పర్యటన సందర్భంగా ఇంజనీర్లు ప్రాజెక్టు పూర్తికి ఒక ప్రత్యామ్నాయ మ్యాప్‌ను సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆ ప్రణాళికను పరిశీలించిన తర్వాతనే టీబీఎంను కట్ చేయడానికి కూడా సర్కారు అంగీకరించినట్లు తెలుస్తోంది. ఆ ప్రత్యామ్నాయ మ్యాప్‌ను 'ఆంధ్రజ్యోతి' సంపాదించింది. ఇక టీబీఎంతో సొరంగం తవ్వడం అసాధ్యం కాబట్టి.. డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ (డీబీఎం) పద్ధతిలో టన్నెల్‌ను పూర్తిచేసుకోవచ్చని ఎన్‌జీఆర్ఐ నిపుణులు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ప్రమాదం 13.900 కి.మీ. వద్ద జరగ్గా.. 13.500 కి.మీ. వరకు బాగానే ఉంది. అక్కడి నుంచి 50 మీటర్లు కుడి వైపునకు తిరిగి పాత లెవల్‌ను కొనసాగిస్తూ 20వ కి.మీ. వద్ద పాత అలైన్‌మెంట్‌కు టన్నెల్‌ను కలపనున్నారు. ఇప్పటికే ఔట్‌లెట్ టన్నెల్ వైపు 20.435 కి.మీ. మేర తవ్వకం పూర్తయింది. పాత డిజైన్ ప్రకారం ఇంకో 3.545 కి.మీ. తవ్వాలి. కానీ, టీబీఎం చెడిపోవడంతో పనులు ఆగిపోయాయి. దీంతో ఔట్‌లెట్ టన్నెల్ తవ్వకాన్ని నిలిపివేసి ఇన్‌లెట్ నుంచి 50 మీటర్లు పక్కకు జరిగి 13.500 కి.మీ. నుంచి 20వ కి.మీ. వరకు డీబీఎం పద్ధతిలో టన్నెల్‌ను తవ్వుతారు. దీనివల్ల ప్రాజెక్టును త్వరగా పూర్తిచేసే అవకాశముంటుందని అంచనా. ప్రస్తుతం టన్నెల్ డయా 9.25 మీటర్లు వృత్తాకారంలో ఉండగా అది 10 మీటర్లకు 'హా' షేప్ సైజ్‌గా మార్చనున్నారు. ఈ డిజైన్‌ను ప్రభుత్వం ఆమోదించాల్సి ఉంది.



జేపీ కంపెనీ ఇంజనీర్లు తయారు చేసిన టన్నెల్‌కు ప్రత్యామ్నాయ ప్రణాళిక మ్యాపు

ప్రస్తుత టన్నెల్ తవ్వకం ఇలా..

ఈ ప్రాజెక్టు పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉంది. ఇక్కడ లిఫ్టులు పెట్టాలన్నా, కాలువలు తవ్వాలన్నా అటవీ అనుమతులు తప్పనిసరి. అవి రావడం చాలా కష్టం. 2005లో ఈ టన్నెల్ తవ్వకానికి జీవో ఇచ్చినప్పుడు టీబీఎంతో తవ్వకాలు చేపట్టాలని నిర్ణయించారు. రెండువైపుల నుంచి టన్నెల్ తవ్వకం చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకునే దగ్గర చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్ 19.500 కి.మీ.కు గాను ఇప్పటివరకు 13.935 కి.మీ. పూర్తయింది. ఇంకా 6.015 కి.మీ. సొరంగం తవ్వాల్సి ఉంది. రెండోవైపు నల్లగొండ జిల్లా మన్నేవారిపల్లి నుంచి అవుట్‌లెట్ టన్నెల్ 23.980 కి.మీ.కు గాను 20.435 కి.మీ.పూర్తయింది. మరో 3.545 కి.మీ. తవ్వాల్సి ఉంది. శనివారం ఇన్‌లెట్ టన్నెల్ వైపు ప్రమాదం జరిగింది. అయితే సొరంగం పనులు ప్రారంభిస్తే మళ్లీ కూలిపోయే ప్రమాదముందని నిపుణులు హెచ్చరించారు.

టన్నెల్ మధ్యలో ద్వారం!

25వ కిలోమీటర్ వద్ద ఏర్పాటుకు 30 ఏళ్ల క్రితమే అనుమతినిచ్చిన కేంద్రం!

- తిర్మలాపూర్ సమీపంలో ఏర్పాటుకు వెసులుబాటు
- 1994 ఏప్రిల్ 22న కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనుమతి
- వెలుగులోకి ఆ కీలక రికార్డు
- ద్వారంతో టన్నెల్ తవ్వకం సులభమయ్యే చాన్స్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): "శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం మధ్యలో బయటికి వెళ్లే దారి లేనందువల్లే టన్నెల్ తవ్వకంలో సమస్యలు వస్తున్నాయి. సొరంగం మధ్యలో దారి ఉంటే టన్నెల్ తవ్వకం మరో విధంగా ఉండేది" ప్రస్తుతం ప్రతి ఇంజనీరింగ్ నిపుణుడి నోటా వ్యక్తమవుతున్న అభిప్రాయమిది. టన్నెల్ పైకప్పు కూలి.. ప్రమాదం జరగడం, అందులో చిక్కుకున్న వారిని కాపాడేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో బయటికి వెళ్లే దారి (యాడిట్) అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఇన్నాళ్లుగా.. సొరంగానికి బయట ద్వారం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతి లేదంటూ అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతూ వచ్చారు. కానీ, వారు చెప్పినవి అవాస్తవాలు అని, యాడిట్ ఏర్పాటుకు అనుమతి ఉందని చెప్పే కీలక పత్రం ఒకటి తాజాగా వెలుగులోకి వచ్చింది. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతం, పులుల అభయారణ్యం కావడంతో యాడిట్ ఏర్పాటుకు అనుమతిని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నిరాకరించిందన్నది అవాస్తవమని తేలింది. మూడు దశాబ్దాల కిందటే యాడిట్ తవ్వకానికి కేంద్రం అనుమతినిచ్చిన విషయం స్పష్టమవుతోంది. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టుకు 1994 ఏప్రిల్ 22న పర్యావరణ అనుమతి లభించింది. ఆ అనుమతి పత్రంలో పలు షరతులు/వెసులుబాట్లను పేర్కొన్న పర్యావరణ మంత్రిత్వ శాఖ.. అందులో మూడో పేరాలోనే యాడిట్ ఏర్పాటుకు వెసులుబాటు కల్పించింది. టన్నెల్ వెళ్లే మార్గమంతా అమ్రాబాద్ మండల పరిధిలో ఉండగా.. అదే మండలంలోని తిర్మలాపూర్ గ్రామ సమీపంలో ఆదిమజాతి గిరిజనులు (పీటీజీ) నివాసముండే ప్రాంతానికి సమీపంలో టన్నెల్ మధ్యలో 25 కిలోమీటర్ల వద్ద యాడిట్ ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది.

ఏకకాలంలో రెండు వైపుల నుంచి తవ్వకం..

ఈ ప్రాజెక్టులో 43 కిలోమీటర్ల మేర ఒకటే టన్నెల్‌ను ప్రతిపాదించగా.. ఇందుకోసం ఓవైపు ఇన్‌లెట్ (దోమలపెంట) నుంచి, మరో వైపు ఔట్‌లెట్ (మన్నెవారిపల్లి) నుంచి తవ్వుకుంటూ పోవాలని నిర్ణయించారు. ఈ మేరకు శ్రీశైలం రిజర్వాయర్‌లోని నీటిని తీసుకునే ప్రాంతం నుంచి చేపట్టిన ఇన్‌లెట్ టన్నెల్‌ను 13.936 కిలోమీటర్లు తవ్వగా, అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి నుంచి 20.436 కిలోమీటర్లు తవ్వారు. మరో 9.56 కిలోమీటర్ల మేర రెండువైపుల నుంచి తవ్వితే టన్నెల్ పూర్తవుతుంది. కాగా, ఇన్‌లెట్ నుంచి టన్నెల్ 25 కిలోమీటర్ల వద్ద యాడిట్ ఏర్పాటుకు అనుమతి ఉన్న నేపథ్యంలో మన్నెవారిపల్లి నుంచి 18వ కిలోమీటర్ వద్ద దీనిని పెట్టుకునే వెసులుబాటు లభించినట్లయింది. ప్రభుత్వం దీనిని చేపడితే టన్నెల్ తవ్వకం సులువవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా.. టన్నెల్ తవ్వకం అనంతరం టీబీఎంలను బయటికి తీసేందుకు, నిరంతర/అత్యవసర నిర్వహణ పనులకూ యాడిట్ ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. కాగా, ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టును 2005 ఆగస్టు 11న రూ.2,813 కోట్ల నిర్మాణ అంచనాలతో చేపట్టడానికి ప్రభుత్వం పరిపాలనపరమైన అనుమతినిచ్చింది. ఈ మేరకు 2005లోనే టన్నెల్ పనులకు రూ.2,259 కోట్లతో ఈపీసీ విధానంలో టెండర్లు పిలవగా.. జయప్రకాష్ అసోసియేట్ (జేపీ అసోసియేట్) 9 శాతం తక్కువకే పనులు దక్కించుకుంది. రూ.1925 కోట్లతో 2005 ఆగస్టు 25న ఒప్పందం కుదిరింది. ఇప్పటిదాకా రూ.2,689 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఆ తర్వాత దీని అంచనాలను రూ.3,152 కోట్లకు, మళ్లీ గతేడాది అక్టోబరు 14న రూ.4,637.75 కోట్లకు సవరించారు.

అనుమతుల సమయంలోనే ప్రతిపాదన

ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 43 కిలోమీటర్లకు పైగా పొడవున తవ్వుతున్న నేపథ్యంలో.. మధ్యలో సొరంగం నుంచి బయటికి వెళ్లే ద్వారం కచ్చితంగా ఉండాల్సిందేనని 1994లో పర్యావరణ అనుమతుల సమయంలోనే ప్రతిపాదించారు. శ్రీశైలం నుంచి మన్నెవారిపల్లికి వచ్చే మార్గంలో టన్నెల్ 25 కిలోమీటర్ల వద్ద తిర్మలాపూర్ గ్రామం సమీపంలో ఈ యాడిట్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదన ఉంది. అయితే ఉమ్మడి రాష్ట్రంలోనే ఈ టన్నెల్ పనులు ప్రారంభం కాగా, యాడిట్ ఏర్పాటు విషయాన్ని ఏ దశలోనూ పట్టించుకోలేదు. దాంతో టన్నెల్ పనులు క్లిష్టతరంగా మారిపోయాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 10 ఏళ్ల పాటు ఈ ప్రాజెక్టు ప్రాధాన్యం లేని జాబితాలో ఉండిపోయింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా.. ఈ ప్రాజెక్టుపై పలు సభల్లో పెదవి విరిచారు. ఈ సొరంగానికి యాడిట్ లేదని చెప్పారు. టన్నెల్ తవ్వకం పూర్తయ్యాక ఇన్‌లెట్, ఔట్‌లెట్ నుంచి తవ్వుకుంటూ వచ్చే టీబీఎంలను అటు ఇటు పక్కకు తవ్వి.. కప్పేయాలని ఉందన్నారు. వాస్తవానికి యాడిట్ లేకపోతే చేయాల్సింది కూడా అదే. కానీ, యాడిట్‌కు వెసులుబాటు ఉండటంతో దాని ఆధారంగా టీబీఎంలను బయటికి తీయడమే కాకుండా.. టన్నెల్ తవ్వకం సులభతరం అయ్యే అవకాశాలూ ఉంటాయి.

యాడిట్ పెట్టండి.. ఎంత ఖర్చయినా భరిస్తాం!

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)కి చెందిన నిపుణులు ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని గుర్తించడానికి వీలుగా చర్యలు తీసుకుంటున్నారని రెవెన్యూ(విపత్తులు) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ మంత్రికి నివేదించారు. ప్రతి షిఫ్టులో 20 మంది చొప్పున మూడు షిఫ్టుల్లో సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఇన్‌లెట్ నుంచి 14 కిలోమీటర్ల వద్ద ఒక యాడిట్ పెడితే.. ముందు సహాయక చర్యలు, టన్నెలింగ్ పనులు, నిర్వహణకు ఉపయుక్తంగా ఉంటుందని అర్వింద్‌కుమార్ గుర్తు చేయగా.. తగిన అనుమతి తీసుకొని పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. యాడిట్ నిర్మాణానికి ఎంత ఖర్చయినా నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని నిర్మాణ సంస్థ (జేపీ అసోసియేట్) ప్రతినిధులకు తెలిపారు. సహాయక పనులు నిరంతరం కొనసాగించాలన్నారు. సహాయక చర్యలకు అడ్డంగా ఉన్న వస్తువులను తొలగించడానికి రైల్వే నుంచి ప్లాస్మా కటింగ్ మిషన్, బ్రోకో కటింగ్ మిషన్, అల్ట్రా థర్మిక్ కటింగ్ మిషన్‌లు వినియోగిస్తున్నామని మంత్రికి అధికారులు నివేదించారు. గురువారం ఉదయం వెళ్లగానే అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి.. మళ్లీ సాయంత్రం హైదరాబాద్‌కు తిరిగి వచ్చే క్రమంలో సహాయక చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విపత్తు దళానికి చెందిన నిపుణులు దెబ్బతిన్న కన్వేయర్‌ను తొలగిస్తే సహాయక చర్యలు ముమ్మరం చేస్తామని నివేదించగా.. కన్వేయర్ తొలగిస్తే మళ్లీ మరమ్మతులు చేయడం కష్టమని, సహాయక చర్యల కోసం లోకో ట్రైన్‌ను వినియోగించుకోవాలని, పరికరాలన్నీ సొరంగంలోకి లోకో ట్రైన్ తీసుకెళుతుందని నిర్మాణ సంస్థ ప్రతినిధులు గుర్తు చేశారు. సొరంగంలో ప్రమాదం జరిగిన ప్రదేశం కచ్చితంగా ఎక్కడ ఉంది? చిక్కుకున్నవారు ఎక్కడున్నారనే వివరాలు కనుక్కోవడానికి వీలుగా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ (జీపీఆర్) యంత్రాన్ని పంపించారు. ఈ యంత్రం గురువారం రాత్రికల్లా వివరాలతో బయటికి రానుందని అధికారులు చెబుతున్నారు.

బురద తొలగింపు షురూ

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూలు/దోమలపెంట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. 15 అడుగుల ఎత్తులో పేరుకుపోయిన 10వేల క్యూబిక్ మీటర్ల మట్టి, బురదను తొలగించే ప్రక్రియను గురువారం ప్రారంభించారు. లోకో ట్రైన్‌లో ఏర్పాటు చేసిన 3 కంటెయినర్ల ద్వారా బురదను బయటకు తీసుకొస్తున్నారు. బురద ఎక్కువగా ఉండడం, బయటకు తీసుకొచ్చే సామర్థ్యం తక్కువగా ఉండడంతో సహాయక చర్యల పూర్తికి చాలా సమయం పట్టే పరిస్థితి నెలకొంది. 11 ఏజెన్సీల ఆధ్వర్యం లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బురద, ఐరన్ వ్యర్థాల క్లియరెన్స్, టీబీఎం కటింగ్ పనులపై ఏజెన్సీలు దృష్టి సారించాయి. టీబీఎం సామగ్రి మొత్తం 80 టన్నుల వరకు ఉంటుందని అంచనాలున్నాయి. వీటిని తరలించడం కష్టసాధ్యంగా మారింది. టీబీఎంను కట్ చేయడానికి 7ప్లాస్మా కట్టర్లను తీసుకురాగా.. ఇప్పటికే 10గ్యాస్ కట్టర్లు అందుబాటులో ఉన్నాయి. రైల్వే శాఖకు చెందిన కట్టర్ల బృందం కూడా వచ్చింది. బురద తొలగింపునకు లోకో ట్రైన్‌లో 3 చిన్న కంటెయినర్లు మాత్రమే వినియోగిస్తున్నారు.

ఓయూ పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు గడువు మార్చి 1

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 1 చివరి తేదీ. దరఖాస్తు ఫీజు రూ.2,000. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. రూ.2,000 ఆలస్య రుసుముతో మార్చి 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు పీజీలో 50శాతం మార్కులు, ఇతరులు 55శాతం మార్కులు కలిగి ఉండాలి. ప్రవేశ పరీక్ష ద్వారా అడ్మిషన్లు కల్పించనున్నారు. 70 మార్కులకు సీబీటీ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు. జేఆర్ఎఫ్ అర్హత సాధించినవారు, యూజీసీ నెట్, సీఎస్ఐఆర్, ఐసీఎంఆర్ ఉత్తీర్ణులైనవారు సైతం పరీక్ష ద్వారానే అడ్మిషన్లు పొందాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్లను సందర్శించవచ్చని అధికారులు సూచించారు.

చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకుని మహిళ మృతి

సదాశివపేట, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకుని ఓ మహిళ మృతి చెందింది. ఈ దుర్ఘటన సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. సీఐ మహేష్ కుమార్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ గాజుల రామారానికి చెందిన నడిమిదొడ్డి సామిల్(55), ఆయన భార్య వేదమణి(45) బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్నారు. వారు సదాశివపేట పట్టణ పరిధి వెంకటాపూర్ గ్రామ సమీపంలో 65వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపైకి చేరుకుంటున్న సమయంలో వేదమణి చీర కొంగు బైక్ చక్రంలో చిక్కుకుంది. దాంతో ఆమె ఒక్కసారిగా కింద పడి, తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది.

పోలీసుల కళ్లుగప్పి రాణా నుంచి ప్రేమజంట పరార్

- భద్రాద్రి జిల్లా పాల్వంచటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఘటన

పాల్వంచ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రేమ జంట పోలీసుల కళ్లుగప్పి ఠాణా నుంచి పరారైన ఘటన భద్రాద్రి జిల్లాలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పాల్వంచ మండలానికి చెందిన బాలిక(17) పాల్వంచ టౌన్ పరిధిలోని ఓ కళాశాలలో చదువుతోంది. ఈ నెల 23న ఆ బాలిక అదృశ్యమవడంతో ఆమె తల్లిదండ్రులు పాల్వంచ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో గురువారం సదరు బాలిక ఓ యువకుడితో కలిసి ఆ పోలీస్‌స్టేషన్‌కు వచ్చింది. తామిద్దరం ప్రేమించుకుంటున్నామని, తమకు వివాహం చేయాలని పోలీసు అధికారులను కోరింది. అయితే ఆ బాలిక మైనర్ కావడంతో వివాహం చేయడం సాధ్యంకాదని చెప్పిన పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో ఆందోళనకు గురైన బాలిక వాష్ రూంకు వెళ్లి వస్తానని చెప్పి తన ప్రియుడితో కలిసి పోలీసుల కళ్లుగప్పి స్టేషన్ నుంచి పరారైంది. ఇది తెలిసిన పోలీసులు షాక్‌కు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ గురువారం స్వయంగా పాల్వంచ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి విచారించారు. ఈ సందర్భంగా పోలీసుల నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. అంతేకాకుండా ఈ కేసు పర్యవేక్షణ బాధ్యతలను తాత్కాలికంగా మరో అధికారికి అప్పగించినట్లు సమాచారం.

ఎస్ఎల్‌బీసీ అత్యంత క్లిష్టమైన టన్నెల్

- దేశంలో ఇతర టన్నెల్ ప్రమాదాలకు ఇది భిన్నం
- టన్నెలింగ్‌కు టీఎస్పీ విధానం అనుసరించాల్సిందే
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో బీఆర్‌వో మాజీ ఏడీజీ పురుషోత్తం, ఆర్మీ టన్నెలింగ్ నిపుణుడు మెహ్రా

(ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)


పురుషోత్తం, పరిక్షిత్ మెహ్రా

'శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ అత్యంత క్లిష్టమైనది. దేశంలో అత్యంత పొడవైన టన్నెల్. మధ్యలో ఎక్కడా కూడా యాడిట్ (బయటకు వెళ్లే ద్వారం లేదు). దేశంలో చాలా టన్నెల్ ప్రమాదాలు చూశాం. కానీ వాటికి, ఎస్ఎల్‌బీసీకి సారూప్యం లేద'ని సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ వో) మాజీ అదనపు డైరెక్టర్ జనరల్ పురుషోత్తం, చండీగఢ్ వెస్టర్న్ కమాండ్ టన్నెలింగ్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా అన్నారు. వాస్తవానికి టన్నెలింగ్ చేస్తున్నప్పుడు ఏం జరుగుతుందనేది ఊహించలేమని పేర్కొన్న వారు ముందు ఎస్ఎల్‌బీసీ విషయంలో టన్నెల్‌సెస్మిక్ ప్రిడిక్షన్ (టీఎస్పీ) విధానాన్ని అనుసరించాలని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యలు చేపట్టడానికి వెళుతున్న వారిని 'ఆంధ్రజ్యోతి' ఉమ్మడిగా ఇంటర్వ్యూ చేసింది. ఆ వివరాలు...

సహాయక చర్యల పూర్తికి ఎంత సమయం పట్టొచ్చు?

పురుషోత్తం, మెహ్రా: కచ్చితంగా చెప్పలేం. ఉత్తర కాశీ సిల్కియారాలో టన్నెల్ కూలిన ప్రాంతానికి, టీబీఎం (టన్నెల్ బోరింగ్ మిషన్)కు మధ్య చాలా ఎడం ఉంది. దాంతో ఆ ప్రాంతంలో చిక్కుకున్న వారిని చాలా రోజుల తర్వాతైనా సురక్షితంగా బయటకు తీసుకురాగలిగాం. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో అలా కాదు. పైకప్పు కూలిన ప్రాంతానికి, టీబీఎం మధ్య గ్యాప్ లేదు. మట్టి, బురద, రాళ్లు అందులో పనిచేసేవారి మీద, టీబీఎం మీద పడ్డాయి. ప్రమాదం జరిగిన ప్రాంతం 13 కిలోమీటర్ల మేర దూరం ఉంది. దాంతో సరైన పరీక్షలు చేసి, మట్టి ఎక్కడ ఉంది వంటి అంశాలను గమనించిన తర్వాత సహాయక చర్యలు ఎన్ని రోజుల పాటు జరుగుతాయో తేలనుంది. వారం రోజుల్లోపు పూర్తి చేయడానికి అవకాశం ఉంది.

టన్నెల్‌లో ప్రమాదాలను నివారించవచ్చా?

పురుషోత్తం, మెహ్రా: టన్నెల్‌లో ప్రమాదాలను ఊహించలేం. దేశంలోనే కాదు ప్రపంచంలోనూ టన్నెల్‌లో ప్రమాదాలు సాధారణం. భూమి పరిస్థితిని అంచనా వేసుకొని ముందుకెళ్లాల్సి ఉంటుంది. ఎస్ఎల్‌బీసీలో ఇన్‌లెట్ వైపు బురదతో పాటు సీపేజీ చాలా ఉంది. హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ టన్నెల్‌లో 20 సార్లు ప్రమాదం జరిగినా ప్రాణనష్టం జరుగలేదు. బార్పతి టన్నెల్‌లో టీబీఎం ఇరుక్కుపోయింది. ఉత్తర కాశీ సిల్కియారా టన్నెల్‌లో ప్రమాదం జరిగిన ప్రదేశానికి, టీబీఎంకు మధ్య 200 మీటర్ల గ్యాప్, గాలి, వెలుతురు, ఆహారం ఉండటం వల్ల చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటికి తేగలిగాం. కానీ ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో అలాంటి పరిస్థితి లేదు. అందుకే నిర్ణీత వ్యవధిలో సహాయక చర్యలు చేపట్టలేని పరిస్థితి. ఇప్పటికైనా టన్నెల్ లోపల నిరంతర పరిశీలనకు వీలుగా జీపు లేదా చిన్నవ్యాన్ వచ్చి వెళ్లేలా యాడిట్ ఏర్పాటు చేసుకోవాలి.

ఇంత పెద్ద టన్నెల్ ప్రపంచంలో ఉందా?

పురుషోత్తం, మెహ్రా: రైల్వే టన్నెల్ ఉన్నప్పటికీ నీటిని తరలించే టన్నెల్‌లో ఇప్పటిదాకా ఇదే పెద్దది. అత్యంత క్లిష్టమైన టన్నెల్ కూడా. ఎస్ఎల్‌బీసీలో డీవాటరింగ్ ప్రక్రియ పూర్తయింది. ఇక ముందు టన్నెలింగ్ చేసుకోవాలంటే విధిగా జియోఫిజికల్ పరీక్షలు చేసుకుని, టీఎస్పీ విధానంతో ముందుకెళ్లాలి. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ జాతీయ సంపద. సహాయక చర్యల అనంతరం ఈ పథకాన్ని పూర్తి చేసుకోవాలి.

హరీశ్.. మాట్లాడేందుకు సిగ్గుండాలి

మీ సర్కారు విధానాలతోనే ప్రాజెక్టులు దెబ్బతిన్నాయ్.. ఎస్ఎల్‌బీసీ జాప్యానికి బీఆర్ఎస్సే కారణం

- 3 నెలల్లో టన్నెల్ పనులు ప్రారంభిస్తాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

నాగర్‌కర్నూల్/వనపర్తి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల కారణంగానే సాగునీటి ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఘటనకు ప్రధాన కారణం గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారేనని ధ్వజమెత్తారు. గురువారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించిన అనంతరం ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. 'హరీశ్.. మీ సలహాలు మాకు అవసరం లేదు. మీకంటే నిపుణులైన వారే సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. తెలంగాణలో జేబులు నింపుకోవడానికి ఇరిగేషన్ శాఖను నాశనం చేసింది కేసీఆరే. దేవాదుల, సీతారామ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు? మాట్లాడేందుకు సిగ్గుండాలి. మేమే మీకన్నా ఎక్కువ పని చేశామని చెప్పడం విడ్డూరంగా ఉంది. హరీశ్‌రావు, నిరంజన్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి చెప్పినవన్నీ అబద్ధాలే. హరీశ్ మీకు సిగ్గుండాలి. మీ ప్రభుత్వంలో ఇలాంటి ఘటనలు జరిగితే లోపలికి అనుమతించకుండా నియంత పాలన చేశారు. రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు పెట్టిన ప్రాజెక్టులన్నీ నిరుపయోగంగా మారాయి. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్కేంద్రంలో అగ్నిప్రమాదం జరిగినపుడు అక్కడికి వెళ్తున్న రేవంత్‌ను అరెస్టు చేశారు. కాళేశ్వరంలో ఆరుగురు చనిపోతే ఎవరూ సమాధానం చెప్పలేదు. పాలమూరు రంగారెడ్డిలో పంపు కూలి ఆరుగురు చనిపోతే కనీసం స్పష్టత ఇవ్వలేదు. 25 మంది పిల్లలు కేసీఆర్ ఫాంహౌస్ దగ్గర చనిపోతే పట్టించుకున్న నాథుడే లేడు. జగన్‌తో కుమ్మక్కై కృష్ణా జలాల్లో రాష్ట్రానికి అన్యాయం చేశారు. అలాంటి మీరు ఎస్ఎల్‌బీసీ ఘటనపై మాట్లాడడం సిగ్గుచేటు' అని బీఆర్ఎస్ నేతలపై ఉత్తమ్ మండిపడ్డారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో మరో మూడు రోజులు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుందని చెప్పారు. 3 నెలల్లో సొరంగం పనులు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీఆర్ఎస్‌కు ఆ అర్హత లేదు: జూపల్లి

ఎస్ఎల్‌బీసీని పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిచేయకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. వనపర్తిలో గురువారం మీడియాతో మాట్లాడారు. హరీశ్‌రావు ఎస్ఎల్‌బీసీవద్దకు వెళ్లారని, తాము అడ్డుకోలేదని చెప్పారు. ఆయన అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రమాదంపై ప్రశ్నించే అర్హత బీఆర్ఎస్‌కు లేదని.. 2007లో ప్రారంభమైన ప్రాజెక్టు పనుల్లో సింహభాగం కాంగ్రెస్ హయాంలోనే పూర్తయ్యాయని చెప్పారు.

ఆనాడు అనుమతిచ్చారా?: మహేశ్‌గౌడ్

ఎస్ఎల్‌బీసీ వద్ద హడావుడి చేస్తూ పత్రికలకు పోజులిస్తున్న హరీశ్‌రావు.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ దశలో సందర్శించేందుకు ఏ మీడియా ప్రతినిధికైనా అనుమతినిచ్చారా అంటూ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం నిర్మిస్తే.. బాహుబలి మోటార్లు వరద నీటిలో ఎందుకు మునిగాయని నిలదీశారు. వీటిపై చర్చకు సిద్ధమా అంటూ హరీశ్‌కు సవాల్ విసిరారు.

సర్కారు వైఫల్యమే

(మొదటి పేజీ తరువాయి)


టన్నెల్ పరిశీలనకు అనుమతించకపోవడంతో బైఠాయించిన హరీశ్‌రావు తదితరులు

లేదా, ఆయనకు ఎమ్మెల్సీ ఎన్నికలే ముఖ్యమయ్యాయా అని ప్రశ్నించారు. టన్నెల్‌లో సహాయక చర్యలు నామమాత్రంగా జరుగుతున్నాయని, ఆరు రోజుల్లో తట్టెడు మట్టి కూడా బయటికి తీయకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్‌లో కుర్చీల కొట్లాట మొదలైందని, ప్రజా సమస్యలను గాలికొదిలేసి మంత్రులు హెలికాప్టర్లలో విహారయాత్రలు చేస్తున్నారని, ఇంటర్వ్యూలు ఇవ్వడంలో పోటీ పడుతున్నారని విమర్శించారు. గురువారం హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేతలు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మర్రి జనార్ధన్ రెడ్డి తదితరులు టన్నెల్‌ను పరిశీలించేందుకు దోమలపెంట చేరుకున్నారు. పోలీసులు ముందు అనుమతించినా ఎక్కువమంది సభ్యులు గుంపుగా వెళుతుండటం, ఫొటోగ్రాఫర్లు, అనుమతి లేని వ్యక్తులు ఉండడంతో అభ్యంతరం తెలిపారు. దీంతో బీఆర్ఎస్ బృందం కొద్దిసేపు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపగా తర్వాత కొంతమందిని అనుమతించారు. సొరంగం లోపలికి వెళతామన్న వారి అభ్యర్థనను అధికారులు తిరస్కరించారు. ఈ సందర్భంగాను, అంతకు ముందు గండిపేట మండలం కోకాపేట్‌లో తన నివాసం వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. ఆరో రోజు కూడా కన్వేయర్ బెల్టు పునరుద్ధరణ జరగలేదని, టన్నెల్ బోరు మెషీన్ శిథిలాలను బయటకు తీయడానికి నాలుగు రోజుల సమయం అవసరమా అని ప్రశ్నించారు. టన్నెల్‌లో భారీ ప్రమాదం జరిగితే ప్రభుత్వాన్ని మొద్దునిద్ర ఆవహించిందని అన్నారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల కోసం కక్కుర్తి పడుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే టన్నెల్ కూలిందని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడటానికి సిగ్గుండాలని వ్యాఖ్యానించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో రూ.3,300 కోట్ల పని జరిగితే... పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్ఎల్‌బీసీకి రూ.3,900 కోట్లు కేటాయించామన్నారు. వరుసగా రెండేళ్లు కరోనా వచ్చినా 12 కిలోమీటర్ల టన్నెల్‌ను పూర్తి చేశామన్నారు. రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనలో 15 మీటర్లు కూడా సొరంగాన్ని తవ్వలేదన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు పార్టీ మారగానే ప్లేట్ ఫిరాయిస్తున్నారని, దిగజారుడు రాజకీయాలకు పూనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15నెలల్లో ఖమ్మం జిల్లాలో పెద్దవాగు ప్రాజెక్టు కొట్టుకుపోయిందన్నారు. సుంకిశాల కుప్పకూలిందని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో వట్టెం పంపుహౌజ్ నీట మునిగిందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు జలకళను కోల్పోయిందని, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు నుంచి జలదోపిడీ జరుగుతుంటే రేవంత్‌రెడ్డి ఎందుకు నోరు మెదపడంలేదని ప్రశ్నించారు. టన్నెల్‌లోకి వెళ్లి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలనుకుంటే పోలీసులు అడ్డుకున్నారని, ప్రజాప్రతినిధులను ఇలా అణచివేస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ముగిసిన మహావేడుక

దేశాన్ని నలభైఐదురోజులపాటు మరో ఊసులేకుండా ముందుకు కదిలించిన మహాకుంభమేళా ఘనంగా ముగిసింది. ఆద్యంతమూ అద్భుతంగా సాగిన ఈ ఆధ్యాత్మిక వేడుకలో ఎవరైనా అసౌకర్యానికి గురి అయివుంటే క్షమించమని కోరారు ప్రధానమంత్రి నరేంద్రమోదీ. కుంభమేళాను జాతి ఐక్యతకోసం జరిగిన మహాయజ్ఞంగా, దేశం కొత్త శక్తితో సాగుతోందనడానికి ప్రబల నిదర్శనంగా, నవశకానికి నాందిగా పలు రీతుల్లో, విశేషణాలతో ఆయన అభివర్ణించారు. ఇంతటి మహోన్నత కార్యం మోదీ కారణంగానే సుసాధ్యమైందని యోగి ఆదిత్యనాథ్ సవినయంగా ప్రశంసిస్తే, యోగి ప్రభుత్వాన్ని ప్రధాని అభినందించారు. పరస్పర సహకారంతో, సాధ్యమైనంత సవ్యంగా నిర్వహించిన బృహత్ కార్యం కనుక డబుల్ ఇంజన్ సర్కార్‌ను అభినందించవలసిందే.

సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ, అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా నలభై ఐదురోజుల పాటు పుణ్యస్నానాలు నిరంతరాయంగా కొనసాగాయి. సంక్రాంతినుంచి మహాశివరాత్రివరకూ గంగా తీరం నిత్య జన ప్రవాహంతో ధగధగలాడింది. సాధారణ రోజుల్లోనే జనం కిటకిటలాడుతూంటే, పర్వదినాల్లో ఆ సందోహం లెక్కకు అందనిది. మూడు అమృతస్నానాలతో వైభవంగా సాగిన మహాకుంభమేళాలో ఆఖరురోజున మహాశివరాత్రి కూడా తోడై ఘాట్లన్నీ మహదేవుని నామస్మరణతో మారుమోగిపోయాయి. వారూ వీరని లేదు, సామాన్యులనుంచి అసామాన్యులవరకూ అందరూ మూడునదుల్లో మునకలేసి తరించారు. దేశపాలకులు, పారిశ్రామికవేత్తలు, సినీతారలు, క్రీడాకారులు అందరినీ ఒకచోటకు చేర్చింది ఈ పుణ్యస్థలి.

డబుల్ ఇంజన్ సర్కారు కుంభమేళాను రాజకీయం చేసిందనీ, సొంత ప్రచారానికి వాడుకుందని విపక్షాలు విమర్శించడం, బీజేపీ నాయకులు ఎదురుదాడిచేయడం చూస్తున్నదే. మహాకుంభ్‌లో ఎవరు ఏది కోరుకుంటే అదే దక్కుతుందనీ, రాబందులకు కళేబరాలు, పందులకు చెత్త కనిపించాయని యోగి వ్యాఖ్యానించి కసితీర్చుకున్నారు. కుంభమేళాలో మునకలు వేయనందుకు రాహుల్‌గాంధీని, ఉద్ధవ్‌థాక్రేను హిందూ ఓటర్లు ముంచేయాలని కోరుతున్నారు కేంద్రమంత్రి రాందాస్ అఠవలే. ఈ వాదోపవాదాలను అటుంచితే, ప్రధాని వ్యాఖ్యానించినట్టుగా ఇంతటి మహాజాతరలను నిర్వహించడం అంత సులభం కాదు. లెక్కకు చిక్కనంతమంది ప్రవాహంలాగా వచ్చిపడుతున్నందున ఏర్పాట్లు ఎంత ఘనంగా ఉన్నప్పటికీ, తప్పటడుగులు పడ్డాయి, తప్పిదాలూ జరిగాయి. నిజానికి, ప్రజలు అసౌకర్యాలకు సిద్ధపడే పుణ్యస్నానాలకు తరలివచ్చారు. లేమి గురించి బాధపడకుండా ఉన్నదానికే సంతృప్తిపడ్డారు. ఈ మారు పుణ్యాన్నీ వ్యాపారాన్నీ కలగలిపి మాధ్యమాల్లో సాగించిన విపరీత ప్రచారం కోట్లాదిమందిని ప్రయాగ్‌రాజ్‌కు మళ్ళించిందన్న విమర్శలను అటుంచితే, మౌని అమావాస్య సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఈ మహాకార్యంలో మరిచిపోలేని విషాదం. మృతులు, బాధితుల లెక్కలు రోజంతా విప్పకుండా దాచిపెట్టినందువల్ల, ఆ తరువాత చెప్పిన అధికారిక లెక్కలకు కూడా విశ్వసనీయత లేకుండా పోయింది. వందలాదిమంది మరణించారనో, మృతదేహాలను నీళ్ళలో పడేశారనో విపక్షనేతలు వ్యాఖ్యానించేందుకు అవకాశం ఏర్పడింది. తొక్కిసలాట ఘట్టానికి మీడియాలో ప్రచారం దక్కకుండా నియంత్రించడంవల్లనే యాత్రికుల ప్రవాహం నిరవధికంగా సాగిందని కొందరు నేతలు వాదించవచ్చు. అవసరం తీరింది కనుక, ఇప్పటికైనా ఆ నిజం అది ఎంత చేదుగా ఉన్నప్పటికీ, విప్పితేనే విశ్వసనీయత అన్నది మిగులుతుంది. ఈనెల 15న న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో జరిగిన ప్రమాదం కూడా ముందుచూపు ఉన్న పక్షంలో నివారించదగిందే. ఇక, నీటి నాణ్యతకు సంబంధించిన అధ్యయనాలు, నివేదికలమీద యూపీ ముఖ్యమంత్రి నిప్పులు చెరగడం సముచితంగా లేదు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికని పూర్తిగా కొట్టిపారేస్తూ, స్నానానికే కాదు, తాగడానికి కూడా ఆ నీళ్ళు పనికొస్తాయని యోగి వాదించారు. ఆ నివేదికను పూర్వపక్షం చేసేందుకు అనంతరం ఆయన చాలా కష్టపడ్డారు. పర్వదినాల్లో కోట్లాదిమంది మునకలేసినప్పుడు నీరు పరిశుభ్రంగా ఉండాలన్న నియమం ఏమీ లేదు. అది సహజమనీ, తాత్కాలికమని సర్దిచెబితే సరిపోతుంది. కానీ, విమర్శలకు జవాబుచెప్పుకోవాల్సిన ప్రతీ సందర్భంలోనూ తమను ప్రశ్నిస్తున్నవారంతా విదేశీశక్తులతో చేయి కలిపి మన మతాన్ని, సంస్కృతినీ కించపరుస్తున్నారన్నంత స్థాయిలో పాలకపక్షం వ్యాఖ్యానించడం అవసరం లేనిది.

శశి థరూర్ రాజకీయ ప్రస్థానం ఎటు?

'కాంగ్రెస్‌కు నా సేవలు అవసరం లేకపోతే నాకు ఇంకా బోలెడు వ్యాపకాలు, వ్యాసంగాలు ఉన్నాయి' అని శశి థరూర్ ఒక మలయాళీ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించారు. తీవ్ర భావావేశాలను పురిగొల్పే అధునాతన సామాజిక మాధ్యమాల యుగంలో వివాదాలు భగ్గుమనేందుకు ఒకే ఒక్క ట్వీట్, 20 సెకన్ల సౌండ్ బైట్ సరిపోవూ? కాంగ్రెస్ నాయకుడు శశి థరూర్ ఇటీవల ఒక ఇంటర్వ్యూలో తాను చెప్పిన దానికి లేదా చెప్పని దానికి పార్టీలో వివాదాస్పదుడు అయ్యారు. వివాదాలకు కేంద్రం కావడం శశి థరూర్‌కు ఇదే మొదటిసారి కాదు. ప్రతిష్ఠాత్మక సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందిన థరూర్ క్రియాశీల రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా తనకు గ్రంథ రచన, ఉపన్యాసాలు వెలువరించడం మొదలైన వ్యావృత్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఆయన ఆ వ్యాఖ్యలు చేసిన తీరు తెన్నులు కాంగ్రెస్ నుంచి నిష్క్రమించనున్నారా అనే అనుమానాలను రేకెత్తిస్తోంది. థరూర్ పార్టీ మారనున్నారా అన్నది పలువురి మాటామంతీలో చర్చనీయాంశమైపోయింది. కేరళ ముఖ్యమంత్రి పదవి అభ్యర్థిగా తనను ప్రకటించాలని పార్టీ నాయకత్వానికి నచ్చచెప్పడానికి థరూర్ ప్రయత్నిస్తున్న సందర్భంలో ఈ సంచలనాత్మక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

ఇటీవలి సంవత్సరాలలో భారత పురాతన రాజకీయ పక్షం నుంచి బయటకు వెళ్లిపోయిన ప్రముఖ నాయకుల జాబితా చిన్నదేమీ కాదు. వారిలో అత్యధికులు భారతీయ జనతా పార్టీ లేదా ఆ పార్టీ నాయకత్వంలోని కూటమిలో చేరారు. ప్రజాహితం కంటే అధికార పరిమళాల ఆస్వాదనే ఈనాటి రాజకీయవేత్తల పరమ లక్ష్యం కదా. ఇలా కాంగ్రెస్ నుంచి ఫిరాయించిన వారిలో జ్యోతిరాదిత్య సింధియా, జితిన్ ప్రసాద, మిళింద్ దేవరా మొదలైన వారికి కాంగ్రెస్ ప్రథమ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నవారే అయినా పార్టీ నుంచి వెళ్లిపోవడానికే నిర్ణయించుకున్నారు. హిమంత బిశ్వశర్మ, కెప్టెన్ అమరీందర్‌సింగ్ లాంటి వారు పార్టీ అంతర్గత అధికార రాజకీయాలలో తాము తప్పుడు పక్షం వైపు ఉన్నామని గ్రహించిన తరువాత అనివార్యంగా కాంగ్రెస్ నుంచి నిష్క్రమించారు. భారత జాతీయ కాంగ్రెస్‌కు దశాబ్దాలుగా విధేయంగా ఉన్న కార్యకర్తలు, అభిమానులు అసంఖ్యాకంగా ఉన్నారు. అయితే వారంతా అప్రసిద్ధులు. కాంగ్రెస్‌కు సరైన నాయకుడు లేడని, మునిగిపోతున్న పడవలా పార్టీ తయారయిందని గ్రహించిన ఆ అనామక కార్యకర్తలు, మద్దతుదారులు నిశ్శబ్దంగా వేరే పార్టీలకు వెళ్లిపోయారు. శశి థరూర్ విషయం భిన్నమైనది. మొదటి నుంచీ ఆయన సంప్రదాయ కాంగ్రెస్‌వాది కాదు. రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి కూడా కాదు. గాంధీ కుటుంబానికి సన్నిహితుడూ కాదు. స్వయం కృషితో కాంగ్రెస్‌లోను, ప్రజా జీవితంలోను సమున్నతంగా ఎదిగిన వ్యక్తి. సౌమ్యుడు, స్ఫుటంగా భావవ్యక్తీకరణ చేయగల ఈ మాజీ ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త భారత రాజకీయాలలో అంతకంతకూ కనుమరుగైపోతున్న ఒక విశిష్టుల కోవకు ప్రతినిధి. విద్వత్తు, విధ్యుక్త ధర్మ నిర్వహణ పట్ల అచంచల అంకితభావం, మేధో నైపుణ్యాలు పుష్కలంగా ఉన్న శశి థరూర్ స్వయం కృషితో ఎదిగిన ప్రతిభావంతుడు. ఐక్యరాజ్యసమితి సహాయ ప్రధాన కార్యదర్శి పదవిని విడనాడి క్రియాశీల రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు చాలా మంది ఆయన్ను వెటకరించారు. ఆయన రాజకీయ ఆకాంక్షలు ఫలించవని, విఫల రాజకీయవేత్తగా ఆయన త్వరలోనే రాజకీయాల



> రాబోయే రెండు సంవత్సరాలలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సొంతంగా విజయం సాధించగల అవకాశమున్న ఏకైక రాష్ట్రం కేరళ. ఈ దృష్ట్యా శశి థరూర్ వంటి నవీన నాయకుడిని పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కే ప్రయోజనకరం. అయితే తప్పుడు నిర్ణయాలతో తనను తాను ఓడించుకోవడంలో కాంగ్రెస్ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనావేయగలమా?!

నుంచి తప్పుకోవడం ఖాయమని పలువురు గట్టిగా అభిప్రాయపడ్డారు. ఆంగ్లేయుడులా ఆంగ్ల భాషను మాట్లాడగల నేర్పు, అధునాతన భావ సంపద, ఆకర్షణీయమైన వ్యక్తిగత జీవితం, వైయక్తిక విలక్షణ జీవనశైలి ఉన్న థరూర్ భారతదేశ సంప్రదాయ రాజకీయ వాతావరణంలో రాణించే అవకాశం లేదని ఎంతో మంది భావించారు.

వ్యక్తిగత జీవితంలోను, రాజకీయ జీవితంలోను తుఫానులు అన్నిటినీ తట్టుకుని తిరువనంతపురం నుంచి నాలుగుసార్లు వరుసగా లోక్‌సభకు థరూర్ ఎన్నికయ్యారు. వామపక్షాల ప్రాబల్యం, బీజేపీ అత్యంత క్రియాశీలంగా ఉన్న నియోజకవర్గం నుంచి థరూర్ వరుసగా నాలుగు సార్లు అనితర సాధ్యంగా ఎన్నికయ్యారు. ఎన్నో ప్రతికూలతలను ఎదుర్కొని ఆయన కాంగ్రెస్‌లో తన కంటూ ఒక స్థానాన్ని సాధించుకున్నారు. యథాతథ పరిస్థితులను సవాల్ చేశారు. 2022లో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ పడడం అందుకొక నిదర్శనం. పార్టీ ప్రథమ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు లేకపోయినప్పటికీ పార్టీలో ప్రముఖంగా వెలుగొందడంలో విజయవంతమైన 'బయటి వ్యక్తులు'లో థరూర్ ఒకరన్న వాస్తవాన్ని ఎవరూ కొట్టివేయలేరు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేసినప్పుడు ఆయన పార్టీ ప్రముఖుల నుంచి ఎటువంటి వ్యతిరేకతను ఎదుర్కొన్నారో నేను నా పుస్తకం '2024: The Election That Surprised India'లో వివరంగా రాశాను. శశి థరూర్ ప్రచార సభలకు దూరంగా ఉండాలని అన్ని రాష్ట్రాలలోని కాంగ్రెస్ ప్రతినిధులను ఏఐసీసీలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు ఆదేశించారు. అయినప్పటికీ థరూర్‌కు 1000కి పైగా ఓట్లు లభించడం పార్టీ శ్రేణుల్లో ఆయనకు, ఊహించిన దాని కంటే ఎక్కువ మద్దతు ఉన్నదని స్పష్టమయింది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

థరూర్‌తో సమస్యేమిటంటే ఆయన్ని ఏ 'శిబిరం'కు చెందినవాడుగా పరిగణించలేము. ఆయన మేధావి. కాంగ్రెస్ ముఠాలు, ఒకే ప్రయోజనాలున్న వ్యక్తుల బృందాలలో ఆయన ఉండలేరు. సాహిత్య ఉత్సవాలు, మేధో చర్చలలో మాత్రమే ఆయన ఉత్సాహంగా ఉండగలుగుతారు, సంపూర్ణంగా నిమగ్నమవుతారు. కాంగ్రెస్ నాయకత్వంలో మార్పునకు డిమాండ్ చేసిన జీ23లో సభ్యుడుగా ఆయన పేరు బయటకు వచ్చినప్పుడు కూడా కాంగ్రెస్‌లో తిరుగుబాటును ప్రోత్సహిస్తున్న వ్యక్తిగా ఆయన్ని చూడడం సాధ్యం కాలేదు. ఆయన వ్యవహార శైలి పూర్తిగా వైయక్తికమైనది. ఆర్థిక వ్యవహారాలలోగానీ, విదేశాంగ విధానానికి సంబంధించి గానీ మోదీ సర్కార్ నిర్ణయాలకు థరూర్ మద్దతునిచ్చిన ప్రతిసారీ, మోదీ–బీజేపీ–ఆరెస్సెస్‌పై 'యుద్ధం' చేస్తున్నామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు ఆయన పార్టీ విధేయతను అనుమానిస్తున్నారు. పార్టీ విధానాలకు భిన్నమైన అభిప్రాయాలను సహించే పరిణతి మన రాజకీయ వ్యవస్థలలో పూర్తిగా కొరవడింది మరి.

నిజమైన ప్రజాస్వామిక పార్టీ విధేయుల, భజనపరుల సంఘంగా పరిమితమైపోవడం సమంజసమేనా? శోచనీయమైన విషయమేమిటంటే మన రాజకీయ పార్టీలు అన్నీ అదే విధంగా ఉన్నాయి. కనుకనే థరూర్ లాంటి ఆలోచనాపరులైన నాయకులు పార్టీలో అంతర్గత విమర్శలకు గురవుతున్నారు. విడ్డూరమైన విషయమేమిటంటే అటువంటి పరిస్థితులకు తలొగ్గకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నందునే థరూర్ పార్టీకి కాకపోయినా ఓటర్‌కు ఆదరపాత్రుడు, ఆకర్షణీయమైన నాయకుడు అయ్యారు. ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పట్టణ ప్రాంత మధ్యతరగతి ప్రజల మద్దతును గణనీయంగా కోల్పోయింది. ఎంతకూ తన భావజాల పరిమితులలోనే ఉండిపోతున్న కారణంగా ఏ పార్టీకి స్థిర విధేయత చూపని ఓటర్లను ఆకట్టుకోవడంలో కాంగ్రెస్ విఫలమవుతోంది. అటువంటి ఓటర్లు మార్పును సాధించే సానుకూల ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారు. శశి థరూర్ నెహ్రూవియన్ లౌకికవాది. తాను నెహ్రూత్వ వాదినని ఆయన బాహాటంగా ప్రకటించారు. బీజేపీ హిందూత్వ భావనను సవాల్ చేశారు. ఆర్థిక వ్యవహారాలలో ఉదారవాద విధానాలకు మద్దతునిచ్చారు. ప్రజలలో మతపరమైన చీలికలు సృష్టించే హిందూత్వ రాజకీయాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాగే వామపక్షాల నిస్సార స్టాలినిస్టు విధానాలనూ విమర్శించారు.


శశి థరూర్‌లోని ఈ విలక్షణతల కారణంగానే కేరళలో కాంగ్రెస్ 'ముఖం'గా ప్రజల మనస్సుల్లో సుప్రతిష్ఠితం చేసేందుకు సరైన వ్యక్తి అని ఘంటాపథంగా చెప్పవచ్చు. అందునా ఎన్నికలలో విజయానికి సంప్రదాయక మద్దతుదారుల ఓట్లే కాకుండా అనిశ్చిత వైఖరితో ఉండే ఓటర్ల మద్దతు పొందడం కూడా కీలకంగా ఉన్న కేరళలో థరూర్ లాంటి నేత పార్టీకి సారథ్యం వహించడం చాలా ముఖ్యం. తదుపరి రెండు సంవత్సరాలలో జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ తన సొంత శక్తి సామర్థ్యాలతో విజయం సాధించగల అవకాశమున్న రాష్ట్రం కేరళేనని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ దృష్ట్యా శశి థరూర్ వంటి నవీన నాయకుడిని పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కాంగ్రెస్‌కే ప్రయోజనకరం. అయితే తప్పుడు నిర్ణయాలతో తనను తాను ఓడించుకోవడంలో కాంగ్రెస్ శక్తి సామర్థ్యాలను తక్కువగా అంచనావేయగలమా?! ముఖ్యమంత్రి పదవికి ఆరాటపడుతున్న నాయకులు కేరళ పీసీసీలో తక్కువేమీ కాదు. ముఠాల, వర్గాల ప్రాబల్యం, వాటి పరస్పర కలహాలు కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీసే అవకాశమున్నది. వరుసగా మూడోసారి పరాజయానికి దారితీసే ఈ పరిస్థితులను చక్క దిద్దేందుకు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఏమి చేయనున్నది? ఏమి చేయాలి? వచ్చే ఏడాది జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలలో శశి థరూర్‌ను పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించేందుకు సాహసించాలి. ఇది దుస్సాహసం కాబోదు. పార్టీలో థరూర్ అంతస్తును పెంచి, ప్రోత్సహించడం కాంగ్రెస్ ఇటీవలి సంవత్సరాలలో రాష్ట్ర స్థాయి నాయకత్వాల విషయంలో తీసుకున్న నిర్ణయాలలో చాలా సమంజసమైనదిగా రుజువయ్యే అవకాశమున్నది.

తాజా కలం: ఇటీవల ఒక సమావేశంలో రాజకీయాలలోకి ప్రవేశించే ఆలోచన ఎందుకు చేయలేదని నన్ను ఒక స్నేహితుడు ప్రశ్నించాడు. శశి థరూర్ ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి రాజకీయాలలో క్రియాశీలంగా పాల్గొనడం కంటే ప్రసారకర్తలుగా, రాజకీయాలపై పుస్తకాలు రాస్తూ ఉండడంలోనే మాలో కొంతమందిమి సంతోషంగా ఉండగలుగుతున్నామని భావిస్తున్నానని చెప్పాను. థరూర్, నేనూ దక్షిణ ముంబైలో ఒకే పాఠశాలలో చదువుకున్నాం. విశ్వజనీన దృక్పథాన్ని అలవర్చే విద్య ప్రజా జీవితంలో ఇంకెంత మాత్రం గౌరవాదరాలు పొందడం లేదు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సృజనాత్మకత కోల్పోయిన స్వతంత్ర భారతం!

జనాభా పరంగా అన్ని దేశాల కంటే ముందున్న మనం శాస్త్రీయ ఆవిష్కరణల విషయంలో ఎక్కడ ఉన్నాం? ఈ 77 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా మనం ఎన్ని సిద్ధాంతాలను ప్రతిపాదించాం? ఎన్ని అసలైన కొత్త ఆవిష్కరణలు చేశాం? అనే విషయాలను ఒకసారి నిక్కచ్చిగా పరిశీలిస్తే, విజ్ఞానశాస్త్ర రంగంలో మనం సాధించిన ప్రగతిలో ఎంత డొల్లతనం ఉందో అర్థమవుతుంది. ఆధునిక భారతీయులు ఈ దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతోందని బీరాలు పలకవచ్చు, కానీ వాస్తవం దానికి దూరంగా ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం, భారతదేశంలో సివి రామన్, జగదీష్ చంద్రబోస్, ఎల్లాప్రగడ సుబ్బారావు, సత్యేంద్రనాథ్ బోస్, హోమీ బాబా, విక్రమ్ సారాభాయ్ వంటి ఎంతో మంది గొప్ప శాస్త్రవేత్తలు ఉన్నారు. తమ విలక్షణమైన ఆవిష్కరణలతో ప్రపంచాన్ని ప్రభావితం చేసిన శాస్త్రవేత్తలు ఈ 77 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఎంత మంది ఉన్నారు?



నిజమే మనం నింగిలోకి చాలా రాకెట్లు పంపిస్తున్నాం. కానీ రాకెట్ టెక్నాలజీ మనం కనుక్కోలేదనే విషయం మర్చిపోకూడదు. అలానే మన సాఫ్ట్‌వేర్ నైపుణ్యం కూడా. ఇప్పుడు మనం అనుభవిస్తున్న టెక్నాలజీ కానీ, మనకున్న శాస్త్ర పరిజ్ఞానం కానీ చాలావరకు అరువు తెచ్చుకున్నదే. మనం సొంతంగా చేసిన ఆవిష్కరణలు, కనుక్కున్న సిద్ధాంతాలు ఈ ఆధునిక యుగంలో బహుతక్కువ అని చెప్పాలి. భారతదేశాన్ని విశ్వ గురువు అని చెప్తుంటారు మనవాళ్ళు మరి అటువంటి దేశానికి ఈ ఆధునిక యుగంలో ఎందుకు ప్రతిదాన్ని పశ్చిమ దేశాల నుంచి అరువు తీసుకోవాల్సిన దుస్థితి వచ్చింది? మనలోని సృజనాత్మకత, ఆలోచనాశక్తి ఏమైపోయాయి? మనకీ భావదారిద్ర్యం ఎలా ఆవహించింది? భారతీయులు ఆలోచించాలి.

మన పూర్వికులు పరాయి పాలనలో ఉండి కూడా గొప్ప విషయాలు కనుక్కున్నారు, ప్రపంచానికి మార్గదర్శకులు అయ్యారు. కానీ స్వతంత్ర పాలనలో ఉండి కూడా మనం వారిలో ఇసుమంత కూడా సాధించలేకపోతున్నాం. ఎందుకంటే మన పూర్వికులు పరాయి పాలనలో ఉన్నా కూడా స్వతంత్రంగా ఆలోచించారు, స్వతంత్రంగా జీవించారు. మనమేమో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా పరాయి వాళ్ళ అధీనంలోనే బతుకుతున్నాం. మన మనస్సు, ఆలోచనలు, చదువులు, వేషభాషలు... అన్నీ పూర్తిగా ఇంగ్లిష్ వాళ్ళ అధీనంలోనే నడుస్తున్నాయి. మనకంటూ స్వంత ఆలోచన, విధానం లేదు. అనుకరణలో సిద్ధహస్తులమయ్యాం. ఆవిష్కరణలో వెనుకబడ్డాం. అనుకరించేవారు ఎంత అభివృద్ధి సాధించినా ఎప్పుడూ వెనుకనే ఉంటారు.

మన దేశం శాస్త్ర, సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోవాలంటే మనం ఈ కాపీ క్యాట్ సైకాలజీని, బానిస మనస్తత్వాన్ని వదిలించుకోవాలి, స్వతంత్రంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. దానికి మన పిల్లలు ముందు మాతృ భాషలో విద్యను అభ్యసించాలి. పిల్లల మనోవికాసానికి, వారిలో సృజనాత్మకతను పెంపొందించటానికి మాతృ భాషలో విద్యాభ్యాసం ఎంతగానో దోహదపడుతుంది. ప్రపంచంలో అనేక చిన్న దేశాలు మాతృభాషలో విద్యాబోధన వల్లనే శాస్త్రసాంకేతిక రంగాల్లో అగ్రగాములుగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. మనం మన పూర్వికుల అసలు చరిత్రను చదవాలి. అలానే పాశ్చాత్య శాస్త్రాలతో పాటు, ప్రాచీన భారతీయ శాస్త్రాలను కూడా లోతుగా అధ్యయనం చెయ్యాలి. అప్పుడే పూర్వికుల సృజనాత్మకతను మనం తిరిగి పుణికిపుచ్చుకోగలం, స్వతంత్ర ఆలోచనలు, ఆవిష్కరణలు చేయగలం.

– డా. గోనుగుంట్ల శ్రీనివాసరావు

వైజ్ఞానిక దృక్పథం వికసించాలి

సైన్స్ అనేది మనిషికి మిత్రుడు కాదు, శత్రువు కాదు... అయితే అది ఒక మానవ ప్రక్రియ, అందువల్ల సైన్స్ అనేదాన్ని విడిగా దర్శించకూడదు. దానికున్న మానవీయ పార్శ్వం గమనించాలి, అవగతం చేసుకోవాలి... ఇది సైన్సు ప్రాచుర్యం వల్లే సాధ్యం అవుతుంది అని దిలీప్ ఎం.సాల్వి అన్నారు.

శాస్త్ర జ్ఞానం మతానికి, ఆధ్యాత్మిక చింతనకు శత్రువు కాదు, స్వార్థమే జ్ఞానానికి ప్రబల శత్రువు అని ప్రముఖ సైన్సు తెలుగు రచయిత కొడవటిగంటి కుటుంబరావు చెప్పిన కోణంలో కూడా ఇవాళ సైన్స్‌ని వృద్ధి చేయాలి. శాస్త్ర సాంకేతిక రంగాల మీద ఆధారపడిన సమాజాన్ని నిర్మించుకుంటూనే అసలు అవంటే ఏమిటో చాలామందికి తెలియకపోవడం ఆత్మహత్యా సదృశ్యం– అన్న కార్ల్ సాగన్ మాటల్ని, సివి రామన్ స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని శాస్త్ర, పరిశోధన రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలి. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని వికసింపజేయాలి. సైన్సు ప్రయోగాల పట్ల అభిరుచిని పెంపొందించడానికి ప్రతి పాఠశాలలో, కళాశాలలో ప్రయోగశాలలను ఏర్పాటు చేసి, ప్రయోగాలు చేయడానికి అవసరమైన పరికరాలు, రసాయనాలతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లను నియమించవలసి ఉంది. ఎలక్ట్రికల్ ఇంజనీర్‌కు ప్లస్, మైనస్ వైర్ల గురించి తెలియకపోవడం, ఐఐటీలో పట్టభద్రులైన పిల్లలు నిజ జీవితంలో సైన్సును వినియోగించుకోలేకపోవడం, పిల్లలు పుట్టకపోతే బాబాల చుట్టూ తిరిగే అజ్ఞానం, సమస్యలు వస్తే మనుషులతో మాట్లాడి పరిష్కరించుకోవాల్సిందిపోయి ఆత్మహత్యలు, హత్యలు చేసే దుర్మార్గమైన స్థితి ఏర్పడుతోంది. ఇవన్నీ లేని ఒక సమాజాన్ని రూపొందించాలంటే అది సైన్స్‌ని అభివృద్ధి చేయడం ద్వారా, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం ద్వారానే సాధ్యమవుతుంది. అందుకు జాతీయ సైన్స్ దినోత్సవం దోహదపడవలసి ఉన్నది. సివి రామన్ అన్నట్లే.. 'ఐయామ్ ద మాస్టర్ ఆఫ్ మై ఫెయిల్యూర్, ఇఫ్ ఐ నెవర్ ఫేల్, హౌ విల్ ఐ ఎవర్ లర్న్' స్ఫూర్తితో శాస్త్రీయ విద్యను, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ఇవాల్టి కర్తవ్యం.

– ప్రభాకర్ కస్తూరి

(నేడు జాతీయ సైన్స్ దినోత్సవం)

శంకరన్ స్మారకోపన్యాసం



స్కూల్ ఫర్ డెమోక్రసీ, సఫాయి కర్మచారి ఆందోళన్, సెంటర్ ఫర్ ఈక్విటీ సంస్థల సంయుక్త నిర్వహణలో ఎస్.ఆర్. శంకరన్ స్మారక ఉపన్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నేటి సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు కాట్రగడ్డ శ్రీనివాస్ హాల్, రెండవ అంతస్తు, సుందరయ్య భవన్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం జరగనున్నది. ఈ సంస్మరణ సమావేశంలో హర్ష మందర్, అరుణ రాయ్, వసంత కన్నబిరాన్, ప్రొ. హరగోపాల్ ఉపన్యసిస్తారు.

– ఎస్.ఆర్. శంకరన్ స్మారక కమిటీ

మూడు గ్రూపులను మార్చితే చిక్కులే!

సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 2024 ఆగస్టు ఒకటిన వెలువరించిన తీర్పు వెలుగులో తెలంగాణలో ఎస్సీ రిజర్వేషన్లను హేతుబద్ధంగా ఉప వర్గీకరణ చెయ్యడానికి షమీమ్ అఖ్తర్ కమిషన్ శాస్త్రీయంగా, లోతుగా విచారణ జరిపింది. రాష్ట్రంలోని ఎస్సీలను మూడు గ్రూపులుగా చేయాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసులకు ఫిబ్రవరి 4న తెలంగాణ మంత్రివర్గం, రాష్ట్ర శాసనసభ కూడా ఆమోదం తెలియజేశాయి.


సుప్రీంకోర్టు తీర్పును స్ఫూర్తిగా తీసుకున్న కమిషన్ సిఫారసులకు, వాటికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలకు విరుద్ధంగా కొందరు తప్పుడు ప్రతిపాదనలతో నివేదికలోని సిఫారసులకు సవరణలు చెయ్యాలని కోరుతున్నారు. కమిషన్ తాను ఇదివరకే చేసిన గ్రూపింగ్ ముఖ్య ప్రతిపాదనలలో ఎలాంటి సవరణలు చేసినా వర్గీకరణ వ్యతిరేకులు న్యాయపరమైన చిక్కులు సృష్టించి, ఉన్నత న్యాయస్థానాల్లో వ్యాజ్యంగా మార్చి, బాధిత ఎస్సీ కులాలకు విద్య, ఉద్యోగ రంగాల్లో జరుగుతున్న అన్యాయాన్ని కొనసాగించే ప్రమాదం ఉంది.

ఇప్పటికే చేసిన సిఫారసులు చట్టరూపం దాల్చి అమలు జరిగితే, మాదిగలతో పాటు రాష్ట్రంలోని అన్ని ఎస్సీ కులాలకూ విద్య, ఉద్యోగ రంగాల్లో సంపూర్ణ న్యాయం జరుగుతుంది.

– కృపాకర్ మాదిగ, వ్యవస్థాపక కార్యదర్శి, ఎంఆర్‌పిఎస్

'సమ్మక్క–సారక్క': ఆదివాసీలకు అందని జీవధార!

తెలంగాణ ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గడ్డ మనది. ఇక్కడి గోదావరి జలాలను ఆంధ్రాకి తరలించే విధానాన్ని తప్పు పట్టి, ప్రాంతీయ వాసులకు న్యాయం జరగాలని గర్జించిన చరిత్ర మనది. కానీ నేడు తెలంగాణలో జరిగేదేమిటి? గోదావరి నది ఒడ్డున ఉన్న ఆదివాసుల జల వనరులు, సహజ వనరులు, ఖనిజ వనరులను దోచుకుంటున్నారు. భారీ ప్రాజెక్టులు నిర్మించి నీటిని బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. మేడిగడ్డ మొదలు కాళేశ్వరం, దేవాదుల, తుపాకులగూడెం, దుమ్ముగూడెం వరకు గోదావరి నది పొడవునా ఇదే దోపిడీ కొనసాగుతున్నది. మునిగేది ఆదివాసీలు, నష్టపోయే భూములు ఆదివాసీలవి, సాగు ఫలం తెలంగాణ మైదానం ప్రాంతాలది!



రాష్ట్రంలో ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం కోయ గ్రామంలో గోదావరి నది ఒడ్డున సమ్మక్క బ్యారేజ్ నిర్మించారు. నాగరిక ప్రపంచం ఎరుగక, కడు దారిద్ర్యంలో మగ్గుతూ, ప్రకృతిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆదివాసీలకు మాత్రం ఈ ప్రాజెక్టు నుంచి బిందెడు మంచి నీరు, వ్యవసాయ భూమికి సాగు నీరు అందకపోవటం బాధాకరమైన విషయం.

ములుగు జిల్లాలోని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఏటూరు నాగారం పరిధి పూర్తిగా భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ఏరియా భూభాగం, ఇందులో మొత్తంగా 13 మండలాల్లో 3,769 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో 500 గ్రామాల్లో ఆదివాసీలు నివసిస్తున్నారు. ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ తాగునీరు లేక కిలోమీటర్ల మేర నడిచి వెళ్ళి నీరు తెచ్చుకునే పరిస్థితితో పాటు, చెలిమలలో బురద నీరు తాగుతూ రోగాల బారిన పడుతున్నారు. ఇక్కడి గోదావరి నీరు బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు తప్ప, ఆదివాసీల గొంతు తడిపే ప్రయత్నం చేయటం లేదు. షెడ్యూల్డ్ ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేసి ఆదివాసీలని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు. నీరు లేక పంటలు సరిగా పండక వలసలు పోయే దుస్థితి ఆదివాసీ ప్రాంతాలలో నెలకొన్నది.

ప్రస్తుత సమ్మక్క బ్యారేజి ఎగువన గోదావరి మూలమలుపు దగ్గర నిర్మించిన ప్రాజెక్ట్ నుంచి మెదక్, నల్గొండ, కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు పైపులైన్‌ల ద్వారా వ్యవసాయ భూములకు నీటిని తరలించారు. ఈ ప్రాజెక్టు నుంచి ఆదివాసీలకు చుక్క నీరు అందించలేదు. ఆ నీటి దోపిడీ సరిపోదన్నట్టు నేడు సమ్మక్కసాగర్ బ్యారేజి నుంచి కూడా అదే తరహాలో నీటి దోపిడీ చేయటం ఏ మానవతా విలువలకు నిదర్శనం? మరో విషయం 3000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కానీ ఆదివాసీ ప్రాంతాలకు విద్యుత్ వాటాపై స్పష్టత లేదు.

తుపాకుల గూడెం బ్యారేజి ప్రాంతం పూర్తిగా భారత రాజ్యాంగంలో 5వ షెడ్యూల్ ప్రాంతం కనుక ఇక్కడ ప్రాజెక్ట్ నిర్మాణం జరగాలంటే ముందుగా పంచాయతీ రాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్ ఏరియాస్ 1998 చట్టం (పెసా) ప్రకారం గ్రామసభ అనుమతి తప్పనిసరి అని ఆదివాసీ ప్రజల నిర్ణయం మేరకు 2016లో తీర్మానం చేశారు. ఇది షెడ్యూల్డ్ ప్రాంతం, పైగా ముంపునకు గురి అవుతుంది కనుక ఈ ప్రాజెక్టులో ఉద్యోగాలు నిర్వాసితులకు పోగా, మిగిలినవి షెడ్యూల్ ట్రైబల్ వారికి ఇవ్వాలి. ప్రాజెక్టులో చేపలు పట్టుకునే హక్కు కల్పించాలి. విద్యుత్ ప్రాజెక్టులో ఉద్యోగాలు కల్పించాలి. తుపాకులగూడెం గ్రామానికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరీ చేయాలి లాంటి అనేక తీర్మానాలు చేశారు. కానీ నేడు ప్రాజెక్ట్ పూర్తి అయ్యే దశలో అధికారులు డొంక తిరుగుడు మాటలు మొదలు పెట్టారు. హామీలు అమలుకు నోచుకునే పరిస్థితి లేదు. స్థానిక ఆదివాసీలకు, వారి రాజ్యాంగపరమైన హక్కులు, చట్టాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?

ఇప్పటికి అయినా ప్రభుత్వం స్థానిక ఆదివాసీ గ్రామాల్ని ఐటీడీఏ ద్వారా సర్వే చేయించి వారి భూములకు పైపులైన్ ద్వారా నీరు అందించాలి. ప్రతి కుటుంబానికి రక్షిత మంచి నీటి సౌకర్యం కల్పించాలి. ఆదివాసి ప్రాంతాలలో పెద్ద చెరువులను గుర్తించి వాటికి ఎత్తిపోతల పథకాల ద్వారా నీరు అందించాలి. నీటి నిలువకు ప్రత్యేక డ్యామ్స్ ఏర్పాటు చేయాలి. ప్రాజెక్టు క్రింద భూములు కోల్పోయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలి. పెసా చట్టం ప్రకారం చేసిన గ్రామసభ తీర్మానాలు తప్పనిసరిగా అమలు చేయాలి.

■ వూకె రామకృష్ణ దొర
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్

హైదరాబాద్ విస్తరణకు గొప్ప అవకాశం!

ప్రస్తుత రియల్ ఎస్టేట్ పరిస్థితి తీసుకుంటే ఒక వైపు అనేక అంతర్జాతీయ, జాతీయ కారణాల రీత్యా కొన్ని ఎదురుగాలులు వీస్తున్నాయి. మరొక వైపు హైదరాబాద్ పట్టణీకరణ విపరీతంగా పెరుగుతూ, వృద్ధికి అనేక అవకాశాలు కనపడుతున్నాయి. కోర్ సిటీలో ట్రాఫిక్, కాలుష్యం విపరీతంగా పెరిగి, జీవన నాణ్యత తగ్గుతున్నదని సూచికలు చెప్తున్నాయి. ఢిల్లీ కన్నా జనాభా సాంద్రత హైదరాబాద్‌లో ఎక్కువ ఉంది అని ఇటీవల విడుదల చేసిన సూచికలు చెప్తున్నాయి. మరి ఇటువంటి తరుణంలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ, రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి ఊతమిచ్చే ప్రణాళికలను ఎంత చక్కగా అమలు చేయవచ్చు? హైదరాబాద్‌ను శాస్త్రీయంగా విస్తరించి, దేశంలోనే గర్వించదగిన నగరంగా చేసేందుకు పుష్కల అవకాశాలు ప్రభుత్వం ముందు ఉన్నాయి.

నేడు అంతర్జాతీయంగా దేశాల మధ్య, దేశంలోని రాష్ట్రాల మధ్య.. వనరుల కోసం, ప్రాజెక్టుల కోసం, ఆర్థికాభివృద్ధి కోసం అత్యంత పోటీ ఉన్న విషయం తెలిసిందే. ఇటువంటి సమయంలో, రాష్ట్రంలో ప్రవహించే ప్రతి పెట్టుబడి– ప్రభుత్వానిదైనా, ప్రయివేటుదైనా, అత్యంత విలువైనదే. నగదు ప్రవాహం తరిగిపోయి, కొత్త ప్రణాళికలు ఆచరణకు నోచుకోక, ఎక్కడ పెట్టుబడులు పెట్టాలి అని పెట్టుబడిదారులు తికమకపడుతున్న ఈ పరిస్థితిలో ప్రభుత్వానికి కొన్ని సూచనలు...

మౌలిక ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా, ప్రభుత్వ వ్యయం పెంచటం ద్వారా నగదు లభ్యత పెరిగి, ఆర్థిక వ్యవస్థ విస్తరిస్తుందన్నది ఆర్థిక శాస్త్ర సూత్రం. ఈ పరిస్థితులలో కష్టమైనా, కొన్ని ముఖ్య ప్రాజెక్టులకు కనీస ప్రాధాన్యత ఇచ్చి, వాటిని అత్యవసరంగా మొదలు పెట్టి, బిల్లులు చెల్లిస్తూ వెళితే – మల్టిప్లయర్ ఎఫెక్ట్‌తో ఆర్థిక వ్యవస్థకు కొంత మంచిచేస్తుంది. రియల్ ఎస్టేట్‌లో ఈ ఎఫెక్ట్ మరింత ఎక్కువగా ఉంటుంది. ఫోర్త్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, నగరంలో ఉద్యోగాలు, జీసీసీ విస్తరణ లాంటి ముఖ్యమైన ప్రాజెక్టులపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ, అంతర్జాతీయ సంస్థలకు సహకారం ఇస్తూ అంకిత భావం కలిగిన ఒక బృందాన్ని ఎంపిక చేసి, వాటికి నిర్దిష్టమైన లక్ష్యాలు ఇచ్చి, ఆయా ప్రాజెక్టులలోని కొత్త విషయాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు వార్తలు అందించి, ముఖ్యమంత్రి తన ప్రభుత్వ ప్రాధాన్యాలను సరిగ్గా అమలు చేస్తున్నారు అన్న భావన ప్రజలలో విస్తరించి, వారిలో విశ్వాసం పెంచడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది.

ఈనాటికి కూడా జీహెచ్‌ఎంసీ/హెచ్‌ఎండీఏ అనుమతులు తీసుకోవటం ఒక పెద్ద ప్రసహనం. దీని కోసం ఒక స్పెషల్ విండో పెట్టి, భూ సమస్యలను పరిష్కరించి త్వరగా అనుమతులు ఇచ్చి వేగం పెంచేలా చేయాలి. ప్రభుత్వ రెడ్ టేపిజం తగ్గించే ప్రయత్నం చేయాలి. తెలుగువారు మంచి వ్యాపారదక్షత కలిగినవారు. అతి తక్కువ ప్రభుత్వ సహకారంతో అనేక రెట్లు ఫలితాలు రాబట్టగల సమర్థులు. అటువంటి సహకారం అందించి, ప్రణాళికలు విస్తరించి, చిన్న చిన్న సమస్యలు అధిగమించి, పాజిటివ్ ఫీల్ ఇవ్వగలిగితే ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసినవారుగా ఈ ముఖ్యమంత్రి, ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోతారు.

– వి.వి.ఆర్


ఓటు హక్కు వి నియోగించుకున్న ఉపాధ్యాయులు


హనుమకొండ లా కాలేజీలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఉపాధ్యాయులు

ప్రశాంతంగా.. సందడిగా..

పకడ్బందీగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఉదయం నుంచే ఓటేసేందుకు బారులు తీరిన పంతుళ్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థుల పడిగాపులు
- సాధారణ ఎన్నికలను తలపించిన సరళి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 92.95 శాతం ఓటింగ్
- విస్తృత ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించిన పోలీసులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జల్లా వ్యాప్తంగా టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 8 గంటలకే పోలింగ్ ప్రారంభించగా, అప్పటి నుంచే ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓట్లు వేయడం ప్రారంభించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 7.30గంటల నుంచే ఉపాధ్యాయుల సందడి నెలకొంది. అయితే మొదటి రెండు గంటలు పోలింగ్ మందకొడిగా సాగినా.. 10 గంటల నుంచి జోరందుకుంది. వర్గాలుగా ఏర్పడిన ఉపాధ్యాయులు తమ అభ్యర్థికి ఓటు వేయాలని పంతుళ్లను అభ్యర్థించారు. పంతుళ్ల ఎన్నికలు సాధారణ ఎన్నికలను తలపించాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మొత్తం 72 పోలింగ్ కేంద్రాల్లో ఉపాధ్యాయులు ఓట్లు వేసేందుకు ఉదయం 10 గంటల నుంచే బారులు తీరారు. మధ్యాహ్నం 12గంటలకల్లా దాదాపు 50శాతం ఓట్లు నమోదు కావడం విశేషం.

కాగా, పింగిళి శ్రీపాల్‌రెడ్డి హనుమకొండలోని లా కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోగా, మరో అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి కాజీపేటలోని ప్రభుత్వ పాఠశాలలోని కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, పి.ప్రావీణ్య, రిజ్వాన్‌బాషా, అద్వైత్‌కుమార్ సింగ్, రాహుల్ శర్మ, టీఎస్ దివాకర ఎప్పటికప్పుడు ఎన్నికల సరళిని పరిశీలించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తుపై ఆయన ఆరా తీస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని పోలింగ్ స్టేషన్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను రెవెన్యూ అధికారులతో పాటు ఆయా మండలాల తహసీల్దార్లు సందర్శించి పోలింగ్ సరళి, వివరాలను ప్రిసైడింగ్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ స్టేషన్లను సందర్శించిన కలెక్టర్లు ఎన్నికల సరళిని పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల దాకా కొనసాగిన పోలింగ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11,189 మంది ఓటర్లు ఉండగా 10,232 మంది ఉపాధ్యాయులు వారి ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 92.95 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక సంబంధిత పోలింగ్ స్టేషన్ల నుంచి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య బ్యాలెట్ బాక్సులను నల్గొండ జిల్లా కేంద్రానికి తరలించారు.


కేడీసీ కళాశాల వద్ద బీజేపీ అభ్యర్థి సరోత్తం రెడ్డి, నాయకులు

ఉమ్మడి జిల్లాలో పోలింగ్ జరిగిందిలా..

జిల్లా	ఓట్లు	పోలయినవి	శాతం
వరంగల్	2,352	2,214	94.13
హనుమకొండ	5,215	4,780	91.66
జనగామ	1,002	945	94.31
మహబూబాబాద్	1,663	1,571	94.47
భూపాలపల్లి	329	308	93.62
ములుగు	628	583	92.83
మొత్తం	11,189	10,401	92.95




పోలింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్సీ అభ్యర్థులు సుందర్‌రాజ్ యాదవ్, నర్సిరెడ్డి, పూల రవీందర్

వరంగల్‌పైనే అందరి దృష్టి

నల్లగొండ - ఖమ్మం - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 19 మంది అభ్యర్థుల్లో ప్రధానపోటీదారులు వరంగల్‌లోనే మకాం వేశారు. మొత్తం ఓట్లలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అధికంగా ఓట్లు ఉండటంతో గెలుపోటముల్లో ఇక్కడి పంతుళ్లే కీలక భూమిక పోషించనుండటంతో ప్రధానపోటీదారులు ఇక్కడే మకాం వేసి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ జిల్లా కేంద్రాల్లోని పోలింగ్ స్టేషన్లలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ ఎవరి ధీమాలో వారు ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, పింగిళి శ్రీపాల్‌రెడ్డి, పులి సరోత్తంరెడ్డి, పూల రవీందర్, ఎస్. సుందర్‌రాజ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి తదితర అభ్యర్థులు వరంగల్‌లోనే మకాం వేసి ఓటింగ్ సరళిని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు బేరీజు వేసుకున్నారు.

ఎవరి ధీమా వారిదే..

- పింగిళి శ్రీపాల్‌రెడ్డి : ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం చూపించిన ఘనత తమదే.. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల తోపాటు 30 శాతం పీఆర్సీ ఉద్యోగ విరమణ వయస్సు పెంపు, సీపీఎస్ ఉపాధ్యాయులకు ఫ్యామిలీ పెన్షన్ సాధించాం. అవే ఈ రోజు

మిగతా 4వ పేజీలో...

దుస్తులు అమ్ముకుని తిరిగి వస్తూ..

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న లారీ
- మల్లంపల్లి మండలం దేవనగర్ క్రాస్‌రోడ్డు వద్ద ఘటన


లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జు అయిన లారీ


మహబూబ్ (ఫైల్)


షాహీన (ఫైల్)

ములుగు కలెక్టరేట్/ఖానాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వారు ఊరూరూ తిరుగుతూ బట్టలు అమ్ముకుంటూ పొట్టనింపుకునే వారు. వృత్తిలో భాగంగా రోజుల తరబడి గ్రామగ్రామానికి తిరుగుతూ బట్టలు విక్రయిస్తూ ఉంటారు. ఈ క్రమంలో వ్యాపారం చేసుకుని తిరిగి వస్తుండగా.. మృత్యువు రూపంలో వచ్చిన లారీ.. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం దేవనగర్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం..

వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేటకు చెందిన షేక్ సకీనా(42), మహబూబ్(55) భార్యాభర్తలు. వీరు తమ టీవీఎస్ ఎక్సెల్ మోటార్ సైకిల్‌పై ఊరూరు తిరుగుతూ రెడీమేడ్ దుస్తులు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. దుస్తుల విక్రయం కోసం నెలల తరబడి సుదూర ప్రాంతాలకు వెళ్లివస్తుంటారు. ఈ క్రమంలో నెల రోజుల కిందట దంపతులు ద్విచక్రవానంపై రెడీమేడ్ దుస్తులను విక్రయించడానికి గ్రామం నుంచి వెళ్లారు. శివరాత్రి పండుగ వరకు ములుగు జిల్లాలోని పలు గ్రామాల్లో బట్టలు విక్రయించారు. పండుగ ముగియడంతోపాటు వచ్చే నెల 2 నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుండడంతో ద్విచక్రవానంపై స్వగ్రామానికి గురువారం బయలు దేరారు. ఈ క్రమంలో మలంపల్లికి సంతకు వచ్చారు. మేకను కొనుగోలు చేసి ఇంటికి తిరిగి వెళ్తున్నక్రమంలో ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలోని బొల్లోనిపల్లి సమీపంలో వేగంగావచ్చిన లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ సంఘటనలో మహబూబ్ లారీ చక్రాల కింద నలిగిపోయి మరణించాడు. రోడ్డుపై ఎగిరిపడ్డ సకీనా తలకు తీవ్ర గాయాలతో ఘటనా స్థలిలోనే మరణించారు. మృతదేహాలను ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించిన ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మహబూబ్‌కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. దంపతుల మృతితో బుధరావుపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నేటి నుంచే సాంస్కృతికోత్సవం

స్ప్రింగ్‌స్ప్రీ వేడుకలకు వరంగల్ నిట్ ముస్తాబు

- 3 రోజుల పాటు కార్యక్రమాలు.. విస్తృతంగా ఏర్పాట్లు
- ముఖ్యఅతిథిగా హాస్యనటుడు బ్రహ్మానందం రాక
- అన్ని నిట్‌ల నుంచి పాల్గొననున్న విద్యార్థులు
- ఆకట్టుకోనున్న ఈవెంట్లు.. అలరించనున్న ప్రోషోలు
- నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ వెల్లడి

7

పన్ను వసూళ్లలో పురోగతి అవసరం

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పన్నుల వసూళ్లలో పురోగతి అవసరమని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ పరిధిలోని 21వ డివిజన్ ఎల్బీనగర్‌లో గురువారం పన్ను వసూళ్ల తీరుపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఆర్‌ఐలు, బిల్ కలెక్టర్లకు రోజువారి టార్గెట్ సూచించారన్నారు. ప్రతీ రోజు ఒక ఆర్‌ఐ వంద బిల్లులు వసూలు చేయాలని అన్నారు. సుదీర్ఘకాలంగా పన్నులు చెల్లించకుండా జాప్యం చేస్తున్న ఇంటి యజమానులకు రెడ్ నోటీజులు జారీ చేయాలని ఆదేశించినట్లు చెప్పారు. బడా బకాయిదారుల జాబితా అందుబాటులో ఉంచుకుని బృందాలుగా వెళ్లి వసూళ్లు జరపాలని అన్నారు. పన్నులు చెల్లించని మొండి బకాయిదారులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఇక ఆర్‌వోలు పన్నుల వసూళ్ల తీరుపై నిత్యం పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరెడ్డి, ఆర్‌వో షహజాది బేగం, ఆర్‌ఐల సోహెల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


ఎల్బీనగర్‌లో పార్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పార్క్‌లలో దోమల నివారణకు ఫాగింగ్ చేయండి

వరంగల్ నగరంలో ఉన్న పార్క్‌లలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం వరంగల్ నగరంలోని ఎల్బీనగర్, టెలీకం పార్క్, క్రిష్టియన్ కాలనీలో బల్దియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని కమిషనర్‌తో పాటు సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పార్క్‌లలో పిల్లలు ఆడుకునే వస్తువులను మరమ్మతు చేయడంతో పాటు కొత్త పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. వర్షాకాలం నేపథ్యంలో పార్కులలో నీరు నిలువ ఉండకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఈఈ శ్రీనివాస్, అసిస్టెంట్లు ప్రిన్సి, అనూహ్య పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల సంస్కృతిని తెలుసుకోవాలి

- అంతర్రాష్ట్ర యువజన సమ్మేళనంలో కలెక్టర్ ప్రావీణ్య

బాలసముద్రం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను అందరూ తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన తెలంగాణ-కేరళ అంతర్‌రాష్ట్ర యువజన సమ్మేళనంల్లో కలెక్టర్ పి.ప్రావీణ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారత ప్రభుత్వ యువజన క్రీడల శాఖ, హనుమకొండ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో తెలంగాణ - కేరళ అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనాన్ని ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు ఒక రాష్ట్రం మరొక రాష్ట్రానికి యువతను పంపించి ఆ రాష్ట్ర భాషా, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడం భిన్నత్వంలో ఏకత్వం సాధించడమే లక్ష్యంగా సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. యువత పరస్పర సంస్కృతి సంప్రదాయ పద్ధతులను తెలుసుకునేందుకు ఇలాంటి కార్యక్ర మాలు దోహదపడుతాయన్నారు. కేరళ యువత తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో పాటు స్థానిక, చారిత్రక ఆచార వ్యవహారాలను క్షేత్రస్థాయిలో సందర్శించి తెలుసుకోవాలని అన్నారు. అదే విధంగా కేరళ సంస్కృతి సంప్రదాయాలను తెలంగాణ యువత తెలుసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఇలాంటి కార్యక్రమాలతోపాటు రోడ్డు భద్రత, విపత్తుల నిర్వహణ తదితర ప్రాధాన్యత అంశాలపై యువత కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని కలెక్టర్ అన్నారు. ఏదైనా విపత్తు సంభవించినప్పుడు యువత సమాజ సేవ చేసేందుకు వారిని ప్రోత్సహించేలా మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని కలెక్టర్ ఉద్బోధించారు. తాను కూడా కేరళ రాష్ట్రాన్ని పలుమార్లు సందర్శించానని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాకు వచ్చిన కేరళ యువత ఐదు రోజుల పాటు ఇక్కడి పల్లెలు, పట్టణాలను చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాస్‌కుమార్, కేయూ ప్రొఫెసర్ రాజ్‌కుమార్‌లతోపాటు కేరళకు చెందిన 27 మంది యువతి, యువకులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య


విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ నందిరామ్‌నాయక్, సీఐ వెంకటరత్నం

డాక్టర్‌పై హత్యాయత్నం భార్య పనే!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- ప్రియుడు, ఓ ఏఆర్ కానిస్టేబుల్‌తో కలిసి దుశ్చర్య
- సహకరిస్తే ఇల్లు కట్టించి ఇస్తానని కానిస్టేబుల్‌కు సదరు ప్రియుడి హామీ
- ఈ నెల 20న హత్యాయత్నం.. ప్రాణాపాయ స్థితిలో వైద్యుడు
- నిందితుల అరెస్టు.. వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ

6

అంకితభావం, పట్టుదలతో అనుకున్నది సాధించాలి


మాట్లాడుతున్న కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి

- కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- అమెరికాలో విద్యావకాశాలపై విస్తృత సదస్సు

6



పొట్టిగుట్టతండాలో పొలాన్ని పరిశీలిస్తున్న దయాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

పంటలను కాపాడండి

- గోదావరి జలాలను వెంటనే విడుదల చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గోదావరి నీళ్ల వెంటనే విడుదల చేసి, పంటలను కాపాడాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం పొట్టిగుట్టతండాలో ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో వరి పంటలకు కాలువల ద్వారా గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపుతారని రైతులు ఆశపడి నాట్లు వేస్తే, నీరు వదలక పోవటంతో ఎండిపోతున్నాయని మం డిపడ్డారు. బీఆర్‌ఎస్ హయాంలో గుంట భూమి కూడా ఎండిపోకుండా ముందస్తు ప్రణాళికతో గోదావరి జలాలు విడుదల చేసినట్టు పేర్కొన్నారు.

నెల రోజులుగా రైతుల వరి పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి చుక్క నీరు రావడం లేదన్నారు. బోర్లు వట్టి పోవటంతో చేసేది లేక ఎండిపోయిన పంటలను గొర్రెలు, మేకలు, పశువులను మేపుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేషం, దుబ్బాక రత్నాకర్‌రెడ్డి, బాలూనాయక్, యాకూ, మూఢ రవి తదితరులు పాల్గొన్నారు.

- కొడకండ్ల: మండలంలోని లక్ష్మక్కపెల్లిలో బీఆర్‌ఎస్ సీనియర్ కార్యకర్త జంపాల మురళి అనారోగ్యంతో మృతి చెందగా, దయాకర్‌రావు గురువారం భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సింధె రామోజి, నాయకులు డి.వెంకటేశ్వర్‌రావు, దేశగాని సతీష్, చెంచు రాజిరెడ్డి, బి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

కేయూ తెలుగు విభాగం బీవోఎస్‌గా శంకరయ్య



కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగం బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్మన్ (బీవోఎస్)గా డాక్టర్ మంథని శంకరయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ పరిపాలన భవనంలో శంకరయ్యకు వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు ఉత్తర్వులను అందచేశారు. కాగా, శంకరయ్యను పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్రా రాజుగౌడ్‌తో పాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

సర్వీసు వైరు తగిలి అక్కడికక్కడే మృతి ▸ ల్యాబర్తిలో ఘటన



వెంకటేశ్వర్‌రావు (ఫైల్)

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం పాలైన సంఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తిలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... ల్యాబర్తి గ్రామానికి చెందిన బల్గూరి వెంకటేశ్వర్‌రావు (50) వృత్తిరీత్యా తన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో పన్నెండేళ్లుగా ప్రైవేటు కంపెనీలో పనిచేస్తూ జీవిస్తున్నాడు. అలాగే ల్యాబర్తి గ్రామంలో తనకున్న రెండెకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. మిగతా సమయంలో తన తమ్ముడు దేవేందర్‌రావు పనులు చక్కబెడుతూ ఉండగా, ఇతర పనులను హైదరాబాద్ నుంచి వచ్చి చేసుకొని వెళ్లేవాడు. ఈ తరుణంలో మోటారు సర్వీసు వైరు, స్టార్టర్ వద్ద విద్యుత్ సమస్య తలెత్తడంతో హైదరాబాద్ నుంచి వచ్చిన వెంకటేశ్వర్‌రావు ఈ నెల 26న కొన్ని రిపేర్లను చేసుకున్నాడు. సర్వీసు వైరు అతుకులు ఉన్న విషయాన్ని గమనించి గురువారం తెల్లవారుజామునే వెళ్లి వాటిని అతికించే పనిలో పడ్డాడు. దీంతో తనకు తెలియకుండానే విద్యుత్ స్తంభం వైపు నుంచి వచ్చే అతుకులు ఉన్న వైరును చేయితో పట్టుకున్నాడు. దీంతో వెంటనే విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే పోలీసులకు, విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి పోలీసులు మృతదేహాన్ని వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్యతో పాటు కుమార్తె ఉంది.

భారీగా మద్యం పట్టివేత

బంద్ నేపథ్యంలో ఏరులైపారిన మద్యం



గీసుగొండ, మొగిలిచర్లలో పట్టుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు →

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం షాపులు బంద్ నేపథ్యంలో రెండో రోజు సైతం కమిషనరేట్ పరిధిలోని వివిధ ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో లక్షల విలువ చేసే మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరకాల ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆత్మకూరు, గీసుగొండ మండల కేంద్రాల్లోని బెల్ట్‌షాపుల్లో పెద్ద మొత్తంలో నిల్వ చేసిన మద్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గీసుగొండ మండలంలోని మొగిలిచర్ల గ్రామంలో బెల్టుషాపు నిర్వాహకుడు మంద సాంబయ్య నుంచి రూ.48,720 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మరో నిర్వాహకుడు బేల పూర్ణచందర్ నుంచి రూ.76,040 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూరు మండలంలోని అక్కంపేటలో ఎం.డి. సలీం అనే వ్యక్తి నుంచి రూ.55,040 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

సట్టా నిర్వాహకుల అరెస్టు

మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ కాలనీ, ఖిలావరంగల్ పద్మశాలీవాడలో సట్టా నిర్వహిస్తున్న గడ్డల శ్రీలత నుంచి రూ.5,220, కామని హరీశ్ నుంచి రూ.6,330 నగదును స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

అంకితభావం, పట్టుదలతో అనుకున్నది సాధించాలి

- కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి
- అమెరికాలో విద్యావకాశాలపై సదస్సు
- హాజరైన యూఎస్ కన్సల్టెంట్ జనరల్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అంకితభావం, పట్టుదల, నిరంతర శ్రమతో యువత అనుకున్నది సాధించవచ్చునని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కేయూ సెనెట్ హాల్‌లో 'ఎక్స్‌ప్లోరింగ్ ఎడ్యుకేషనల్ అపర్చునిటీస్ ఇన్ ది యూఎస్' అనే అంశంపై సదస్సు జరిగింది. కేయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హైదరాబాద్‌లోని యూఎస్ కన్సల్టెంట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్, అమెరికా వ్యాపారవేత్త, కేయూ అల్యూమినీ పులి రవిలు హాజరై మాట్లాడారు. అమెరికా విద్యావకాశాల భూమిగా ప్రసిద్ధిగాంచిందన్నారు. అంకితభావంతో పాటు పట్టుదల, మార్పునకు సిద్ధంగా ఉంటే అనుకున్నది సాధించవచ్చుని చెప్పారు. కేయూలో అకడమిక్ స్థాయితో పాటు నైపుణ్యాలను పెంచుతామని స్పష్టం చేశారు. టీచింగ్‌లో నూతన టెక్నాలజీ వినియోగం పెరిగిందన్నారు.

యూఎస్ కన్సల్టెంట్ జనరల్ జెన్నీఫర్ లార్సన్ మాట్లాడుతూ.. అమెరికాలో 4వేలకు పైగా ప్రఖ్యాతి గాంచిన వర్సిటీలున్నాయని చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యార్థులు అమెరికాకు వస్తున్నారని పేర్కొన్నారు. అమెరికాలోని ఉన్నత విద్యతో విద్యార్థి జీవితం మారుతుందన్నారు. భద్రతలో కూడిన విద్య ప్రాధాన్యతను వివరించారు. భారతీయ యువతకు యూఎస్‌లోని పబ్లిక్, ప్రైవేట్ వర్సిటీలు స్వాగతం పలుకుతున్నాయని వెల్లడించారు. కేయూ అల్యూమినీ, అమెరికా వ్యాపారవేత్త పులి రవి మాట్లాడుతూ.. భారతీయులు అమెరికాలో ఉన్నత స్థాయిలో ఉన్నారని చెప్పారు. కష్టపడే తత్వం, ప్రతిభతో ఎదగ వచ్చుని పేర్కొన్నారు. మన దేశ యువతకు ఎంతో ప్రతిభ ఉందన్నారు. అమెరికాలో చదువు, ఉద్యోగాలకు గతంలో చాలా అడ్డంకులు ఉన్నాయని, ఇప్పుడూ లేవ న్నారు. తాజా టెక్నాలజీ అందరి ముంగిట ఉందన్నారు. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉందన్నారు. యువత ఉద్యోగం పొందడం కాదని.. ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి రావాలన్నారు. స్కిల్, టాలెంట్‌లో ప్రపంచంలో ఎక్కడైనా ఎదగవచ్చునని ఉద్బోధించారు. టెక్నాలజీ ఎంత వచ్చినప్పటికీ మానవ సహాయం లేకుంటే ముందుకు సాగమన్నారు. టెక్నాలజీ పరంగా 15 ఏళ్లలో రాని మార్పు వచ్చే రెండేళ్లలో వస్తుందని అన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మాట్లాడుతూ.. యూఎస్‌లో విద్య, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ పొందాలన్నారు.



మాట్లాడుతున్న అమెరికా కన్సల్టెంట్ జనరల్ జెన్నీఫర్

ఈ సందర్భంగా విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలను జెన్నీఫర్ లార్సన్, ఎన్ఆర్ఐ పులి రవిలు నివృత్తి చేశారు. ఈ సదస్సులో ఓఎస్‌డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ బి.రమ, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, యూజీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున్‌రెడ్డి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రమణ, భిక్షాలు, బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.శాస్త్రి, ఇంజనీరంగ్, ఫార్మసీ, కంప్యూటర్ సైన్స్ బయోటెక్నాలజీ, కామర్స్ కెమిస్ట్రీ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.

తొగర్రామయ్యపల్లిలో పులి కలకలం

దుగ్గొండి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొగర్రామయ్యపల్లిలో గురువారం ఓ రైతు పంట భూమిలో పులి పాదముద్రలు కనిపించడంతో రైతులు ఆందోళన చెందారు. వెంటనే పోలీసులకు, ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. ఓ రైతు మొక్కజొన్నకు సాగు నీరు అందించేందుకు వ్యవసాయ బావి దగ్గరకు పోగా పంట భూమిలో పులి పాదముద్రలు కనిపించాయి. సమాచారం అందుకున్న ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సోమానాయక్ సంఘటన స్థలం చేరుకొని పరిశీలన చేశారు. పంట భూమిలోని పాదముద్రలు పరిశీలన చేసిన అనంతరం ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ మాట్లాడుతూ.. పులి పాదముద్రలు చాలా పెద్దగా ఉంటాయని, గోర్ల ముద్రలు పడవని, పాద ముద్రలు చిన్నవిగా ఉన్నాయని, గోర్ల ముద్రలు పడ్డాయన్నారు. అవి పులి ముద్రలు కావని, హైనా జంతువు అడుగులు కావచ్చని ఆయన వెల్లడించారు. అన్నదాతలు భయపడద్దని, ఎవరూ ఆందోళన చెందరాదన్నారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



తొగర్రామయ్యపల్లిలో పులి పాద ముద్రలను పరిశీలిస్తున్న పోలీసులు

సాగునీటి కోసం రైతుల ఆందోళన

అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న అన్నదాతలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభంలోనే సాగు నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఎస్సారెస్పీ కాలువ ద్వారా సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు సుమారు 25 మంది గురువారం చింతగట్టు క్యాంపు నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మక్కజొన్న పంట వేసి రెండు నెలలు దాటిందని, వరి పంట 40రోజులు కావస్తుందని బావుల్లో నీరు అడుగంటిపోయి, బోర్లలో సాగునీరు రాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ధర్మసాగర్ చెరువు నుంచి ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామానికి సుమారు 20 కిలోమీటర్లకు పైగా ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని నీటి పారుదల శాఖ అధికారులను కలిసి రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నట్లు తెలిపారు. ధర్మసాగర్ నుంచి ప్రస్తుతం స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి నియోజక వర్గాల పరిధిలోని ఎస్సారెస్పీ కాలువల ద్వారా నీటిని తరలిస్తున్నట్లు ఐదు రోజుల తర్వాత సాగు నీరు అందించేందుకు అధికారులు చెప్పడంతో రైతులు అక్కడి నుంచి ఆందోళన విరమించినట్లు రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిని మహేందర్, బోయిని రవి, నీలం ఐలయ్య, రాయినేని ప్రవీణ్, బొక్కల చంద్రయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నీటి పారుదల శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

డాక్టర్‌పై హత్యాయత్నం భార్య పనే..!

- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఘాతుకం
- నిందితుల అరెస్టు.. వివరాలు వెల్లడించిన వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్

కరీమాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌కు చెందిన ఓ వైద్యుడిపై ఇటీవల జరిగిన హత్యాయత్నం కేసులో మిస్టరీ వీడింది. అతడిని ప్రేమించి పెళ్లాడిన భార్యే ఈ ఘాతుకానికి పాల్పడింది. ప్రభుత్వ అధ్యాపకురాలైన ఆ మహిళ తన వివాహేతర సంబంధానికి అడ్డవస్తున్నాడనే కారణంతో ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు యత్నించింది. ఇందుకోసం ఓ ఏఆర్ కానిస్టేబుల్ సహకారం తీసుకుని పథకం ప్రకారం నిర్మానుష్య ప్రదేశంలో భర్తపై హత్యాయత్నం చేయించింది. ఆ భర్త ప్రస్తుతం ఆస్పత్రిలో ప్రాణాల కోసం పోరాడుతుండగా.. భర్త ప్రాణం తీయాలని చూసిన భార్య కటకటాలపాలైంది. ఈ నెల 20వ తేదీ రాత్రి హనుమకొండ జిల్లా కాజీపేట బైపాస్ రోడ్డు భట్టుపల్లి వద్ద వైద్యుడు గాదె సుమంత్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసును మిల్స్‌కాలనీ పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ గురువారం విలేకరులకు వెల్లడించారు. ఏసీపీ కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన డాక్టర్ గాదె సుమంత్ రెడ్డి, ఫ్లోరా మరియా 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. తమ బంధువులకు చెందిన విద్యాసంస్థల వ్యవహారాలను చూసుకునేందుకు ఈ దంపతులు 2018లో సంగారెడ్డికి తమ నివాసాన్ని మార్చారు. సుమంత్ రెడ్డి సంగారెడ్డి పీహెచ్‌సీలో కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ అధికారిగా, ఫ్లోరా తమ బంధువుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసేవారు. అయితే, సంగారెడ్డిలో ఓ జిమ్‌లో చేరిన ఫ్లోరా.. అక్కడ జిమ్ ట్రైనర్‌గా పని చేస్తున్న శామ్యూల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం తెలుసుకున్న సుమంత్‌రెడ్డి భార్యను మందలించి.. కుటుంబాన్ని తిరిగి వరంగల్‌కు తరలించాడు. 2019లో ప్రభుత్వ అధ్యాపకురాలిగా ఉద్యోగం పొందిన ఫ్లోరా.. వరంగల్ రంగశాయిపేటలోని సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ప్రస్తుతం పని చేస్తోంది. సుమంత్ రెడ్డి ఖాజీపేటలో సొంతంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. శామ్యూల్‌తో సంబంధాన్ని కొనసాగించిన ఫ్లోరా.. భర్త లేని సమయాల్లో శామ్యూల్‌ను సంగారెడ్డి నుంచి ఇంటికి పిలిపించేది. విషయం తెలుసుకున్న సుమంత్ రెడ్డి భార్యను పలుమార్లు మందలించినా ఆమె పద్ధతి మార్చుకోలేదు. పైగా, తన వివాహేతర సంబంధానికి అడ్డంగా ఉన్న భర్తను శామ్యూల్‌తో కలిసి చంపేందుకు సిద్ధమైంది. సుమంత్ రెడ్డిని చంపేందుకు సైబరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న తన స్నేహితుడు మంచుకూరి రాజ్‌కుమార్‌ను శామ్యూల్ సంప్రదించాడు. హత్యకు సహకరిస్తే సంగారెడ్డిలో కొత్త ఇల్లు నిర్మించి ఇస్తానని రాజ్‌కుమార్‌కు హామీ ఇచ్చాడు. దీంతో అంగీకరించిన రాజ్‌కుమార్ ఉద్యోగానికి మూడు రోజులు సెలవు పెట్టి సుమంత్ రెడ్డి హత్యకు శామ్యూల్‌తో కలిసి రెక్కీ నిర్వహించాడు. ఇక, ఖర్చుల కోసం ఫ్లోరా రూ.లక్ష శామ్యూల్‌కు ఫోన్‌పే చేయగా.. అందులో రూ. 50 వేలను తన వద్దే ఉంచుకున్న శామ్యూల్.. మిగిలిన సొమ్మును రాజ్‌కుమార్‌కు బదిలీ చేశాడు. ఈ నెల 20న సంగారెడ్డిలో సుత్తి కొనుగోలు చేసిన వారిద్దరూ ద్విచక్రవాహనంపై నేరుగా ఖాజీపేట చేరుకున్నారు. విధులు ముగించుకుని కారులో ఇంటికి బయలుదేరిన సుమంత్ రెడ్డిని వెంబడించారు. ముందుగా అనుకున్న ప్రకారం.. వరంగల్ భట్టుపల్లి వద్ద రాత్రి తొమ్మిదన్నర గంటలప్పుడు సుమంత్ రెడ్డి కారును అడ్డుకుని అతనిపై సుత్తితో దాడి చేశారు. సుమంత్ రెడ్డి చనిపోయాడని భావించి అక్కడి నుంచి పరారయ్యారు. రక్తపుముడుగులో పడి ఉన్న సుమంత్ రెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స కొనసాగుతోంది. అతని పరిస్థితి విషమంగా ఉంది. సుమంత్ రెడ్డి తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను గుర్తించారు. అయితే, నిందితులు ముగ్గురూ గురువారం కోర్టులో లొంగిపోయేందుకు వస్తుండగా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు అసలు విషయాన్ని బయటపెట్టారు.

మేడారంలో భక్తుల సందడి

తాడ్వాయి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారంలో సందడి గురువారం అధికం గా నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కుటుంబ సమేత ంగా తరలివచ్చి వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించు కున్నారు. తల్లుల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు, కుంకమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, ఎత్తుబంగారం, యాట మొక్కులను సమర్పించుకున్నారు. ఐదు వేల మందికి పైగా అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

ప్రసాదానికి నోచుకోని భక్తులు

మేడారంలో వనదేవతల ప్రసాదం ఇవ్వండంటూ భక్తులు వేడుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తల్లులలను దర్శించుకుంటున్నా ప్రసాదం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భక్తులు సమర్పించే నైవేద్యాలను పూజారులు ప్రసా దంగా ఇవ్వడం లేదని అంటున్నారు. దేవాదాయ శాఖ అధికా రులు ఇప్పటికైనా స్పందించి ప్రసాదం అందేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు ←

రేపు జనగామ మార్కెట్‌కు సెలవు

జనగామ రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మార్చి 1న జనగామ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్టు జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామాంజనేయ కమిషన్ మర్చంట్ వ్యాపారి కందుకూరి రామాంజనేయులు మృతి చెందగా కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ కోరిక మేరకు శనివారం మార్కెట్‌కు సెలవు ప్రకటించడం జరిగిందన్నారు. కావున రైతులు మార్కెట్ యార్డు ధాన్యం తీసుకొని రావద్దని సూచించారు. మళ్లీ తిరిగి ఆదివారం మార్కెట్ యార్డులో యథావిధిగా విక్రయాలు జరుగుతాయని తెలిపారు.

నేడు కేయూలో మహిళలకు ఆరోగ్య శిబిరం

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మెడికవర్ ఆస్పత్రి, కేయూ స్టూడెంట్ వెల్ఫేర్ కేంద్రం సంయుక్తంగా కేయూ క్యాంపస్‌లోని సమ్మక్క - సారమ్మ మహిళ హాస్టల్స్‌లో ఫిబ్రవరి 28న ఉదయం 7.30 గంటల సాయంత్రం 5 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ నిరంజన్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా కేయూ వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, విశిష్ట అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, గౌరవ అతిథిగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్‌లు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

జాతీయ సైన్స్‌డే వర్క్‌షాప్

ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ సెనెట్ హాల్‌లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ సెనెట్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్న వర్క్‌షాప్‌లో ముఖ్యఅతిథిగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, హైదరాబాద్ సిమెట్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ఆర్ మునిరత్నం, హైదరాబాద్ ఎన్‌జీఆర్ఐ ప్రిన్సిపాల్ సైంటిస్టు సి.సెంథిల్ కుమార్‌లు హాజరై కీలక ప్రసంగం చేస్తారని వెల్లడించారు. అలాగే క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత, జాతీయ సైన్స్ దినోత్సవం - 2025 కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. వెంకట్రామిరెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొనాలని ప్రిన్సిపాల్ మనోహర్ కోరారు.

మహిళల భద్రతపై నిర్లక్ష్యం

- టి-సేఫ్ యాప్‌పై అవగాహన కరువు
- వరంగల్ కమిషనరేట్ షీ టీమ్ పోలీసుల విఫలం



T SAFE

వరంగల్ క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహిళా ప్రయాణికుల భద్రత దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది టి-సేఫ్ యాప్ తీసుకొచ్చింది. మార్చి 12న అధికారికంగా సీఎం రేవంత్‌రెడ్డి హైద్రాబాద్‌లో ప్రారంభించారు. తెలంగాణ ఉమెన్ సెఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ యాప్‌ను మహిళలు తమ సెల్‌ఫోన్‌లలో డౌన్‌లోడ్ చేసుకొని రాత్రి లేదా ఒంటరిగా ప్రయాణాలు చేస్తున్న సమయంలో కానీ, వాహన చోదకుడిపై అనుమానం వచ్చిన సందర్భాల్లో చేరుకోవాల్సిన గమ్యం వివరాలు, వాహనం నెంబర్ యాప్‌లో నమోదు చేస్తే పోలీసుశాఖ ఎప్పటికప్పుడు ఆ వాహనాన్ని ట్రాకింగ్ చేస్తూ వాహనంలోని మహిళలను అప్రమత్తం చేస్తుంటారు. దీనిపై విస్తృతమైన అవగహన కలిగి ఉండి కళాశాల యువతులు, గృహిణులు, విద్యార్థినులకు అవగాహన కల్పించాల్సి ఉంది. అయితే తెలంగాణ ఉమెన్ సెఫ్టీ వింగ్‌కు అనుసంధానంగా పని చేస్తున్న షీటీమ్ పోలీసులతో పాటు లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులకు అవగాహన లేకపోవడం బాధాకరం. యాప్ పని విధానాన్ని తెలుసుకున్న పక్క రాష్ట్రాల పోలీసులు.. తెలంగాణ ఉమెన్ సెఫ్టీ వింగ్ సందర్శించి తమ రాష్ట్రాల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నం చేస్తుంటే.. ఇక్కడ పనిచేస్తున్న కమిషనరేట్ పోలీసులకు యాప్, దాని పనివిధానం గురించి తెలియకపోవడం గమనార్హం. టి-సేఫ్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని షీటీమ్ పోలీసులు పత్రికా ప్రకటనల్లో ఇవ్వడమే తప్ప ఎక్కడా అవగాహన కల్పించడం లేదు.

వరంగల్ నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఐటీ కంపెనీలు, షాపింగ్ మాల్స్ రావడంతో మహిళలు ఉద్యోగ రిత్యా రాత్రి సమయాల్లో ప్రయాణాలు చేయాల్సి ఉంటోంది. ఇలాంటి సందర్భాల్లో మహిళల భద్రత కోసం తీసుకొచ్చిన యాప్‌ను మహిళలల్లోకి తీసుకెళ్లడంలో, దాని పని విధానంపై పూర్తిగా పట్టుసాధించడంలో షీటీమ్ పోలీసులతో పాటు కమిషనరేట్‌లోని ఇతర పోలీసులు వైఫల్యం చెందినట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై షీటీమ్ సీఐని సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

నేటి నుంచే సాంస్కృతికోత్సవం

- స్ప్రింగ్ స్ప్రీ-2025కు ముస్తాబైన నిట్
- ముఖ్య అతిథిగా రానున్న ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం
- ఆకట్టుకోనున్న పలు ఈవెంట్లు.. అలరించనున్న ప్రో షోలు

హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎన్ఐటీలో ప్రతిష్ఠాత్మకమైన సాంస్కృతికోత్సవం (స్ప్రింగ్ స్ప్రీ)-2025 ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నట్టు వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధీ తెలిపారు. గురువారం నిట్ క్యాంపస్‌లోని సెమినార్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్ప్రింగ్ స్ప్రీకి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు తెలిపారు. స్ప్రింగ్ స్ప్రీ మొదటి రోజు 28వ తేదీన సుప్రసిద్ధ హాస్యనటుడు గిన్నీస్ వరల్డ్ రికార్డు హోల్డర్, పద్మశ్రీ డాక్టర్ కె.బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. విద్యార్థులతో ఇష్టాగోష్టిగా మాట్లాడతారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తారు. సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. రెండో రోజు ఇండియన్ రాక్ బ్యాండ్ వొర్టెక్స్ ఉంటుంది. వొర్టెక్స్ అనేది జానపద, రాక్, ప్రత్యామ్నాయ సంగీతాల ప్రత్యేక కలయిక. ప్రసిద్ధి చెందిన భారతీయ బ్యాండ్ మొదటిసారి ప్రదర్శిస్తున్నారు. ఈ సాంస్కృతికోత్సవంలో భాగంగా రెండు సినిమా బృందాలు కూడా విద్యార్థులతో నిర్వహించే ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. మూడోరోజు ప్రముఖ భారతీయ గాయకుడు అమిత్ త్రివేది సంగీత విభావరి నిట్ స్టేడియంలో ఉంటుంది. సంగీతం, కాస్ప్లే, డిజైనింగ్, గేమింగ్, ఫిల్మ్ మేకింగ్, సోలో డ్యాన్స్, హిస్పోల్ క్విజ్, స్ట్రీట్ బాటిల్, నుక్కడ్, సైలెంట్ డీజేలలో పోటీలు, సినిమాలు, సాహిత్యంపై చర్చాగోష్ఠి, వర్క్‌షాపులను కూడా నిర్వహిస్తారని, బైక్ స్టంట్స్, మ్యాజిక్ షో వంటి అద్భుత ప్రదర్శనలు కూడా ఉంటాయని, వీటితో పాటు వినోదభరితమైన, ఆకర్షణీయమైన కార్యకలాపాలతో క్యాంపస్ అంతా ఈ మూడు రోజులు సందడిగా ఉంటుందన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధీ

అతిపెద్ద సాంస్కృతిక ఉత్సవం

వరంగల్ ఎన్ఐటీలో నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీ దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద సాంస్కృతికోత్సవాల్లో ఒకటిగా పేర్కొన్నారు. దేశంలోని దాదాపు అన్ని ఎన్ఐటీల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యే ఈ సాంస్కృతికోత్సవం ఆనందించే, మేధోపరంగా ఉత్తేజపరిచే వివిధ ఈవెంట్ల సమాహారం. ఆదర్శ సమ్మేళనంగా ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి అభివర్ణించారు. ఈ ఉత్సవంలో భాగంగా ఆకట్టుకట్టుకునే ప్రోషోలతోపాటు ఆహ్లాదకరమైన, సృజనాత్మకమైన ఎన్నో కళాప్రదర్శలు, పోటీలను నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనే విద్యార్థులకు, వీక్షకులకు జీవితకాలం మరిచిపోని అనుభూతిని ఇస్తుందన్నారు. స్ప్రింగ్ స్ప్రీలో భాగంగా కళ, సాహిత్యం, నాటకం, నృత్యం, సంగీతం, క్విజింగ్, ఫొటోగ్రఫీ, పెయింటింగ్, ఫ్యాషన్ షోలు, రాక్ మ్యూజిక్, మోడల్ యునైటెడ్ నేషన్స్, మినిట్ మెయిడ్ తదితర అంశాల్లో పోటీలు, ప్రదర్శనలు ఉంటాయన్నారు. స్ప్రింగ్ స్ప్రీ ప్రధానంగా ఏటా క్రమం తప్పకుండా నిర్వహించే ఇంటర్ కాలేజీయేట్ సాంస్కృతిక ఉత్సవం. దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు వివిధ కళల్లో ప్రతిభను చాటేందుకు తమను తాము వ్యక్తీకరించుకునేందుకు వేదికగా నిలుస్తుందని ప్రొఫెసర్ సుబుధి తెలిపారు.

కొత్త ఈవెంట్లు, సరికొత్త కళారూపాలు

కొత్త ఈవెంట్లను ప్రోత్సహించడం, సరికొత్త కళారూపాలను ప్రదర్శించడం ఈ యేడు స్ప్రిం గ్ స్ప్రీ ప్రత్యేకతగా ఉండబోతోందన్నారు. స్ప్రిం గ్ స్ప్రీలో భాగంగా నిర్వహించే ప్రోషోలలో జాతీయం, అంతర్జాతీయంగా పేరెన్నికగన్న కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తారన్నారు. స్పాట్ లైట్ ఈవెంట్లు విద్యార్థుల్లో నూతనోత్తేజాన్ని ఇవ్వడమే కాకుండా విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న శక్తిని మరోస్థాయికి తీసుకువెళతాయని చెప్పారు. కొరియో నైట్స్ డైరెక్టర్ కట్స్, ఎన్ఐటీ డబ్ల్యూ ఐడల్, అల్లూర్, దివార్ ఆఫ్ ది డిజేలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయని, స్ప్రింగ్ స్ప్రీ సందర్భంగా నిర్వహించే ప్రోషోల్లో ప్రఖ్యాత కళాకారులే కాకుండా, విద్యార్థులు పాల్గొంటారని, ఇవి వరంగల్ ప్రజలను సైతం విశేషంగా ఆకట్టుకోనున్నాయన్నారు. ఈ విలేకరు ల సమావేశంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, కల్చరల్ సొసైటీ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ పి.శ్యాం ప్రసాద్, కల్చరల్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ బి.శ్రీనివాస్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (సాక్) ప్రతినిధి రణధీర్, సాక్ టెక్నికల్ సొసైటీ ప్రతినిధి ఇషాన్ శర్మ, సాక్ స్పోర్ట్స్ సొసైటీ ప్రతినిధి అథర్వ దేశ్‌పాండే, సాక్ ఫిల్మ్ అండ్ మ్యూజిక్ సొసైటీ ప్రతినిధి జి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అలరించనున్న ఈవెంట్లు

- స్ప్రింగ్ స్ప్రీలో వినూత్న ప్రదర్శనలు
- మూడు రోజులు సందడే సందడి



హనుమకొండ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ ఎన్ఐటీలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న స్ప్రింగ్ స్ప్రీ-2025లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించే వివిధ ఈవెంట్లు, పోటీలు, ప్రదర్శనలు, సంగీత, సాహిత్య కార్యక్రమాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

మొదటి రోజు

ఈనెల 28వ తేదీన మొదటి రోజు మధ్యాహ్నం 2గంటలకు స్ప్రింగ్ స్ప్రీ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం హాజరవుతున్నారు. ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. రాత్రి 8.30 గంటలకు నిట్ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో కళ్లుచెదిరిపోయే రీతిలో పాతకొత్త పాటల కలయికగా ఆస్ట్రేలియా పేరుతో నిర్వహించే ఈ సంగీత విభావరి విద్యార్థులను ఉర్రూతలూగించనున్నది. విద్యుత్ కాంతుల వెలుగుల్లో ఆస్ట్రేలియా ఆద్యంతం ఆకట్టుకోనున్నది.

రెండో రోజు

స్ప్రింగ్ స్ప్రీ రెండో రోజు (మార్చి 1న) ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించే ఈవెంట్లలో కొరియోనైట్, డ్యాన్స్ రష్, హిప్‌హాప్, యాస్ట్రోమానికా, ఆర్ట్ థియేటర్, ట్రెజర్ హంట్, ఇంప్రెషన్ ఆఫ్ యూనిటీ, వరంగల్ ఎన్ఐటీ ఐడల్, యోధోంకి భారత్, సునీసునియే, సోలో ఇన్‌స్ట్రుమెంట్స్, ఇకిగియా, అన్‌సాల్వ్‌డ్, థియేటర్ ఆర్ట్, హస్తకళ, తానాబానా, డ్యాన్స్ రష్ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

మూడో రోజు

స్ప్రింగ్ స్ప్రీ మూడో రోజు (మార్చి 2) నిర్వహించే ఈవెంట్లలో నుక్కడ్ నాటక్, ఎస్కేప్ ద గ్రిడ్, పోలరైడ్ ఫొటోగ్రఫీ, హ్యాండ్ ప్రింటింగ్, ఫిల్మ్ హంట్, ఫిల్మ్‌హౌస్, రీల్ క్రియేషన్, బ్లిట్జ్ బులెట్ టీం ఎరెనా, థింక్ డ్రాప్ రివీల్, స్ట్రీట్ ఫొటోగ్రఫీ కాంటెస్ట్, పోటరీ మేకింగ్, క్యూఫ్యాక్టర్ జనరల్ క్విజ్, క్యూఫ్యాక్టర్ మైథాలజీ క్విజ్, బ్లిజ్‌క్రీగ్ చెస్ తదితర ఈవెంట్లు ఉంటాయి. ఈ ఈవెంట్లలో పాల్గొని విజేతలైన వారికి నగదు బహుమతులు ఉంటాయి. స్ప్రింగ్ స్ప్రీ చివరి రోజు నిర్వహించే ఫ్యాషన్ పరేడ్ విశేంగా ఆకట్టుకోనున్నది.

దర్జా కోల్పోతున్న దర్జీలు

రెడీమేడ్ వస్త్రవ్యాపారం జోరుతో టైలర్ల ఉపాధికి గండి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు దర్జీ (మేరు కులస్తులు)టైలర్ షాపులను నిర్వహిస్తూ దర్జాగా జీవనం గడిపేవారు. పండగలు, పెళ్ళిళ్ల సమయం వస్తున్నాయంటే వారికి విరామం దొరకని పరిస్థితి. ప్రస్తుతం ప్రజలు వస్త్రాల కొనుగోలుపై ఆసక్తి చూపకుండా రెడీమేడ్ దుస్తులకే ప్రాధాన్యత ఇస్తుండటంతో దర్జీల కుల వృత్తి టైలరింగ్‌లో పని దొరక్క అర్ధకాలితో అలమటిస్తున్నారు. లండన్ దేశానికి చెందిన థామస్ సెయింట్ అనే ఆంగ్లేయుడు 1790లో మొట్టమొదటగా కుట్టు యంత్రం (మిషన్)కు రూపకల్పన చేశారు. దీంతో దర్జీ కులస్తులు కుట్టు మిషన్ల ద్వారా టైలర్ షాపులను ఏర్పచుకొని బట్టలు కుడుతూ తరతరాలుగా జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

సంప్రదాయక పండగలు, శుభకార్యాలు వస్తున్నాయంటే బట్టల దుకాణానికి వెళ్లి ప్రజలు తమకు నచ్చిన వస్త్రాలను కోనుగోలు చేసి మరుసటి రోజే వాటిని దర్జీ (టైలర్)లకు కుట్టడానికి ఇచ్చేవారు. పండగల వేళ పోటీ పడి మరీ టైలర్ షాపుల వద్దకు జనాలు తిరిగే కళాత్మక టైలరింగ్ వ్యవస్థ నేడు కుదేలైంది. రెడీమేడ్ వస్త్ర వ్యాపార వ్యవస్థ పరిధిని విస్తృతం చేసుకోవడంతో టైలరింగ్ కొందరికి మాత్రమే పరిమితమైంది. నాడు ప్రత్యేక కొలతలతో రెడీమేడ్ వస్త్రాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తమ బట్టలను టైలర్ వద్దే కుట్టించుకునేవారు. పండగలు పెళ్ళిళ్ల సమయంలో బట్టలు కుట్టాలంటే సుమారు నెల ముందే కొలతలు ఇచ్చి ఫలానా తేదీ వరకు కావాలని చేప్పేవారు. అయితే సమాజంలో వచ్చిన పెను మార్పుల వలన బహుళజాతి కంపెనీల రెడిమెడ్ దుస్తులు మార్కెట్‌లోకి తీసుకురావడంతో టైలర్ షాపులపై ప్రభావం మొదలైంది. ఒకప్పుడు కేవలం హైదరాబాద్, వరంగల్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు పరిమితమైన రెడీమేడ్ వస్త్ర వ్యాపారం ప్రస్తుతం మండల, గ్రామ స్థాయికి విస్తరించాయి. అదే విధంగా మరో పక్క ఆన్‌లైన్‌లో దుస్తుల అమ్మకాల జోరు రోజు రోజుకూ అధికం కావడం, డ్రెస్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో సంప్రదాయక కుట్టుమిషన్ల వ్యవస్థ నీరు గారే పరిస్థితికి వచ్చింది. దీంతో చాలామంది వృత్తిదారులు, టైలర్‌షాపుల యజమానులు, కార్మికులు బతుకులు వెళ్లదీయడంలో ఇబ్బందులు పడుతున్నారు. టైలరింగ్‌ను కులవృత్తిగా ఎంచుకునే ఏండ్ల తరబడి జీవన కొనసాగిస్తున్న తమకు ఇతర కులస్తులకు ఇస్తున్న విధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాతో పాటు, ప్రభుత్వ హాస్టల్లు, స్కూల్ విద్యార్థుల యూనిఫారాలు దర్జీలు కుట్టే అవకాశం కల్పించి ఉపాధిని అందించి ఆదుకోవాలని పలువురు మేరు కులస్తులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.


నేడు ప్రపంచ దర్జీల దినోత్సవం

టైలర్లకు తగ్గిన గిరాకీ

వివిధ రకాలైన కొలతలతో విస్తృతమైన మార్కెటింగ్ వ్యవస్థతో రెడీమేడ్ బట్టల వ్యాపారం పల్లెల్లోకి రావడంతో ప్రజలు ఎక్కువగా రెడీమేడ్ వైపే దృష్టి సారిస్తున్నారు. రెడీమేడ్ షాపుల్లో త్వరితగతిన కుట్టిన బట్టలు వివిధ మాడల్స్, జీన్స్‌తోపాటు కొత్త కొత్త రకాల బ్రాండ్ల కంపెనీల దుస్తులు చూపించే షాపులు అందుబాటులోకి రావడంతో సంప్రదాయక కుట్టు మిషన్ విధానం వైపు మొగ్గు చూపడం లేదు. సంప్రదాయక టైలరింగ్‌కు పెట్టే ఖర్చు కంటే రెడీమేడ్ బట్టలు కొంత మేరకు చౌకగా లభించడంతో ప్రజలు ఆర్థిక పరిస్థితిలకు అనుగుణంగా రెడీమేడ్ వైపే ఆసక్తి చూపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి



ఏళ్ల తరబడి టైలర్ రంగాన్ని కుల వృత్తిగా ఎంచుకొని దుస్తులు కుడుతూ జీవనం కొనసాగిస్తున్నాం. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజలు రెడీమేడ్ వస్త్రాలపై ఆసక్తి చూపించడంతో గిరాకీ లేక తీసుకున్న షటర్ల అద్దెలు కట్టలేని స్థితిలో ఉన్నాం. రోజురోజుకూ డ్రెస్ మెటీరియల్ ధరలు పెరిగిపోవడంతో డ్రెస్సులు కుట్టేందుకు కొంచెం ధరలు పెంచడంతో తమ వద్దకు వచ్చే కస్టమర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇతర కుల సంఘాలకు అందిస్తున్నట్లుగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కుట్టు మిషన్లు కొనుగోలు చేసేందుకు సబ్సిడీ రుణాలు అందించడంతో పాటు ప్రభుత్వ స్కూల్ యూనిఫారాలు కుట్టే పనిని వృత్తిదారులకు అప్పగించి ఆదుకోవాలి.

తాళ్ల సంపత్‌కుమార్,
విన్ టైలర్ నిర్వాహకుడు హనుమకొండ

30 ఏళ్లుగా టైలర్ రంగంలో ఉన్నా..

30 ఏళ్లుగా టైలర్‌గానే జీవితాన్ని గడుపుతున్నా. ఎంతో మంది రాజకీయ, ఉద్యోగ అధికారుల, విద్యార్థుల, ఇతరుల బట్టలు కుట్టాను. పెళ్లిళ్ల పండగలు వచ్చాయంటే భోజనం చేసే తీరిక లేకుండా వచ్చిన వారికి డ్రెస్సులు కుట్టించి అందించేది. నేడు రెడీమేడ్ వస్త్ర వ్యాపారాలు, వెరైటీ మాడల్స్ దుస్తులను విక్రయించడం, ఆన్ లైన్ షాపింగ్‌లు పెరిగిపోవడంతో దర్జీలకు చేతి నిండా పని లేక, వేరే ఏ పని చేయలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తాతలకాలం నుంచి కులవృత్తిగా నమ్ముకొని జీవిస్తున్న దర్జీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని ప్రోత్సహించాలి. గతంలో బట్టలు కుట్టించడానికి తమ షాపుల వద్దకు చాలామంది బారులు తీరేవారు, కానీ నేడు బహుళ జాతి కంపెనీలు వస్త్రరంగంలోకి చొరబడటంతో రెడీమేడ్ బట్టలు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆకర్శితులు కావడంతో తమకు ఉపాధి లేకుండా పోతోంది.



గట్ల సురేందర్,
స్మార్ట్ టైలర్, కుమార్‌పల్లి, హనుమకొండ

కన్నులపండువగా పెద్దపట్నం

మల్లన్నకు భక్తుల నీరాజనాలు

చేర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్నకు కన్నులపండువగా పెద్దపట్నం రచించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తెల్లవారుజామున ఒగ్గుపూజారులు ఆలయ తోటబావి ప్రాంగణంలో యాదవ సంప్రదాయబద్ధంగా మల్లన్న కల్యాణం ఘనంగా జరిపారు. లింగోద్భవ సమయంలో గర్భాలయంలో వీరశైవార్చకులు స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పల్లకీసేవ తదితర పూజలు జరిపారు. పట్నం రచించడానికి ముందు ఒగ్గు పూజారులు ఆచారం ప్రకారంగా పట్టువస్త్రాలను గర్భాలయంలో స్వామి వారికి సమర్పించారు. పరమశివుడి తలపై కొలువైన గంగదేవతను కొలిచినట్లుగా యాదవపూజారులు స్వామివారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకెళ్లి కోనేటిలో స్నానమాచరింపచేసి శుద్ధిచేసి గంగదీపంపెటి గంగతెప్ప వదిలారు. ఒగ్గు పూజారులసంఘం అధ్యక్షుడు బొద్దుల కనకయ్య నేతృత్వంలో 159మంది ఒగ్గుపూజారులు పట్నంవేసే ప్రదేశంలో సుంకుపట్టిన అనంతరం గొంగళిలో బియ్యంపోసి మైలపోలుతీశారు. స్వామివారు ధరించే త్రిశూలం, ఢమరుకాలను నెలకొల్పి పసుపు, కుంకుమ, తెల్లపిండి(వరిపిండి), సునేరు, పచ్చలను ప్రమద గణాలుగా సమ్మిళితం చేసి నిమ్మకా యతో చిత్రకన్ను నెలకొల్పి 46వరుసలలో పట్నాన్నివేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. అష్టదిక్కులా నిమ్మ కాయ లు, గుమ్మడికాయలతో బలిహ రణచేసి పెద్దపట్నంపైకి ఆవాహనం చేశారు. ఒగ్గుపూజారులు బోనాలు తీసు కువచ్చి న అనంతరం ఆదివారం తెల్లవారుజామున గర్భాలయంలోనుంచి వీరశైవార్చకులు మహదేవుని మల్లికార్జున్, మహ దేవుని మనోహర్, మహదేవుని భాస్కర్, మహదేవుని రవి, తదితరులు ఉత్సవవిగ్రహాలను పోలీసుల రక్షణ వలయంలో తీసుకువచ్చి పట్నం చుట్టూ ప్రదక్షిణలు చేసి పట్నం తొక్కడం ప్రారంభించారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెందారు. పట్నం తొక్కిన శివసత్తులు, పోతురాజుల సిగాలతో పాటు మల్లన్న నామస్మరణతో, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ పరిసరాలు మారుమోగిపోయాయి. వేడుకలలో ఆలయ ఈవో రామాంజనేయులు, ధర్మకర్తలు పాల్గొన్నారు. జాగరణ కోసం పొరుగు మండలాలనుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ క్రిక్కిరిసిపోయాయి.


సర్వాంగ సుందరంగా వేసిన పెద్దపట్నం


రుద్రాభిషేకం చేస్తున్న వీరశైవార్చకులు

ఘనంగా అన్నపూజ, ఏకాదశరుద్రాభిషేకం

సోమవారం ఉదయం మల్లన్నకు విశేష సుగంధ పరిమళ పుష్పహారాలు అలంకరించారు. సాంప్రదాయబద్ధంగా ఏకాదశమహారుద్రాభిషేకం, అన్నపూజ నిర్వహించారు.

కళాకారులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉండి కళలకు ఆదరణ కల్పిస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి 51వ ఆహ్వాన నాటిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కళారంగంతోనే సాధ్యమవుతుందన్నారు. నాటక రంగాన్ని 50 ఏళ్ల నుంచి బతికిస్తున్న కళాసమితి కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తన వంతు సహాయంగా తల్లిదండ్రుల పేరున భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసి రూ.2లక్షలను ఇచ్చానన్నారు. ఆధునిక యుగంలో యువత, పిల్లలు, మహిళలు సైతం టీవీ, సినిమాలు, సెల్‌ఫోన్‌లకు బానిసై దేశ సంస్కృతి సంప్రదాయాలను మరచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న తెలంగాణ న్యాయవాద పరిషత్ ప్రధాన కార్యదర్శి సంసాని సునీల్, హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్, వరంగల్ బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్ హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను పారదోలి ప్రజలను చైతన్యవంతం చేయ డానికి కళా సమితి 50 ఏళ్లుగా పలు ఒడుదొడుకులను ఎదుర్కొని రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో భారతీయ నాటక కళా సమితి నిర్వహకులు అధ్యక్షుడు ఎమ్డీ.అప్సర్, కార్యదర్శి ఈగ సాంబయ్య, మాశెట్టి సోమయ్య, పోషల సూర్యనారాయణ, సమ్మెట శ్రీనివాస్, మోడెం కుమారస్వామి, పెద్దురి సంజీవరావు, భాస్కర చారి, సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, వడ్లకొండ రాజు, ఆరెల్లి వేణు, దీకొండ యుగేందర్, చెన్న శ్రీధర్, పెద్దురి రాజు, మైన వీరేందర్, సమ్మెట సుధీర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

ప్రముఖులకు సన్మానం


సమాజ హితం కోసం పాటుపడుతూ ఉత్తమ సేవలందిస్తున్న ప్రముఖులను భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కళాసమితి వేదికపై ఎమ్మెల్యే నాగరాజు సన్మానించారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరపాటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు పాములపర్తి రామారావు, రాడారు అప్లికేషన్స్‌పై పరిశోధనలు చేసి డాక్టర్ పట్ట పొందినందుకు డాక్టర్ చెన్న ప్రవీణ్‌కుమార్‌లను కళా సమితి కమిటీ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే సన్మానించారు.

విజేతలు వీరే..

భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నాటికల పోటీలలో ఉత్తమ ప్రదర్శనగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగిలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా ఉషోదయ కళానికేతన్ కత్రాపాడు వారి కిడ్నాప్, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ నాటికలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.

కళల మాస్టారు!

- వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి కళాకారుడు
- బహుముఖ ప్రజ్ఞాశాలి ఆడెపు రవీందర్



రవీందర్ రచనలు

కరీమాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వృత్తిరీత్యా ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి రీత్యా కళాకారుడు. రచయిత, రంగస్థలనటుడు, దర్శకుడిగానే కాక.. వెండితెరపై ఓ సినిమాలో హీరోగా నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడిగా తన బోధనా పద్ధతితో విద్యార్థుల మనస్సుల్లో సుస్థిర స్థానం పొందడమే కాక ఆది నుంచి కళలను జీవితంలో ఓ భాగం చేసుకున్నారు. రంగస్థల కళాకరుడిగా ఎన్నో అవార్డులను అందుకున్న ఆయనకు వెండితెరపై కనిపించాలనే కోరికను నిజం చేసుకున్న వ్యక్తి. ఆయనే వరంగల్ నగరంలోని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన ఆడెపు రవీందర్.

చిన్నప్పటి నుంచే..

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం ఒంటిమామిడిపల్లిలో సుగుణమ్మ - చంద్రమౌళి దంపతులకు ఆడెపు రవీందర్ ద్వితీయ సంతానంగా 1964లో జన్మించాడు. హైస్కూల్ విద్యాభ్యాసం అంతా బొల్లికుంట గ్రామంలో, ఉన్నత విద్యాభ్యాసం వరంగల్ నగరంలో జరిగింది. ఎంఏ బీఈడీ చదివిన ఆయనకు 1984లో పెద్దపెండ్యాలకు చెందిన సంధ్యారాణితో వివాహం జరిగింది. రవీందర్ తన తండ్రి కోరిక మేరకు ఉపాధ్యాయ వృత్తి వైపు అడుగులు వేశాడు. ఈ క్రమంలో 1993లో ఎస్‌జీటీగా ఉద్యోగం పొందారు. ప్రస్తుతం శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్నారు.

నటుడు, రచయిత, దర్శకుడు, హీరోగా..


అడెపు రవీందర్‌కు పాఠశాల స్థాయిలో ఉన్నప్పటి నుంచి కళారంగంపై మక్కువ ఉండేది. రచన, నటన పట్ల అమితమైన ఆసక్తి కనబరిచేవాడు. నటుడిగా, దర్శకుడిగా, రచయితగా రాణిస్తూనే ఉన్నారు. రంగశాయిపేట కళాభారతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఏకపాత్రాభినయం నాటక పోటీల్లో 1993, 1994, 1995 సంవత్సరాల్లో వరుసగా విజేతగా నిలిచి అవార్డులు సొంతం చేసుకున్నారు. విద్యార్థులతో అమ్మాయి పెళ్లి అనే నాటిక వేయించి రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయిలో అవార్డులు పొందాడు. అంతేకాకుండా ఇకనైనా మారండి, మీదాక వస్తే, నాటికల రచన, జీవన స్రవంతి టెలీ సీరియల్ నటన, రచన, ఫోర్త్ డిగ్రీ, అమ్మాయి పెళ్లి, యమహో తెలంగాణ షార్ట్ ఫిలిమ్స్‌లో నటన, రచన, దర్శకత్వం, రసమయి బాలకిషన్ నిర్మించిన జై తెలంగాణ సినిమాకు కథా రచన, మేడారం జాతరలో సుమన్ నటించిన సినిమాకు పాటల రచన, 2015లో విడుదలైన సీతాశ్రీరాం సినిమాకు రచన, దర్శకుడిగా, హీరోగా పనిచేశాడు.

అవార్డులు.. ప్రశంసలు..

2000లో అమ్మాయిపెళ్లి నాటికకు రాష్ట్రస్థాయి అవార్డు, 2009లో వరుడు డాట్‌కామ్ నాటికకు నంది నాటకోత్సవాలకు ఎంపిక, 2013లో సాంఘిక శాస్త్ర పుస్తకాలలో పాఠ్యాంశాల రచయితగా ప్రశంసలు, 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు, ఇటీవల కాలంలో మరెన్నో షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా సామాజిక సందేశాలను అందించేలా ప్రశంసలు అందుకున్నారు.



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రవీందర్ (ఫైల్)



ఆంధ్రజ్యోతి

హనుమకొండ సిటీ

HANUMAKONDA CITY ■ శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 V 8

మెట్టుగుట్టను దర్శించిన నాగేంద్ర సరస్వతి స్వామిజీ

మడికొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా మడికొండలోని చారిత్రక మెట్టురామలింగేశ్వరస్వామి దివ్య క్షేత్రాన్ని గురువారం ఆచార్య గౌడపాద కాశీ పీఠాధీశ్వర్ శివనాగేంద్ర సరస్వతి స్వామీజీ దర్శించుకున్నారు. స్వామీజీకి ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ఈవో శేషభారతి, అర్చకులు రాగిచేడు అబిలాష్ శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామీజీ శివాలయంలో స్వయంభూ శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం రామాలయంలో స్వామి వారికి అర్చనలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న స్వామిజీ

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



కేడీసీ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న సీపీ



సుబేదారిలోని పోలింగ్ కేంద్రం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డి



హసన్‌పర్తిలో క్యూలైన్‌లో నిలుచున్న ఓటర్లు

కాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ గురువారం కాజీపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 673 ఓట్లకు గాను 629 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి 93శాతం ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ వద్ద ఎలాంటి ఇబ్బందులు జరగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి భారీ పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కొలిపాక వెంకటస్వామి కాజీపేట పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల బూత్‌ను బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి చంద్రశేఖర్ రావు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు, జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ బూత్ ఇన్‌చార్జి కాయిత రాజ్‌కుమార్‌లు సందర్శించారు.

● హనుమకొండ టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగింది. హనుమకొండ సుబేదారిలోని కాకతీయ యూనివర్సిటీ లా కళాశాలలో గురువారం ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. సాయంత్రం 4గంటల వరకు 95.61 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం ఓటర్లు బూత్ నంబర్ 17లో 803 మంది ఉండగా, అందులో మహిళలు 422, పురుషులు 306 మొత్తం 728 మంది పోలింగ్‌లో పాల్గొని ఓటును వినియోగించుకున్నారు. కాగా, పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ అభ్యర్థులు పూల రవీందర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, సరోత్తం రెడ్డి పరిశీలించి ఏర్పాట్ల గురించి ఓటర్లను అడిగి తెలుసుకున్నారు.

20 సంఘాల మద్దతుతో సులభంగా గెలుస్తా..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా 20 సంఘాల మద్దతుతో సులభంగా గెలుస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ సుబేదారిలోని కాకతీయ యూనివర్సిటీ లా కళాశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు కేజీబీవీ, జూనియర్ లెక్చరర్లు, హైస్కూళ్ల ఉపాధ్యాయులు ఇతర వివిధ సంఘాల ఉపాధ్యాయులు 20 సంఘాల మద్దతు తనకు సంపూర్ణ మద్దతు తెలిపినట్లు నర్సిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

వరంగల్ క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం జరిగిన వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. కాజీపేట డివిజన్‌లోని ఎల్కతుర్తి, హసన్‌పర్తి మండల కేంద్రాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు హనుమకొండ డివిజన్‌లోని కాకతీయ డిగ్రీ కళాశాల కేంద్రాన్ని స్థానిక ఏసీపీలతో కలిసి సందర్శించి ఏర్పాట్లపై ఆరా తీశారు. సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా గ్రేటర్‌లోని పోలింగ్ కేంద్రాల్లోని పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవిందర్ వరంగల్ జిల్లాలోని నెక్కొండ పోలింగ్ కేంద్రంను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకుని పోలీసులు విధులను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. కేడీసీలో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటంతో నాలుగు బూత్‌లు కేటాయించారు. ఉపాధ్యాయ సంఘాలు, అభ్యర్థులు ఒకరిపై ఒకరు మాటిమాటికీ ఫిర్యాదులు చేయడంతో హనుమకొండ పోలీసులు లాఠీలు చేతపట్టుకొని గేటు ఎదుట బందోబస్తు నిర్వహించారు. శ్రీపాల్‌రెడ్డి కేడీసీ పోలింగ్ కేంద్రంలో ప్రచారం చేస్తున్నాడని సరోత్తంరెడ్డి హనుమకొండ సీఐ సతీష్ మౌఖికంగా ఫిర్యాదు చేసి, తనను కూడా సెంటర్‌లోకి పంపించాలని గేట్ ఎదుట భీష్మించుకొని ఉండటంతో పోలింగ్ కేంద్రం నుంచి శ్రీపాల్‌రెడ్డిని బయటకి పంపించారు.

● హసన్‌పర్తి : మండల కేంద్రంలోని హసన్‌పర్తి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండల పరిధిలో 758 ఓటర్లు ఉండగా వారిలో 751మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు ఎన్నికల నిర్వాహకులు తెలిపారు. వీరిలో 486 మంది పురుషుల, 265 మంది మహిళలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా మొత్తం పోలింగ్ ముగిసే వారకు 95.79 శాతం ఓటింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు పర్యవేక్షణలో ఎస్సైలు దేవేందర్, రవిందర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని నగర పోలీసు కమిషనర్ ఆకస్మికంగా పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థులు పూల రవిందర్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, పులి సరోత్తంరెడ్డి, సుందర్‌రాజుయాదవ్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించిన వారిలో ఉన్నారు. వీరితో పాటు పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీపాల్‌రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెంకటస్వామి



ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయురాలు



హసన్‌పర్తిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు శ్రీపాల్‌రెడ్డి

నేడు సైన్స్ ల్యాబ్ పరికరాల వితరణ



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మధూకర్‌రెడ్డి, విజయాదేవి

వడ్డెపల్లి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సైన్స్ డేను పురస్కరించుకొని వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ (వాటా) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ పాఠశాలకు సైన్స్ ల్యాబ్ పరికరాలను శుక్రవారం అందజేయనున్నట్లు వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ కోఆర్డినేషన్ మెంబర్ ఎలిగేటి మధూకర్‌రెడ్డి, గంటా విజయాదేవి తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారితోపాటు సంస్థ ప్రతినిధులు కర్ర శ్యామ్‌సుందర్‌రెడ్డి మాట్లాడారు. వాటా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కంచరకుంట్ల వంశీరెడ్డి, అధ్యక్షుడు సందీప్, విలేజ్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, కార్పొరేట్ డైరెక్టర్ పవన్ సమకూర్చిన సుమారు రూ.70వేల విలువ చేసే సైన్స్ ల్యాబ్ పరికరాలను అందిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్, పింగిళి రమాదేవి, కీర్తితేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జనార్దన్‌రావు ఆశయాల సాధనే లక్ష్యం



జనార్దన్‌రావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ట్రస్ట్ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాధనను కాంక్షించిన దివంగత ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్‌రావు ఆశయాలసాధనే లక్ష్యంగా జనార్దన్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ముందుకు సాగుతుందని ట్రస్ట్ కార్యదర్శి తక్కళ్లపల్లి బుచ్చిబాబు అన్నారు. జనార్దన్‌రావు 23వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం కేయూ ఎస్డీఎల్‌సీఈ సెంటర్‌లోని జనార్దన్‌రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బుచ్చిబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జనార్దన్ రావు సేవలను గుర్తించి ఆయన పేరుపై ఏదైనా సామాజిక ఉపయోగకరమైన స్మారకాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. తూముల అఖిలాష్‌రావు, భిక్షపతి నాయక్, సత్యం, ప్రకాశ్‌రావు, డాక్టర్ రాజేష్, టి.వినీల్, డాక్టర్ వీరస్వామి, యతిరాజారావు, జగదీష్, విజయ్‌కుమార్, హిమసాయి పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై అగ్ని గుండాలు



అగ్ని గుండాల్లో నడుస్తున్న భక్తులు

మడికొండ, ఫిబ్రవరి27(ఆంధ్ర జ్యోతి): మడికొండలోని మెట్టుగుట్టపై మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు అశేషంగా తరలి వచ్చి మెట్టురామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అందులో భాగంగా గురువారం తెల్లవారుజామున అగ్ని గుండాలు నిర్వహించారు. తాము కోరిన కోర్కెలు నెరవేరుతాయనే విశ్వాసంతో హర హర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు భగభగ మండుతున్న నిప్పులలో నడిచారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అబిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణశర్మ, ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సై రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్, ధర్మకర్తలు భైరి రాజు, బోగి కేదారి, వస్కుల ఉమ, రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలి



వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాన్ని ఇస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కేయూలో పనిచేస్తున్న పార్టుటైమ్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేయూ పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు కోరారు. గురువారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిసి తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా పార్టుటైమ్ అధ్యాపకుల సంఘం నేతలు డాక్టర్ వై.రాంబాబు మాట్లాడుతూ.. 10 ఏళ్ల నుంచి ఎలాంటి పదోన్నతి లేకుండా పని చేస్తున్నామని పేర్కొన్నారు. పాలకమండలి సమావేశంలో చర్చించి కోర్సుల్లో రెగ్యులర్ కోర్సుల్లోని 79 మందిని, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల్లో 57 మందిని కాంట్రాక్టు అధ్యాపకులుగా అవకాశం కల్పించాలని అన్నారు. పాలక మండలి సభ్యుడు డాక్టర్ చిర్రా రాజుగౌడ్, డాక్టర్ తిరుణహరి శేషు, దేవోజీ నాయక్, భిక్షపతి, బాలకృష్ణ, శ్రీధర్, రాజేందర్, ఎర్రబోజు రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సహృదయ శివరాత్రి ఉత్సవాలు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు కాళోజీ కళాక్షేత్రం వేదికగా నిర్వహించిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు బుధవారం అర్ధరాత్రితో ఘనంగా ముగిశాయి. సహృదయ అధ్యక్షులు గిరిజా మనోహర్ బాబు అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకల్లో అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు నాటకం ఉత్తమ ప్రదర్శనగా, శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరి వారి జనరల్ బోగీలు నాటిక ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా బహుమతులు అందుకున్నాయి. వెంకట్ గోవాడ ఉత్తమ నటునిగా బి.నాగరాణి ఉత్తమ నటిగా, ఎడారిలో వానచినుకు నాటకంలో ఇ.రాధాకృష్ణ ఉత్తమ విలన్‌గా, స్వేచ్ఛ నాటికలో ఏపూరి శ్రీనివాస్ ఉత్తమ హాస్య నటునిగా, వీడెం మగాడండి బాబులోని చలపతి ఉత్తమ రచయితగా అవార్డు అందుకున్నారు. నరహరి ఆచార్య, శాంతమ్మల జ్ఞాపకార్థం లక్ష్మమ్మ, శ్రీదేవి, కృష్ణమాచార్యల సౌజన్యంతో ఈసారి సహృదయ రంగస్థల పురస్కారానికి ప్రముఖ నాట్యచారిణి కాట్రగడ్డ హిమాన్సీకి ప్రదానం చేశారు. కుందావజ్జుల కృష్ణమూర్తి సంయోజకులుగా వ్యవహరించిన ముగింపు వేడుకల్లో సాంస్కృతిక కార్యదర్శి వనం లక్ష్మీకాంతరావు, డాక్టర్ ఎన్‌విఎన్.చారి, లక్ష్మణ్‌రావు, మల్యాల మనోహర్‌రావు, కళా రాజేశ్వర్, నాగిళ్ల రామశాస్త్రి, జెఎన్.శర్మ తదితర నిర్వాహకులు పాల్గొన్నారు. నాటకాలకు తులసీ బాలకృష్ణ, ఆనంద్ కుమార్, పురుషోత్తంరావు, కెఎల్‌వి.ప్రసాద్, డాక్టర్ నేరెళ్ల శోభాదేవిలు తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఏరుకొండ జయశంకర్, రమేశ్‌బాబు, జీవన్‌గౌడ్‌ల తోపాటు పెండెం రమేశ్‌బాబు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



సహృదయ రంగస్థల పురస్కారం అందుకుంటున్న హిమాన్సీ

(5వ పేజీ తరువాయి)

ప్రశాంతంగా.. సందడిగా..

తమ గెలుపును సూచిస్తున్నాయి.

● పులి సరోత్తంరెడ్డి : ఈ ఎన్నికల ఫలితాలు ఉపాధ్యాయుల సమస్యలు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలకు రెఫరెండం కానున్నాయి. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయు లందరూ నన్నే శాసనమండలికి పంపిస్తరు.

● పూల రవీందర్ మట్లాడుతూ... గతంలో నేను ఎమ్మెల్సీగా పనిచేసిన కాలంలో విద్యారంగానికి చేసిన సేవతో పాటు బడుగు, బలహీన వర్గాల ఉపాధ్యాయుల ప్రతినిధిగా శాసనమండలిలో వారి సమస్యలు ప్రస్తావించేందుకు తనను ఉపాధ్యాయులు శాసనమండలికి పంపిస్తున్నారన్నారు.

● అలుగుబెల్లి నర్సిరెడ్డి : సిట్టింగ్ ఎమ్మెల్సీగా నిస్వార్థంగా పనిచేశాను. ఉపాధ్యాయుల గొంతుకను శాసనమండలిలో వినిపించి సమస్యలను పరిష్కరించిన నాకే పంతుళ్లు మరోమారు పట్టం కట్టనున్నారు. ప్రైవేటు జూనియర్, డిగ్రీ కళాశాలల సమస్యలు తెలిసిన నేను.. విద్యారంగంలో 30 ఏళ్లుగా సేవలు అందిస్తున్నాను. నాపై విశ్వాసంతో ఉపాధ్యాయులు ఆశీర్వదిస్తున్నారు.

● గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి : ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తుతున్న నన్ను అన్నివర్గాల ఉపాధ్యాయ, అధ్యాపకులు గుర్తించారు. ఈ గుర్తింపే ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల్లో ఒక కొత్త మలుపు తీసుకురా బోతున్నారు. ఉపాధ్యాయుల మద్దతుతో నేను గెలుస్తాననే నమ్మకం ఉంది.

స్వాతంత్ర్యోద్యమంలో ఆజాద్‌దే కీలక పాత్ర

న్యూ శాయంపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): భారత స్వాతంత్ర్యోద్యమంలో చంద్రశేఖర్ ఆజాద్ కీలక పాత్ర పోషించారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా సమితి కార్యాలయంలో చంద్రశేఖర్ అజాద్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు మునగాల భిక్షపతి, నేదునూరి రాజమౌళి, కొట్టెపాక రవి, బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, మాలోత్ శంకర్‌నాయక్, దామెర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన కేరళ యువత



వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రంతో కేరళ యువత

కేయూ క్యాంపస్ ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువ కేంద్రం నేతృత్వంలో హనుమకొండలో నిర్వహించనున్న 5 రోజుల అంతర్ రాష్ట్ర యువజన సమ్మేళనంలో హాజరు అయ్యేందుకు వచ్చిన కేరళ యువత గురువారం కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలను కలిశారు. వర్సిటీ పరిపాలన భవనం ఎదుట గ్రూప్ ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా కేరళ యువత 27 మంది కేయూలో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, వసతులు, విద్యార్థులకు ఉన్న అవకాశాలను తెలుసుకున్నారు. వర్సిటీ పాలక మండలి సభ్యులు డాక్టర్ బి. రమ, డాక్టర్ చిర్రా రాజుగౌడ్, క్యాంపస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్, ఓఎస్డీ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ బి.రమేశ్, నెహ్రూ యువకేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు చోరీ

కాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు చోరీ జరిగాయి.. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జూబ్లీ మార్కెట్ లోని రైస్ అనే వ్యక్తి మంగళవారం తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని రోజులాగే పార్కింగ్ చేశారు. సోమిడిలో శోభన్ కుమార్ సైతం తన ఇంటి ఎదుట ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేయగా తెల్లవారే సరికి రెండు బైక్‌లు మాయమయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పసునూరి మనోహర్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

కాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసునూరి మనోహర్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాయినికి వినతి పత్రం సమర్పించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర నాయకులు, ఉమ్మడి వరంగల్ జిల్లాల నాయకులు ఉన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో వైభవంగా సదస్యం

మూడోరోజుకు చేరిన శివరాత్రి బ్రహోత్మవాలు

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకల పర్వంలో భాగంగా మూడోరోజు గురువారం రుద్రేశ్వరి, రుద్రేశ్వరస్వాములకు నీలాసూక్త మంత్రపఠనంతో పూజలు నిర్వర్తించి నీలాంబరిని అమ్మవారికి ధరింపజేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి వేద పండితుల ఆధ్వర్యంలో నాగవెల్లి సదస్యం పరివార దేవతాపూజలు నిర్వహింపజేశారు. వైదిక కార్యక్రమాలను అచలపూర్ వేద పాఠశాల విద్యార్థులు భరత్‌శర్మ, ఆదిత్యశర్మ, గంగు మణికంఠశర్మ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త వద్దిరాజు వెంకటేశ్వర్లు దంపతులతో పాటు ప్రముఖ కాంట్రాక్టర్ వేముల సత్యమూర్తి, పిచ్చిరెడ్డి రాంరెడ్డి, ఐనవోలు వెంకటసత్యమోహన్, కమ్మసేవా సంఘానికి చెందిన చిన్నకోనయ్య, ధనలక్ష్మీ దంపతులు పాల్గొన్నారు. మహాశివరాత్రి వేళ అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో 11 మంది వేద పండితుల ఆధ్వర్యంలో మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం, విశేష అభిషేకాల అనంతరం స్వామివారిని అలంకరింపజేసి భక్తుల దర్శనానికి అనుమతించిన క్రమంలో వేలాది మంది భక్తులు గురువారం కూడా రుద్రేశ్వరుడిని దర్శించుకొని ఉపవాస దీక్షలు విరమణ చేశారు. ఆలయ ఈవో అనిల్‌కుమార్ వేడుకల్లో పాల్గొన్నారు. శుక్రవారం 51 కిలోల పెరుగన్నంతో మహా అన్నపూజ నిర్వహింపజేస్తామని ఈవో తెలిపారు.



నాగవెల్లి నిర్వహిస్తున్న అర్చకులు

మునిసిపల్ కమిషనర్ హాస్టల్ నిద్ర

మడికొండ, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా మడికొండలోని తెలంగాణ సాంఘిక సాంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను గురువారం జీడబ్ల్యుఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే ఆకస్మికంగా సందర్శించారు. హాస్టల్ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు పట్టిక, స్టడీ అవర్స్ కొనసాగుతుండటం, భోజన వసతి సదుపాయాలు, రోజువారీ దినచర్య, మెనూ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా విద్యపై దృష్టి సారించి ఎంచుకున్న లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. ఉప కమిషనర్ ప్రసన్న రాణి, ప్రిన్సిపాల్ దాసరి ఉమామహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ మాలిక పాల్గొన్నారు



మడికొండ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

సమాచారం



ఇటీవలే స్వర్ణ విమాన గోపుర ఆవిష్కరణ పూర్తి చేసుకున్న యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ శుద్ధ విదియ నాడు (మార్చి 1న) ప్రారంభం కానున్నాయి. మార్చి 11వ తేదీ... ఫాల్గుణ శుద్ధ ద్వాదశి వరకూ కొనసాగే ఈ ఉత్సవాల్లో భాగంగా వివిధ అలంకార, వాహన సేవలు, స్వామి వారి కళ్యాణం, రథోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు.

యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలు

మార్చి 1: ఉదయం 10 గంటలకు విష్వక్సేన ఆరాధన, స్వస్తివాచకం, రక్షా బంధనం; సాయంత్రం 6.30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణం

మార్చి 2: ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 11 గంటలకు ధ్వజారోహణం; సాయంత్రం 6.30 గంటలకు భేరీ పూజ, దేవతాహ్వానం, హవనం

మార్చి 3: ఉదయం 9 గంటలకు మత్స్యావతార అలంకార సేవ, వేద పారాయణలు ప్రారంభం; రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ

మార్చి 4: ఉదయం 9 గంటలకు వటపత్రశాయి అలంకార సేవ; రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ

మార్చి 5: ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణాలంకార సేవ; రాత్రి 7 గంటలకు పొన్న వాహన సేవ

మార్చి 6: ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరిధారి అలంకార సేవ; రాత్రి 7 గంటలకు సింహవాహన సేవ

మార్చి 7: ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ; రాత్రి 8 గంటలకు అశ్వవాహన సేవ, స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం

మార్చి 8: ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకారం, హనుమంత వాహన సేవ; రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, అనంతరం స్వామివారి కళ్యాణోత్సవం

మార్చి 9: ఉదయం 9 గంటలకు శ్రీమహావిష్ణు అలంకారం, గరుడవాహన సేవ; రాత్రి 8 గంటల నుంచి దివ్య విమాన రథోత్సవం

మార్చి 10: ఉదయం 10.30 మహా పూర్ణాహుతి, చక్రతీర్థం; రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం,

మార్చి 11: ఉదయం 10 గంటలకు అష్టోత్తర శత ఘటాభిషేకం; రాత్రి 9 గంటలకు శృంగార డోలోత్సవం, ఉత్సవ సమాప్తి



ఆలయదర్శనం

ఆ ఆలయాన్ని తెరిచేది మూణ్ణాళ్ళే...



సలేశ్వరం లింగమయ్యను దర్శించాలంటే భక్తి మాత్రమే కాదు, సహనం కూడా కావాలి. అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉండే దట్టమైన అడవిలోని గుహలో కొలువైన ఆ స్వామి భక్తులకు దర్శనం ఇచ్చేది ఏడాదికి కేవలం మూడు లేదా అయిదు రోజులే. ఈ పురాతన ఆలయం ఎన్నో విశేషాలకు నిలయం. ఈ యాత్రను అమరనాథ్ యాత్రతో భక్తులు పోల్చుతూ ఉంటారు.

క్రీస్తుశకం 13వ శతాబ్దం నాటి 'మల్లికార్జున పండితారాధ్య చరిత్ర'లో సలేశ్వర క్షేత్రం గురించి పాల్కురికి సోమనాథుడు వైభవంగా వర్ణించాడు. అలాగే 16వ శతాబ్దంనాటి 'శ్రీ పర్వత పురాణం'లో... ఈ గుహాలయం గురించి, ఇక్కడి సర్వేశ తీర్థం, పుష్కర తీర్థం గురించి ప్రస్తావనలు కనిపిస్తాయి. క్రీస్తుశకం 300-750 విష్ణుకుండినులు, చాళుక్యుల కాలంలో జరిగిన నిర్మాణాలు ఈ ఆలయంలో ఉన్నాయి. ఏడాదిలో కొద్దిరోజులు మాత్రమే తెరిచి ఉండడం ఈ ఆలయం ప్రత్యేకత. భక్తుల సందర్శనకు ఆలయాన్ని సందర్శించే రోజుల సంఖ్య కూడా నానాటికీ తగ్గిపోతూ వస్తోంది. 1990వ దశకం వరకూ 11 రోజుల పాటు దీన్ని తెరిచి ఉంచేవారు. తరువాత భద్రత తదితర కారణాల వల్ల ఏడు రోజులకు, అయిదురోజులకు, చివరకు మూడు రోజులకు కుదించారు. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమికి అటు రెండు రోజులు, ఇటు రెండు రోజులు సలేశ్వర స్వామి ఆలయాన్ని తెరిచి ఉంచే ఆనవాయితీ కొన్ని ఏళ్ళు కొనసాగింది. ప్రస్తుతం మూడు రోజులే తెరుస్తున్నారు. ఫాల్గుణ మాసంలోనే ఏర్పాట్లు మొదలవుతాయి. కాగా, సౌకర్యాలను మెరుగుపరిచి, ఏడాదిలో తొలి ఐదునెలల పాటు సరేశ్వరం సంగమయ్యను భక్తులు దర్శించుకొనేందుకు వీలు కలిగిస్తామని అటవీశాఖ ప్రతిపాదిస్తోంది. దీనికి ఆదివాసీ సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

కీకారణ్యంలో ప్రయాణం...

తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని నల్లమల లోతట్టు అభయారణ్యంలో, జనావాసాలకు దాదాపు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయాన్ని చేరుకోవాలంటే దట్టమైన కీకారణ్యంలో ప్రయాణం సాగించవలసి ఉంటుంది. సుమారు అయిదు కిలోమీటర్లు కాలినడకన వెళ్ళాల్సి ఉంటుంది. మోకాళ్ళ కురువ వైపు రాళ్ళు తేలి ఉన్న కొండలను దిగాల్సి ఉంటుంది. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో... పర్హాబాద్ నుంచి అటవీ మార్గంలో 32 కిలోమీటర్ల దూరంలో ఈ క్షేత్రం ఉంటుంది. రాంపూర్ పెంట నుంచి కొద్ది దూరంలో వాహనాలు ఆపి, నడిచి వెళ్ళాలి. ఇక లింగాల నుంచి అప్పాయిపల్లి మీదుగా గిరిజన గుడారాల వరకూ వాహనాల్లో వెళ్ళవచ్చు. అక్కడి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో సలేశ్వరం ఆలయం ఉంటుంది. దారిలో ఎన్నో గుహలు, జలధారలు కనిపిస్తాయి. నీటి ప్రవాహం వెంబడి రెండు గుట్టల మధ్య ఇరుకైన దారిలో నడవాల్సి ఉంటుంది. అజాగ్రత్తగా ఉంటే అపాయం తప్పదు.



జలపాత స్నానం... స్వామి దర్శనం

ఏటా చైత్ర పౌర్ణమికి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలి వస్తారు. చుట్టూ ప్రకృతి సౌందర్యంతో అలరారే ఈ ఆలయం ఎదుట దాదాపు వెయ్యి అడుగుల ఎత్తునుంచి జలపాతం దూకుతూ ఉంటుంది. భక్తులు అక్కడ ఉన్న గుండంలో స్నానం చేసి, ప్రధాన గుహలో ఉన్న లింగమయ్యను దర్శించుకొని, పూజలు చేస్తారు. ఆలయం ముందు వీరభద్రుడు, గంగమ్మ విగ్రహాలు, కింది గుహలో మరో లింగం ఉంటాయి. భక్తులు మనసులో తలచుకున్న కోరికలన్నీ తీర్చే స్వామిగా లింగమయ్యను విశ్వసించి, ఆరాధిస్తారు.


గీతాసారం

మనసును లొంగదీసుకోవాలి

ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించడం చాలా కష్టం అనే అభిప్రాయం చాలామందిలో ఉంటుంది. అయితే అలా ఆలోచించే వ్యక్తులకు 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు భరోసా ఇస్తూ... కర్మ యోగంలో చిన్న ప్రయత్నాలే పెద్ద ప్రతిఫలాలను ఇస్తాయని చెప్పాడు. తగినంత (యుక్తమైన) ఆహారం, విశ్రాంతి, నిద్ర కలిగి ఉండి, యుక్తమైన కర్మలు చేస్తూ, జాగ్రదావస్థలో ఉండే వ్యక్తి... దుఃఖాలన్నిటినీ నాశనం చేసేది యోగమేనని తెలుసుకుంటాడని పేర్కొన్నాడు. ఆయన చెప్పిన ప్రకారం... 'యోగ లేదా ఆధ్యాత్మిక మార్గం ఆకలి వేసినప్పుడు ఆహారం తినడం, పని చేయాల్సి వచ్చినప్పుడు చెయ్యడం, నిద్రపోవడం లేదా విశ్రాంతి తీసుకోవడం, పని అవసరమైనప్పుడు వివిధ పనులు చేయడం అంతటి సరళమైనది.

ఒక శిశువుకు వయోధికులకన్నా ఎక్కువ నిద్ర కావాలి. మన ఆహారపు అవసరాలు రోజులో మనం చేసే శారీరక శ్రమ మీద ఆధారపడి ఉండొచ్చు. 'యుక్తమైన' అనే మాట... 'ఆ క్షణంలో తెలుసుకోదగినది' అనే అర్థాన్ని సూచిస్తుంది. భగవద్గీతలో అంతకుముందు పరిమిత చర్య, నిర్దేశిత విధులు లేదా తప్పనిసరి చర్యలుగా వీటి గురించి శ్రీకృష్ణుడు ప్రస్తావించాడు. దీనికి విరుద్ధంగా, మన మనస్సులు సాధారణ వాస్తవాలను సాగదీస్తూ, వాటి చుట్టూ సంక్లిష్టమైన కథనాలను అల్లడం కోసం మన ఊహలను జోడిస్తాయి. మనకు మనం చెప్పుకొనే ఈ కథలు వేరొకరిని కథానాయకులుగానో, ప్రతి నాయకులుగానో చేస్తాయి, పరిస్థితులను ఆహ్లాదకరంగానో, దుర్భరంగానో మారుస్తాయి. ఈ కథలే మన మాటలను, ప్రవర్తనను శాసిస్తాయి. అందుకే అన్ని కోరికలతో అనుబంధాన్ని వదిలిపెట్టి, ఈ కథలను చెప్పే మనసును లొంగ దీసుకోవాలని శ్రీకృష్ణుడు చెప్పాడు. గాలి లేని ప్రదేశంలో కంపించకుండా ఉన్న దీపం మాదిరిగా... ఆత్మతో ఐక్యతను అభ్యాసం చేస్తున్న, నిగ్రహంతో ఉన్న యోగి మనసు చలించదని ఆయన స్పష్టం చేశాడు. శ్రీకృష్ణుడు ఇంతకు ముందు తాబేలు, నదులు, సముద్రం లాంటి ఉదాహరణలు ఇచ్చాడు. నదులు సముద్రంలోకి ప్రవేశించిన తర్వాత వాటి ఉనికిని కోల్పోతాయి, అనేక నదులు ప్రవేశించిన తనతో తర్వాత కూడా సముద్రం ప్రశాంతంగా ఉంటుంది. అదేవిధంగా, సముద్రంలా స్థిరంగా ఉన్న యోగి మనస్సులో కోరికలు ప్రవేశించినప్పుడు... అవి వాటి ఉనికిని కోల్పోతాయి.





కె. శివప్రసాద్
ఐఎఎస్

సుభాషితం

అదే శాశ్వతం

వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీ విహార కలనంబు దొలంగగ జేయు గాని గుం
భనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢనైపుణీ
జనిత మహాయశోవిభవ సారము హంసకు మాన్పజాలునే

భర్తృహరి 'నీతి శతకం'లోని 'అమ్భోజినీ వనవిహార విలాసమేవ...' అనే శ్లోకానికి ఏనుగు లక్ష్మణకవి తెలుగులో చేసిన అనుసృజన ఇది.




భావం: తన వాహనమైన హంస మీద బ్రహ్మదేవుడికి కోపం వస్తే... కలువలతో నిండిన సరస్సులో అది విహరించకుండా నిరోధించగలడేమో! కానీ పాలను, నీటిని వేరు పరచగలిగే దాని సామర్థ్యాన్ని మాత్రం పోగొట్టలేడు. అంటే... ఎంత అధికారంలో ఉన్నవారైనా... తమ దగ్గర పనిచేసేవారిని, తమ ఆశ్రితులను ఇబ్బందులు పెట్టగలరు, నియంత్రించగలరు. కానీ వారిలో ఉన్న ప్రతిభను నాశనం చేయలేరు. అది శాశ్వతం, అదే శాశ్వతం.

చింతన

ప్రపంచాన్ని మార్చేది ప్రేమే

మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఒక వ్యక్తి కొన్ని సంవత్సరాలపాటు ఒక మానసిక వైద్యుడి దగ్గర చికిత్స తీసుకున్నాడు. అతనికి ఎలాంటి ఫలితమూ కనిపించలేదు. ఒకసారి అతను జిడ్డు కృష్ణమూర్తి ఉపన్యాసం విన్నాడు. ఒక్కసారిగా అతనికి సంపూర్ణమైన మానసిక ఆరోగ్యం చేకూరింది. మానసిక వైద్యుడికి ఈ విషయం తెలిసి, కృష్ణమూర్తిని కలుసుకున్నాడు. "మీ చికిత్సా పద్ధతి (టెక్నిక్) ఏమిటో నాకు చెప్పండి" అని కోరాడు. ఆ సందర్భంలో వారిద్దరిమధ్యా ఆసక్తికరమైన సంభాషణ జరిగింది. దాని సారాంశం ఏమిటంటే..

సిగ్మండ్ ఫ్రాయిడ్ రూపొందించిన మనో విశ్లేషణ శాస్త్రం ప్రకారం... మన చైతన్యంలో మనకు తెలియకుండానే... అంటే అజ్ఞాతంగా... ఒక అంతర్ చైతన్యం ఉంటుంది. అది వివేకానికి, హేతువాదానికి అతీతమైన జంతు ప్రవృత్తులకు నిలయం. దానిలో మన పెద్దల నియంత్రణ కారణంగా అణచుకున్న, మనం నిగ్రహించుకోలేని లైంగిక వాంఛలు, బాల్యం తొలిరోజుల్లో మన మనసుకు తగిలిన తీవ్రమైన గాయాలు, మనం అనుభవించిన ఉపద్రవాలు, ఉద్రేకాలు సజీవంగా ఉంటాయి. ఇవి మన ప్రమేయం లేకుండానే మన ప్రవర్తన మీద ప్రభావం చూపిస్తాయి. అంతేకాదు, మనకు మానసిక రుగ్మతలను కూడా కలిగిస్తాయి. రోగికనే కలలను ఆధారం చేసుకొని... అతని అంతర్ చైతన్యంలో దాక్కొని, మనోవ్యాధిని కలిగిస్తున్న రహస్యమైన కారణాలను మనో విశ్లేషకుడు ఆ రోగికి తెలిసేలా చేస్తాడు. తద్వారా వ్యాధి నయమవుతుంది. ఇది క్లుప్తంగా సిగ్మండ్ ఫ్రాయిడ్ మనో విశ్లేషణ శాస్త్ర సిద్ధాంతం. అయితే దీనిలో లోపాలను జిడ్డు కృష్ణమూర్తి చూపించారు.



మనో విశ్లేషకుడు తను నేర్చుకున్న సిద్ధాంతాలు, దానికి సంబంధించిన తర్ఫీదు ప్రభావంలో ఉంటాడు. కాబట్టి రోగిలో తన సిద్ధాంతాలనే చూస్తాడు. కళ్ళ ఎదుట ఉన్న సంపూర్ణమైన మనిషిని కాదు, రోగి చైతన్యంలో వ్యాధిగ్రస్తమైన భాగాన్ని నయం చేయడం, ఈ సమాజంతో రోగికి ఎలాంటి ఘర్షణ లేకుండా చేయడం మనో విశ్లేషకుడి లక్ష్యం. మరి ఒక వ్యాధిగ్రస్తమైన సమాజంతో రాజీ పడేలా చేసే చికిత్స వాంఛనీయమేనా?అనేది జిడ్డు కృష్ణమూర్తి వేసిన ముఖ్యమైన ప్రశ్న. అంతేకాదు, కళ్ళగంతల్లాంటి సిద్ధాంతాల సహాయంతో, శాస్త్రాల సహాయంతో ఎదుటి మనిషిని అర్థం చేసుకోలేం. ఎదుటి వ్యక్తి అంతర్ ప్రపంచానికి ఈ సిద్ధాంతాలతో, భావాలతో సంబంధం లేని తిన్ననైన (డైరెక్ట్) మార్గం ఏదైనా ఉంటుందా? పంటి నొప్పిని అర్థం చేసుకోవడానికి ఏ సిద్ధాంతాల అవసరమూ ఉండదు కదా!

దీనికోసం మనో విశ్లేషకుడు తన సిద్ధాంతాలనూ, నేర్చుకున్న శాస్త్రాలను, తన ఆలోచనలను... అంటే తన పైన ఉన్న ప్రభావాలన్నిటినీ వదిలించుకోవాలి. 'నువ్వు-నేను' అనే ద్వైతాన్ని అధిగమించాలి. అంటే తన వ్యక్తిత్వాన్ని సన్యసించాలి. అప్పుడు అతనికి ఎదుటి వ్యక్తి చైతన్యాన్ని సజావుగా చూడగలిగే సామర్థ్యం కలుగుతుంది. ఈ సామర్థ్యాన్నే 'ప్రేమ' అని చెప్పారు జిడ్డు కృష్ణమూర్తి. "ప్రేమ అనేది రెండు చైతన్యాల మధ్య ఏర్పడే వంతెన. అన్ని మానసిక వ్యాధులకు ఏకైక చికిత్స. ఈ సామర్థ్యం ఉన్న మనుషులు పదిమంది చాలు... ఈ ప్రపంచాన్ని మార్చడానికి" అని ఆయన అన్నారు.

• గుంటూరు వనమాలి
www.gunturu.de


సద్బోధ

అంతా ఒక్కటే


ఒక రాజు కొందరు భటులతో కలిసి అడవిలో వేటకు వెళ్ళాడు. వాళ్ళు జంతువులను తరుముతూ కొంత ముందుకు వెళ్ళాక... ఒక చెట్టు కింద ఓ మనిషి కనిపించాడు. వస్త్రాలు ధరించని ఆ వ్యక్తి... నేల మీద పడుకొని ఉన్నాడు. అతను చాలా సంతోషంతో ఉన్నట్టు బిగ్గరగా నవ్వుతున్నాడు. ప్రపంచమంతా తనతోనే ఉన్నట్టు, లోకమంతా తనదే అయినట్టు అతనిలో ఆనందం పొంగిపొరలుతోంది. ఇది చూసిన రాజుకు ఆశ్చర్యం వేసింది. తన భటులను పిలిచి... "ఆ మనిషి ఎవరో, ఎందుకు అలా ప్రవర్తిస్తున్నాడో తెలుసుకొని రా!" అని ఆజ్ఞాపించాడు.

భటులు ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళారు. అతణ్ణి పిలిచారు. ఆ వ్యక్తి కనీసం వారు అక్కడ ఉన్న సంగతి కూడా గుర్తించనట్టు... తన ధోరణిలో తను ఉన్నాడు. భటులు కొద్దిసేపు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో... రాజు దగ్గరకు వచ్చి, జరిగింది చెప్పారు.

అప్పుడు రాజు గుర్రం దిగి... ఆ వ్యక్తి దగ్గరకు వచ్చి "స్వామీ! మీరెవరు? ఈ అడవిలో ఏం చేస్తున్నారు? దుస్తులేవీ లేకుండా, ఉత్త నేల మీద ఎందుకు పడుకున్నారు? మీలో అనంతమైన ఆనందం కనిపిస్తోంది. మీరు ఇంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నారు? ఈ స్థితిని సాధించడానికి మీకు దారి చూపించిన గురువు ఎవరు?" అని ప్రశ్నించాడు.



అప్పుడు ఆ వ్యక్తి రాజు వైపు చూసి "నాయనా! ఈ శరీరం, ఈ భూమి, పక్షులు, కొన్ని పరికరాలు, కొందరు మనుషులు... ఇలా నాకు ఎందరో గురువులు. వారందరూ నాకు బోధించారు. వారందరి దగ్గరా నేను నేర్చుకున్నాను. గమనించినట్టయితే మన చుట్టూ ఉన్న ప్రతిదీ మనకి గురువే. ప్రతి దానినుంచి మనం ఏదో ఒకటి నేర్చుకోవచ్చు. మంచిని చూసి... అలా ఉండాలని తెలుసుకున్నాను. చెడ్డ విషయాలను గమనించి, వాటికి దూరంగా ఉండాలని గ్రహించాను. అలా నేర్చుకున్నాక... తిన్నా, తినకపోయినా, ఎక్కడ పడుకున్నా, మంచి దుస్తులు ఉన్నా, లేకపోయినా... అన్నీ ఒకటేననేది అర్థమయింది. అప్పుడు సంతోషం తప్ప ఇంకేం ఉంటుంది?" అని సమాధానం ఇచ్చాడు. అతను మహాజ్ఞాని అనీ, అవధూత అనీ, సాక్షాత్తూ దత్తాత్రేయ స్వరూపమనీ రాజుకు అర్థమయింది. అతని పాదాలకు నమస్కరించి, తన భటులతో కలిసి వెనుతిరిగాడు.



ఒక సరళమైన విషయాన్ని మీకు చెప్పాలని అనుకుంటున్నాను. ఇది ఏ దేశానికి సంబంధించినదో, ఏ మతానికి సంబంధించినదో కాదు... మీ స్వవిషయం. ప్రతి మానవునికి సంబంధించిన విషయం. జీవించి ఉన్న ప్రతి మానవునిలోనికి శ్వాస నిరంతరం వస్తూ, పోతూ ఉంటుంది. ప్రతి శ్వాసలో అద్వితీయమైన శాంతి దాగి ఉంటుంది. ఇది ఎంతో ఆశ్చర్యకరం. అలాగే ప్రతి శ్వాసలో భగవంతుడి అనుగ్రహం దాగి ఉంటుంది. ఇది అన్నిటినీ మించిన విశేషం.

మనమందరం ఈ ప్రపంచంలో పుట్టిన తరువాత... ఒక కానుక రూపంలో మొదటి రోజు లభించింది. ఆ తరువాత రెండో రోజు, అనంతరం మూడో రోజు... ఇలా రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలు మనకు లభ్యమవుతూనే ఉన్నాయి. కానీ మనలో ఉన్న ఆ పరమానందాన్ని, ఆ సంపదను మనం గుర్తించగలుగుతున్నామా? చివరకు ఒకానొక రోజు వస్తుంది. ఆ రోజు ఈ శ్వాస రాకపోకలు సమాప్తమైపోతాయి. ఉత్త చేతులతో వచ్చిన మనం చివరకు ఉత్త చేతులతోనే అంతమైపోతాం. ఇప్పుడు మీకు ఆసక్తికరమైన సంగతి ఒకటి చెబుతాను. మీలో అంతర్గతంగా ఉన్నదాన్ని అర్థం చేసుకొని, ఆ పరమానందానుభూతిని స్వయంగా పొందితే... ఉత్త చేతులతో జన్మించనప్పటికీ... ఉత్త చేతులతో తిరిగి వెళ్ళరు.

అది మీలోనే ఉంది...

నేను సమాజాల గురించో, నగరాల గురించో మాట్లాడను. నేను మనిషి గురించి మాట్లాడతాను. తద్వారా వారి జీవితాల్లో కూడా శాంతి దీపాలు వెలగాలని కోరుకుంటాను. ఎన్నో ఏళ్ళుగా అంధకారంలో ఉన్న మీ హృదయాల్లో... శాంతి జ్యోతులు ప్రజ్వరిల్లి, మీకు లభ్యమైనవాటిని మీరు గుర్తించగలగాలన్నదే నా ఆకాంక్ష. ఎందుకంటే దీపం వెలిగినప్పుడు మాత్రమే అంధకారం తొలగుతుందని, ప్రకాశం ఏర్పడుతుందని మీకు బాగా తెలుసు. అలా జరిగినప్పుడు, మీ జీవితం తేజోవంతమయిందని మీరే చెప్పగలుగుతారు. ఇది స్వయంగా అనుభూతి చెందవలసిన విషయం. దేనికోసం మీరు అన్వేషిస్తున్నారో... అది మీలోనే ఉంది. ఇది చాలా ముఖ్యమైన విషయం. ఇది ఎన్నటికీ మరువకండి. "ఏ శాంతి కోసం మీరు అన్వేషిస్తున్నారో... అది మీకు దూరంగా ఎక్కడో లేదు. మీలోనే ఉంది. మీరు జీవించి ఉన్నంతకాలం మీలోనే ఉంటుంది" అని యావత్ ప్రపంచం పర్యటించి, పదిమందికీ తెలియజేస్తూ ఉంటాను. అద్భుతాలు చూడాలనే కుతూహలం చాలామందికి ఉంటుంది. కానీ అసలైన అద్భుతం అంటే ఏమిటో తెలియనివారు ఎంతోమంది ఉన్నారు. మీ శ్వాసే అసలైన అద్భుతం. ఎందుకంటే ప్రపంచం మొత్తంలో ఉన్న ధనం అంతటినీ ఖర్చు చేసినా సరే... ఒక్క శ్వాసను కూడా మీరు కొనలేరు. అలాంటి అమూల్యమైన శ్వాస తాలూకు గొప్పతనాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి, మీ జీవితాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. ఈనాడు మీరు ప్రాణాలతో ఉన్నారంటే అందుకు కారణం ఏమిటి? మీలోపలికి శ్వాస వస్తూ, పోతూ ఉండడమే! శ్వాసకన్నా విలువైనది ఈ సమస్త విశ్వంలో మరొకటి లేదు. ధనికులైనా, పేదలైనా, చదువుకున్నవారైనా, చదువురానివారైనా... ఎవరైనా సరే, వారి జీవితం శ్వాసతో ముడిపడి ఉంటుంది. కాబట్టి, ఈ శ్వాస గొప్పతనాన్ని గుర్తించకపోతే... లభ్యమైన ఈ కానుక చేజారిపోతుంది. అసలైన అద్భుతాన్ని మీరు చూడాలనుకుంటే... మీలో ఉన్న హృదయాన్ని చూడండి. మీ లోపలే అద్భుతం జరుగుతోంది. మీకు చేదోడుగా నిలిచే మీ ఆప్తమిత్రుడు మీలోనే ఉన్నాడు. మీ దగ్గర ఉన్నవన్నీ పూర్తిగా అంతమైపోయినా... ఆ ఆప్తుడు సదా వి ఎమ్మల్ని చేరదీస్తాడు.

అంతర్ముఖంగా పరిగెడదాం...

జీవితాంతం ఆనందంగా ఉండాలని, సుఖ సంతోషాలతో ఉంటూ పరమానందానుభూతిని పొందాలనే ఆకాంక్ష ప్రతి మనిషికి అణువణువునా ఉంటుంది. అనంతమైనది, సుఖప్రదమైనది, ఆనందకరమైనది ఒకటి మీ ఈ దేహంలోనే ఉందని గుర్తించండి. దాన్ని గుర్తించనంతవరకూ మీ జీవితం సఫలీకృతంకాదు. అందరి హృదయాల్లో దేవుడు కొలువై ఉన్నా... మనుషులందరూ బాహ్యమైన విషయాలవైపు పరుగు తీస్తున్నారు. కానీ పరుగులు తీయవలసినది అంతర్ముఖంగా. ఆ దిశలో అడుగులు వేస్తే... హృదయం తనవైపు మిమ్మల్ని ఆకర్షిస్తుంది. మరి హృదయ దాహం ఎలా తీరుతుంది? దానికి మార్గం ఏమిటి? భగవంతుడు మీకోసం మీలోపలే ఎదురుచూస్తున్నాడు. ఆయనకు మోకరిల్లి, ఆయనకు శుశ్రూష చేసినట్టయితే... మీ జీవితంలో కూడా సుఖశాంతులు వెల్లి విరుస్తాయి... ఈ విషయాన్నే నేను వివిధ ప్రాంతాల్లో పర్యటించి అందరికీ తెలియజేస్తూ ఉంటాను.



• ప్రేమ్ రావత్
9246275220
www.premrawat.com

నన్ను అరెస్టు చేశారు రాజా!

(మొదటిపేజీ తరువాయి)



హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తన వ్యాఖ్యల ద్వారా చిత్రపరిశ్రమలో విభేదాలు సృష్టించారంటూ ఆయనపై ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ కేసులో విచారణ కోసం ఆయనను హైదరాబాద్ నుంచి ఇక్కడకు తీసుకొస్తున్నారన్న సమాచారంతో, వైసీపీ నాయకులు, కార్యకర్తలే కాకుండా జనం కూడా పెద్ద ఎత్తున పోలీసుస్టేషన్ వద్ద గుమికూడారు. వారిని ఉద్దేశించి పోసాని పై వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ గురుమహేశ్ పోసానికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని నిర్ధారించారు. భుజం నొప్పి, గుండె సంబంధిత సమస్యల కారణంగా మందులు తీసుకుంటున్నట్లు గుర్తించారు. కాగా, పోసానిని బుధవారం అర్ధరాత్రికి కర్నూలులోని బెటాలియన్‌కు తరలించారు. గురువారం ఉదయం 6.30 గంటలకు బయలుదేరి కర్నూలు నుంచి కడప మీదుగా కాకుండా నెల్లూరు మీదుగా ప్రయాణించారు. ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో రాపూరు వద్ద టిఫిన్ చేశారు. 11.30 గంటలకు ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం రెండుగంటలకు స్టేషన్‌లోనే భోజనం చేశారు. విచారణ సందర్భంగా కొబ్బరినీళ్లు తాగినట్లు తెలిసింది.

'నేను చేసింది తప్పే'

ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షణలో పోసానిని ఏడు గంటలపాటు విచారించారు. ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను విచారణ జరుగుతున్న ప్రాంతానికి రానీయలేదు. ఎస్పీ నిర్దేశంలో ఇద్దరు సీఐలు ప్రశ్నల వర్షం కురిపించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్‌లను ఎందుకు అసభ్యకరంగా తిట్టారు? ఎవరు చెబితే తిట్టారు? ఎవరైనా ముందుగా స్క్రిప్ట్ రాసి ఇచ్చారా? పదే పదే ఎందుకని దుర్భాషలాడారు? ఇలా తిట్టడం వెనుక.. ఇంకా ఎవరి హస్తం ఉంది.? వంటి అనేక ప్రశ్నలు పోసానిని విచారణలో భాగంగా అడిగినట్లు సమాచారం. ఇందుకు ఆయన స్పందిస్తూ... "నన్ను ఎవరూ ప్రేరేపించలేదు. ఎవరూ నాకు చెప్పలేదు. నేనే స్వయంగా మాట్లాడాను. అలా మాట్లాడటం తప్పే' అని పోసాని అన్నట్టు తెలిసింది. ఎస్పీ 17 ప్రశ్నలు వేయగా, ఎక్కువగా నాకు తెలియదు.. గుర్తు లేదు.. అని తెలిపినట్టు సమాచారం. ఈ సమయంలో అప్పటి వీడియోలు చూపించగా, 'లవ్ యూ రాజా' అంటూ పొంతన లేని వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది. విచారణ అనంతరం రాత్రి తొమ్మిది గంటల సమయంలో పోసానిని రైల్వేకోడూరు కోర్టులో పోలీసులు హాజరుపరచారు. పోసాని తరఫున న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. అంతకుముందు.. పొన్నవోలు, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, స్థానికులు ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ వద్దకు వచ్చారు. అయితే పోసానిని కలవడానికి వారికి పోలీసులు అనుమతి ఇవ్వలేదు.

మనోభావాలు దెబ్బతీశారు : ఫిర్యాదుదారు

ప్రజలు, జనసేన కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే విధంగా నోటికొచ్చినట్లు పోసాని మాట్లాడడం వల్లే ఆయనపై కేసు పెట్టినట్లు ఫిర్యాదుదారు చెన్నరాజుపోడు మాజీ సర్పంచ్ మణి తెలిపారు. ఓబులవారిపల్లె పోలీసుస్టేషన్ సమీపంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకుల తల్లి, భార్య, బిడ్డల గురించీ పోసాని ఇష్టమొచ్చినట్లుగా అసభ్యంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు.


మానవ హక్కులపై లఘు చిత్ర పోటీల్లో తెలంగాణకు ప్రత్యేక అవార్డు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులపై ప్రతి ఏటా జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్సీ) నిర్వహించే వార్షిక లఘు చిత్ర పోటీల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు అత్యంత ప్రతిభ కనబరిచారు. తెలంగాణ నుంచి ప్రత్యేక ప్రశంస క్యాటగిరీలో హనీష్ ఉండ్రమట్ల రూపొందించిన అక్షరభ్యాసం ఎంపికైంది. మానవ హక్కులకు కలిగే విఘాతాలను అరికట్టాలనే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఆర్సీ లఘు చిత్ర పోటీలను నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో నిలిచింది. దీనితో పాటు మరో రెండు ప్రత్యేక బహుమతులు దక్కాయి. ఈ మేరకు గురువారం ఎన్‌హెచ్‌ఆర్సీ విజేతలను ప్రకటించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన పదో ప్రతిష్ఠాత్మక వార్షిక లఘు చిత్రాల పోటీల్లో ఏపీకి చెందిన కదరప్ప రాజు రాసిన ఫైట్ ఫర్ రైట్స్ ద్వితీయ స్థానంలో నిలిచింది. బాల్య వివాహాలు, విద్య యొక్క సమస్యలను కళ్లకు కట్టినట్లు చూపించారు కదరప్ప రాజు. ప్రత్యేక ప్రశంస క్యాటగిరీలో మడక వెంకట సత్యనారాయణ రూపొందించిన సీత జీవితం, లోట్ల నవీన్ రూపొందించిన బీప హ్యూమన్ వంటి చిత్రాలు ఎంపికయ్యాయి. జమ్మూ కశ్మీర్‌కు చెందిన అబ్దుల్ రషీద్ భట్ రూపొందించిన దూద్ గంగా వ్యాలీస్ డైయింగ్ లైఫ్‌లైన్ లఘు చిత్రం మొదటి స్థానం సాధించింది.

మార్చి 5న విచారణకు రండి

గోరంట్ల మాధవ్‌కు బెజవాడ పోలీసుల నోటీసులు

- పోక్సో కేసులో బాధితుల పేర్లు వెల్లడించారంటూ గత ఏడాది వాసిరెడ్డి పద్మ ఫిర్యాదు.. కేసు నమోదు


వేలుచూపిస్తూ మీడియాపై కేకలు వేస్తున్న గోరంట్ల

అనంతపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్‌కు విజయవాడ సైబర్ క్రైం పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోక్సో కేసులో బాధితుల వివరాలను మీడియా సమావేశంలో ఆయన బహిరంగంగా వెల్లడించారంటూ రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ గత ఏడాది నవంబరు 2న ఫిర్యాదు చేశారు. దీంతో మాధవ్‌పై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు బీఎన్ఎస్ 72, 79 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి వారు అనంతపురం వచ్చి మాధవ్ నివాసానికి వెళ్లారు. ఈ కేసులో మార్చి 5న విజయవాడలో విచారణకు రావాలని సూచించారు. విజయవాడ పోలీసులు ఆయన ఇంటికి వచ్చారని, అరెస్టు చేయబోతున్నారని ప్రచారం జరగడంతో మాధవ్ అనుచరులు, వైసీపీ శ్రేణులు అక్కడకు చేరుకున్నారు. అయితే పోలీసులు నోటీసులు మాత్రమే ఇచ్చి వెళ్లిపోయారు. కాగా.. పోలీసుల నుంచి నోటీసులు అందుకున్న మాధవ్ మీడియాపై నోటి దురుసు ప్రదర్శించారు. 'పోలీసు ఆఫీసర్‌గా పనిచేశారు కదా..! పోక్సో కేసులో బాధితుల పేర్లు బయటకు చెప్పకూడదనే విషయం తెలియదా..' అని విలేకరులు ప్రశ్నించడంతో ఆయన వారిపై ఆవేశంతో ఊగిపోయారు. 'మీది ఏ టీవీ..? ఏ మీడియా..? ఏ పత్రిక..' అంటూ చిందులు వేశారు. తర్వాత నోటీసులపై స్పందిస్తూ... తన న్యాయవాదులతో చర్చించి.. మార్చి 5న విచారణకు వెళ్లాలో లేదో నిర్ణయించుకుంటానని తెలిపారు.

చిత్రజ్యోతి

SINCE 1965

రెట్రోను అందిస్తున్న సితార



విభిన్న పాత్రలు, చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న తమిళ హీరో సూర్య తాజా చిత్రం 'రెట్రో'. మే ఒకటిన విడుదలకు సిద్ధమవుతున్న ఈ చిత్రం తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఒకవైపు వరుసగా సినిమాలు నిర్మిస్తూ భారీ విజయాలను అందుకుంటున్న ఈ సంస్థ మరో వైపు పంపిణీరంగంలోనూ తనదైన ముద్ర వేస్తోంది. సూర్య తెలుగు అభిమానులు థియేటర్లలో పండగ చేసుకొనేలా 'రెట్రో' విడుదలకు ఈ సంస్థ ప్లాన్ చేస్తోంది. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వం వహిస్తున్న 'రెట్రో'లో పూజా హెగ్డే కథానాయిక. సూర్య, జ్యోతిక నేతృత్వంలో 2డి ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. జోజు జార్జ్, జయరామ్, నాజర్, ప్రకాశ్‌రాజ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న 'రెట్రో' చిత్రానికి సంబంధించి ఇప్పుడు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి.

జూన్‌లో వస్తున్న కుబేరుడు



ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'కుబేర'. ఈ ఏడాది జూన్ 20న తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. పోస్టర్‌లో నాగార్జున, ధనుష్ ఎదురెదురుగా నిలబడి ఒకరిని మరొకరు తీక్షణంగా చూస్తుండటం ఆసక్తిని కలిగిస్తోంది. సినిమాలోని నాలుగు ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ గ్లింప్స్ ప్రేక్షకుల్లో అంచనాలను పెంచింది.

విష్ణు నమ్మకమే శివుడి పాత్ర చేయించింది

-అక్షయ్ కుమార్



'శివుడి పాత్ర చేయాలంటూ ఆఫర్ వచ్చినప్పుడు నేను రెండు సార్లు తిరస్కరించాను. కానీ విష్ణు వదల్లేదు. భారతీయ సినీ ప్రపంచంలో శివుడిగా నేను బాగుంటాను' అని విష్ణు పెట్టుకున్న నమ్మకమే నాతో ఆ పాత్ర చేయించింది. కన్నప్ప కథ చాలా శక్తిమంతమైంది. విజువల్ వండర్‌గా ఉంటుంది. ఈ అద్భుతమైన ప్రయాణంలో నేనూ భాగమవడం గౌరవంగా భావిస్తున్నాను' అన్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. డాక్టర్ మోహన్‌బాబు తన తనయుడు విష్ణు మంచుతో ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో నిర్మించిన 'కన్నప్ప' టీజర్‌ను ముంబైలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అక్షయ్‌కుమార్ మాట్లాడారు. హీరో విష్ణు మాట్లాడుతూ 'కన్నప్ప కేవలం నాకు ఓ సినిమా కాదు.. నా జీవన ప్రయాణం. కన్నప్ప కథతో నాకు ఆధ్యాత్మిక బంధం ఏర్పడింది. ఈ ప్రయాణంలో అక్షయ్‌కుమార్, మోహన్‌లాల్, ప్రభాస్ వంటి దిగ్గజాలు మాతో చేరడం ఆనందంగా ఉంది. ఇప్పటికే కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో అందరి దృష్టినీ ఆకట్టుకొన్న టీజర్‌ను మార్చి ఒకటిన విడుదల చేస్తున్నాం. ఏప్రిల్ 25న 'కన్నప్ప' విడుదలవుతుంది' అని చెప్పారు.

పూజా హెగ్డే ప్రత్యేక గీతం



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'కూలీ' చిత్రంలో పూజా హెగ్డే నటిస్తున్నారు. ఆమె లుక్‌ను చిత్రబృందం గురువారం విడుదల చేసింది. బుధవారం 'ఈ స్టార్ హీరోయిన్ ఎవరో గుర్తుపట్టండి' అంటూ ఓ ప్రీలుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ పోస్టర్ పూజా హెగ్డేదేనంటూ ప్రకటించింది. అయితే, ఈ మూవీలో పూజా హెగ్డే కీలక పాత్రను పోషిస్తున్నారా? లేక స్పెషల్ సాంగ్‌లో నర్తిస్తున్నారా? అనేది తెలియాల్సివుంది. 'జైలర్' సినిమాలో హీరోయిన్ తమన్నా 'కావాలయ్యా' పాట తరహాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఓ ప్రత్యేక గీతాన్ని ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది. ఈ గీతంలో నర్తించేందుకు పూజా హెగ్డేను ఎంపిక చేసినట్టు అభిమానులు భావిస్తున్నారు. ఈ మూవీలో ఆమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, శ్రుతిహాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

-చెన్నై, ఆంధ్రజ్యోతి

ఇది పైసా వసూల్ సినిమా

- సందీప్ కిషన్



'మజాకా' చిత్రాన్ని ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఇది పైసా వసూల్ సినిమా. అందరూ థియేటర్లలోనే చూడండి' అని హీరో సందీప్ కిషన్ కోరారు. ఆయన కథానాయకుడిగా నక్కిన త్రినాథరావు దర్శకత్వం వహించిన 'మజాకా' చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ గురువారం నిర్వహించింది. ఈ సందర్భంగా సందీప్‌కిషన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు' అని అన్నారు. త్రినాథరావు మాట్లాడుతూ 'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మేం సక్సెస్ అయ్యాం అనిపించింది' అని తెలిపారు.

ఆస్ట్రేలియాలో షూట్ చేశాం

- విరాజ్ రెడ్డి



విరాజ్‌రెడ్డి చీలం కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'గార్డ్'. జగ పెద్ది దర్శకత్వంలో అనసూయ రెడ్డి నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా విరాజ్‌రెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రం షూటింగ్ అంతా ఆస్ట్రేలియాలో చేశాం. ఒక సెక్యూరిటీ గార్డ్ జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా సినిమా ఉండబోతోంది. కథానుసారం అన్ని రకాల ఎమోషన్స్ పలికించడం నటుడిగా నాకు సవాల్ అనిపించింది" అని చెప్పారు.



అప్‌డేట్స్

ఆ వాహనం కథేంటి?



హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు, సాన్వి మేఘన, నిహాల్ కోధాటి ముఖ్య తారలుగా సుప్రీత్ కృష్ణ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'టుక్ టుక్'. రాహుల్ రెడ్డి, లోక్కు శ్రీవరుణ్, శ్రీరాముల రెడ్డి, సుప్రీత్ సి కృష్ణ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 21న విడుదల కానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సుప్రీత్ కృష్ణ మాట్లాడుతూ 'న్యూ ఏజ్ స్టోరీతో రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుంది. ఇందులో ఉండే స్కూటర్ కమ్ ఆటో ఎన్నో మ్యాజికల్ పవర్స్‌ను కలిగి ఉంటుంది. అందరూ ఆ వాహనం ప్రేమలో పడిపోతారు. యువతరానికి నచ్చే అంశాలతోపాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే భావోద్వేగాలు ఈ చిత్రంలో ఉన్నాయి' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కథలో ఆ స్కూటర్ కమ్ ఆటో పాత్ర ఏంటి అనేది సినిమాలో ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది' అని చెప్పారు.

తెలుగు తెరకు కొత్త గ్లామర్



టాలీవుడ్ స్క్రీన్‌కు ఓ కొత్త గ్లామర్ యాడ్ కాబోతుంది. 'సర్కార్ నౌకరి ఫేమ్', గాయని సునీత తనయుడు ఆకాశ్ హీరోగా శివ దర్శకత్వంలో తథాస్తు క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మాత తాటి బాలకృష్ణ, నిర్మిస్తున్న చిత్రంలో భైరవి కథానాయికగా పరిచయం అవుతున్నారు. 'ఈ మూవీని విలేజ్ బ్యాక్ గ్రౌండ్‌లో నిర్మిస్తున్నాం. రొమాంటిక్ లవ్ సస్పెన్స్ కామెడీ చిత్రం ఇది' అని నిర్మాత తాటి బాలకృష్ణ తెలిపారు.

నేర పరిశోధన నేపథ్యంలో



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో రూపొందుతున్న క్రైమ్ థ్రిల్లర్ 'అబ్సెషన్'. రాకేశ్ శ్రీపాద దర్శకత్వంలో రవి నాలమ్ నిర్మిస్తున్నారు. గురువారం కొరియోగ్రాఫర్ గణేశ్ మాస్టర్ చేతుల మీదుగా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. హరీశ్ వినయ్, వి. ధీరజ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనీశ్ రాజ్ దేశ్‌ముఖ్, సినిమాటోగ్రఫీ: వనిధర్‌రెడ్డి





ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

సూపర్ బిలియనీర్లలో అంబానీ, అదానీ

రూ.36.45 లక్షల కోట్లతో ఎలాన్ మస్క్ టాప్

ముకేశ్ అంబానీ రూ.7.88 లక్షల కోట్లతో 17 వ స్థానం

గౌతమ్ అదానీ రూ.5.27 లక్షల కోట్లతో 22 వ స్థానం



భారత కుబేరులు, పారిశ్రామిక దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ సంపదలో మరో ఘనత సాధించారు. ప్రపంచంలో 24 మంది సూపర్ బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. 5,000 కోట్ల డాలర్ల (రూ.4.35 లక్షల కోట్లు) పైబడిన సంపద గల వారిని సూపర్ బిలియనీర్లుగా వ్యవహరిస్తారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ 41,900 కోట్ల డాలర్ల (రూ.36.45 లక్షల కోట్లు) నికర సంపదతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలవగా, జెఫ్ బెజోస్ 26,380 కోట్ల డాలర్లతో రెండో స్థానంలో నిలిచారు. కాగా 9,060 కోట్ల డాలర్లతో (రూ.7.88 లక్షల కోట్లు) అంబానీ 17వ స్థానంలోను, 6,060 కోట్ల డాలర్లతో (రూ.5.27 లక్షల కోట్లు) అదానీ 22వ స్థానంలోను నిలిచారు. ప్రపంచ సంపదను ట్రాక్ చేసే అల్ట్రాటా సంస్థ విడుదల చేసిన జాబితాలో ఈ వివరాలున్నాయి. సూపర్ బిలియనీర్లలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న మస్క్ సంపాదన గంటకి 20 లక్షల డాలర్లు.. అంటే అక్షరాలా రూ.17.4 కోట్లు. ఈ లెక్కన మస్క్ 2027 నాటికి ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్ అవుతాడని అంచనా. ఒక సగటు అమెరికన్ సంపదతో పోల్చితే మస్క్ సంపద 20 లక్షల రెట్లు అధికమని వెల్లడించింది.

100 మంది సెంటి బిలియనీర్లు: ఇటీవల కాలంలో ప్రపంచంలో కుబేరుల సంఖ్య విశేషంగా పెరిగిపోతూ ఉండడంతో వారిలో 5,000 కోట్ల డాలర్ల పైబడిన సంపద గల వారిని సూపర్ బిలియనీర్లుగా వర్గీకరిస్తున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నాటికి ఈ సూపర్ బిలియనీర్లు ప్రపంచంలోని కుబేరుల సంపద మొత్తంలో 16 శాతం వాటా కలిగి ఉన్నట్టు ఆ నివేదిక తెలిపింది. 2014లో ఈ వాటా కేవలం 4 శాతం ఉంది. వీరందరి మొత్తం సంపద 3.3 లక్షల కోట్ల డాలర్లకు చేరింది. అంటే ఫ్రాన్స్ జీడీపీతో సమానం. సూపర్ బిలియనీర్లుగా వర్గీకరించిన 24 మందిలో కూడా 16 మంది సెంటి బిలియనీర్లుగా (10,000 కోట్ల డాలర్లు) గుర్తింపు పొందారు.

కుబేరుల్లోనూ అసమానతలు

సమాజంలో సంపన్నులు, పేదల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోతున్నట్టుగానే కుబేరుల్లో కూడా ఆర్థిక వ్యత్యాసాలు గణనీయంగా పెరుగుతున్నాయి. సూపర్ బిలియనీర్ల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుండడంతో విలాసవంతమైన రంగాల్లో డిమాండ్ పెరుగుతోంది. ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగం పట్ల వారు మొగ్గు చూపుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలాసవంతమైన భవంతులు కొనుగోలు చేస్తున్నారు. న్యూయార్క్, మియామీ, పామ్ బీచ్, లాస్ ఏంజిలిస్, యాస్పెన్ వంటి నగరాలు లగ్జరీ రియల్ ఎస్టేట్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఈ నగరాల్లో వీరి కోసమే ప్రత్యేకంగా విలాసానికి మారుపేరైన ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నారని ఆ నివేదిక వెల్లడించింది. అంతేకాదు ఈ భూమండలంపై అమిత ధనవంతులుగా పేరొందిన 15 మందిలో 10 మంది టెక్నాలజీ రంగానికి చెందిన వారని బ్లూమ్‌బర్గ్ గణాంకాలు తెలుపుతున్నాయి. అంతేకాదు సంపద సృష్టిలో టెక్నాలజీ తర్వాత రిటైల్, ఎనర్జీ, పారిశ్రామిక, ఫైనాన్స్, వినియోగ రంగాలు కుబేరులను సృష్టిస్తున్నాయి.

మ్యూచువల్ ఫండ్స్ మిస్ సెల్లింగ్‌కు చెక్

నెలలోపే ఎన్ఎఫ్ఓల పెట్టుబడులు: సెబీ

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలు కొత్త పథకాల (ఎన్ఎఫ్ఓ) ద్వారా సమీకరించే నిధుల పెట్టుబడుల ప్రక్రియను సెబీ మరింత పటిష్ఠం చేసింది. అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలు (ఏఎంసీ) ఇక ఈ పెట్టుబడులను యూనిట్ల కేటాయింపు పూర్తయిన నెల రోజుల్లోగా పూర్తి చేయాలి. ఒకవేళ ఏ కారణం చేతనైనా పూర్తి చేయలేకపోతే, అందుకు కారణాలను ఏఎంసీలకు చెందిన పెట్టుబడుల కమిటీకి తెలియజేయాలి. ఆ కారణాలు సహేతుకంగా ఉంటే పెట్టుబడుల పూర్తికి మరో నెల రోజుల గడువు ఇస్తారు. అప్పటికీ పూర్తి చేయలేకపోతే మదుపరులు ఎలాంటి ఎగ్జిట్ లోడ్ లేకుండా తమ పెట్టుబడులను ఆ పథకాల నుంచి వెనక్కి తీసుకోవచ్చు. ఈ కొత్త నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి వస్తాయని సెబీ తెలిపింది. ఎంఎఫ్ పరిశ్రమలో మిస్ సెల్లింగ్‌ను అరికట్టేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

సెబీ చీఫ్‌గా తుహిన్ కాంత పాండే



న్యూఢిల్లీ: మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తదుపరి చీఫ్‌గా 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. పదవీ బాధ్యతలు స్వీకరించాక మూడేళ్ల లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు ఆయన ఈ పదవిలో ఉంటారు. మాధవి పురి బుచ్ స్థానంలో ఆయన ఈ బాధ్యతలు స్వీకరిస్తారు. మాధవి పదవీ కాలం ఫిబ్రవరి 28తో ముగియనుంది. పాండే ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, రెవెన్యూ శాఖ కార్యదర్శిగా ఉన్నారు.

కార్లు, రసాయనాలపై తగ్గనున్న దిగుమతి సుంకాలు!

వెంటాడుతున్న ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. కసరత్తు చేస్తున్న మోదీ సర్కారు



న్యూఢిల్లీ: మన దేశానికీ ట్రంప్ 'పరస్పర సుంకాల' భయం పట్టుకుంది. ఈ హెచ్చరికల నుంచి తప్పించుకునేందుకు కార్లు, రసాయనాలు, కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు, కీలక ఔషధాలు, వ్యాధి నిర్ధారణ పరికరాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలపై దిగుమతి సుంకాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. అమెరికా నుంచి దిగుమతయ్యే హై ఎండ్ బైక్స్, బోర్బన్ విస్కీ వంటి వాటిపై మన దేశం ఇప్పటికే దిగుమతి సుంకాలు తగ్గించింది. అయినా ఈ తగ్గింపు చాలదని, ఇంకా తగ్గించాల్సిందేనని ట్రంప్ సర్కారు కోరుతోంది. లేకపోతే ఏప్రిల్ నుంచి భారత ఎగుమతులపైనా పరస్పర సుంకాలు తప్పవని హెచ్చరించింది.

ప్రత్యేక బృందం ఏర్పాటు

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో భారత్‌పై పరస్పర సుంకాల ప్రభావం ఎలా ఉంటుందో అంచనా వేసేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇప్పటికే వివిధ మంత్రిత్వ శాఖలు, వివిధ పారిశ్రామిక రంగాల ప్రతినిధులతో చర్చలు జరిపింది. మత్స్య పరిశ్రమ వర్గాలు ఇప్పటికే ఈ బృందాన్ని కలిసి అమెరికా నుంచి దిగుమతయ్యే రొయ్యలపై ఉన్న 30 శాతం దిగుమతి సుంకాన్ని జీరోకి తగ్గించాలని కోరింది. లేకపోతే ఏప్రిల్ నుంచి మన రొయ్యల ఎగుమతులపైనా అమెరికా 30 శాతం దిగుమతి సుంకం విధించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా మత్స్య దిగుమతులపై సుంకాన్ని జీరోకు తగ్గించినా మన పరిశ్రమకు వచ్చే నష్టం పెద్దగా ఉండదని కూడా స్పష్టం చేసింది. పౌల్ట్రీ పరిశ్రమ కూడా అమెరికా చికెన్, గుడ్లపై దిగుమతి సుంకం తగ్గించినా, దేశీయ పరిశ్రమకు పెద్దగా నష్టం లేదని ఇప్పటికే స్పష్టం చేసినట్టు సమాచారం. అయితే పాడి పరిశ్రమ మాత్రం సుంకాల తగ్గింపును వ్యతిరేకిస్తోంది.

న్యూమరస్ మోటార్స్ డిప్లాస్ మ్యాక్స్ ఈవీ



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బెంగళూరు కేంద్రంగా ఉన్న న్యూమరస్ మోటార్స్.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మార్కెట్లోకి మల్టీయుటిలిటీ ఎలక్ట్రిక్ స్కూటర్ డిప్లాస్ మ్యాక్స్ విడుదల చేసింది. ఈ స్కూటర్ ధర రూ.1,12,199. అన్ని రకాలైన వాతావరణ పరిస్థితులను తట్టుకునే విధంగా ఈ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను రూపొందించినట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ (ఇంజనీరింగ్) సుందరరాజన్ ఎస్ వెల్లడించారు. రెండు బ్యాటరీలు, డ్యూయల్ డిస్క్ బ్రేక్స్, థెఫ్ట్ అలర్ట్స్, జియోఫెన్సింగ్, వెహికల్ ట్రాకింగ్ వంటి అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో డిప్లాస్ మ్యాక్స్‌ను తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. న్యూమరస్ మోటార్స్ ప్రస్తుతం 30 ఔట్‌లెట్స్‌ను నిర్వహిస్తోందని, త్వరలో ఈ సంఖ్యను 45కు చేర్చనున్నట్లు చెప్పారు.

హైదరాబాద్‌లో ఫనాటిక్స్ డిజిటల్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ సెంటర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ డిజిటల్ స్పోర్ట్స్ ప్లాట్‌ఫామ్ ఫనాటిక్స్.. హైదరాబాద్‌లో కొత్త డిజిటల్ స్పోర్ట్స్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 2018లోనే సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించిందని, అయితే కార్యకలాపాల విస్తరణలో భాగంగా కొత్త కార్యాలయ స్థలంలోకి మారటంతో పాటు సేవలను మరింతగా విస్తరించనున్నట్లు సంస్థ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మథియస్ స్పైచర్ తెలిపారు. ఈ కొత్త కార్యాలయం వచ్చే ఏడాది నాటికి అందుబాటులోకి రానుందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, డేటా అనలిటిక్స్ ఫనాటిక్స్ అంతర్జాతీయ కార్యకలాపాలకు హైదరాబాద్ కేంద్రం కీలకంగా ఉండనుందని స్పైచర్ వెల్లడించారు. అంతేకాకుండా వచ్చే రెండేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 250 నుంచి 500కు పెంచనున్నట్లు చెప్పారు.

ఇన్వెస్టర్లు అప్రమత్తం

ఏడో రోజూ దిగజారిన నిఫ్టీ

ముంబై: నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టుల ముగింపు రోజు కావడంతో ఇన్వెస్టర్లు అప్రమత్తం అయిన కారణంగా గురువారం ఈక్విటీ మార్కెట్ సూచీలు భారీ ఆటుపోట్లకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 313 పాయింట్ల మేరకు లాభపడినప్పటికీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి కేవలం 10.31 పాయింట్ల లాభంతో 74,612.43 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం వరుసగా ఏడో రోజు కూడా నష్టాల్లోనే క్లోజయింది. 2.50 పాయింట్లు నష్టపోయి 22,545.05 వద్ద ముగిసింది. కేబుల్, వైర్ల వ్యాపారంలో ప్రవేశించనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో అల్ట్రాటెక్ సిమెంట్ గరిష్ఠంగా 4.99% నష్టపోగా టాటా మోటార్స్, మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, టెక్ మహీంద్రా, ఎస్‌బీఐ కూడా నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.97%, స్మాల్‌క్యాప్ సూచీ 2.09% నష్టంతో ముగిశాయి. మరోవైపు మార్కెట్ నుంచి విదేశీ నిధుల తరలింపు యధేచ్ఛగా కొనసాగుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	445	విజయవాడ	485
వరంగల్	447	గోదావరి	480
చిత్తూరు	493	విశాఖపట్నం	482
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	81
వరంగల్	80	గుంటూరు	81
కరీంనగర్	80	ఒంగోలు	81
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	72
కర్నూలు	80	నెల్లూరు	77
విశాఖపట్నం	80	అనంతపురం	77
గోదావరి	81		

భవిష్యత్ తరాలపై రుణ భారం అన్యాయం

ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): అప్పుల గురించి ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తే అది దేశానికి అన్యాయం చేసినట్లేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రుణ భారం భవిష్యత్ తరాలపై భారం వేస్తుందని, దానిపై తప్పుడు సమాచారం ఇవ్వడం దేశానికి మేలు చేయదన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ఠం చేసేందుకు రాష్ట్రాలతో పారదర్శకమైన, పరస్పర సహకారంతో కూడిన చర్చలు జరపాలని ఆమె అభిప్రాయపడ్డారు. గురువారం నాడిక్కడ బిజినెస్ స్టాండర్డ్ మంథన్ సమ్మిట్‌లో సీతారామన్ మాట్లాడుతూ.. ఆర్థిక అంశాలపై రాజకీయ విభేదాలు అడ్డు రాకూడదని చెప్పారు. రాష్ట్రాలతో నిజాయితీగా చర్చలు జరిపినప్పుడే మార్పులు సాధ్యమవుతాయన్నారు. పన్నుల పంపిణీ ఎలా జరుగుతుంది, నిధుల పరిస్థితి ఎలా ఉన్నది చెప్పే విషయంలో ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తే అది దేశానికి అన్యాయం చేసినట్లు అవుతుందని చెప్పారు. రాష్ట్రాల మధ్య ఆర్థిక వ్యత్యాసాలను పరిష్కరించేందుకు ఒక సంస్థాగత నిర్మాణం అవసరమా అన్న ప్రశ్నకు ఆమె సమాధానమిస్తూ.. నిజాయితీతో రాష్ట్రాలతో చర్చించడంపై ఈ నిర్మాణం ఆధారపడి ఉండాలని, జీఎస్‌టీ కౌన్సిల్ వంటి సంస్థల్లో ఇలాంటి చర్చలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఐక్యరాజ్యసమితి, డబ్ల్యూటీవో వంటి సంస్థలు బలహీనమైనందు వల్ల వాణిజ్యం, పెట్టుబడులు, వ్యూహాత్మక సంబంధాల విషయంలో రకరకాల దేశాలతో చర్చించాల్సి వస్తోందని అన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,380 ▼	80,100 ▼	1,06,000 ▼
విజయవాడ	88,700 ▼	83,500 ▼	97,500 ▼
విశాఖపట్నం	85,400 ▼	78,280 ▼	94,970 ▲
రాజమండ్రి	87,380 ▼	80,100 ▼	98,000 ▼
ప్రొద్దుటూరు	88,300 ▼	81,770 ▼	97,500 ▲
ముంబై	85,593	78,403	95,048

స్పోర్ట్స్

కట్నం కోసం వేధిస్తున్నారు

బాక్సర్ స్వీటీ బూరా ఫిర్యాదు

భర్త దీపక్ హుడాపై ఎఫ్ఐఆర్



హిసార్ (హరియాణా): అర్జున అవార్డు గ్రహీత, ప్రపంచ మాజీ బాక్సింగ్ చాంపియన్ స్వీటీ బూరా వరకట్న వేధింపులు ఎదుర్కొంటోంది. తన భర్త, భారత కబడ్డీ జట్టు మాజీ కెప్టెన్ అయిన దీపక్ హుడా, అతని కుటుంబం అదనపు కట్నం కోసం తనపై దాడిచేసిందని స్వీటీ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దాంతో దీపక్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. అర్జున అవార్డు గ్రహీత, ప్రొ.కబడ్డీ లీగ్‌లో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించిన దీపక్ హుడా-స్వీటీల వివాహం 2022లో జరిగింది. వీరిద్దరూ హరియాణాకు చెందినవారే. 'భర్త దీపక్ హుడా కట్నంకోసం వేధింపులకు గురి చేస్తున్నాడంటూ స్వీటీ ఈనెల 25న చేసిన ఫిర్యాదు మేరకు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. రెండు మూడుసార్లు అతడికి నోటీసు ఇచ్చాం. కానీ అనారోగ్య కారణాలు చూపుతూ దీపక్ హాజరుకాలేదు' అని హిసార్ మహిళా పోలీస్ స్టేషన్ అధికారిణి సీమా గురువారం వెల్లడించారు. మరోవైపు భర్త దీపక్‌నుంచి విడాకులు కోరుతూ స్వీటీ ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాగా వివాహ సమయంలో కోటి రూపాయల నగదు, ఖరీదైన పార్చ్యూనర్ కారు ఇచ్చామని, అయినా ఇంకా డబ్బు కోసం హింసిస్తున్నారంటూ స్వీటీ తన భర్త దీపక్, ఆడపడుచు పూనమ్‌లపై చేసిన ఫిర్యాదులో పేర్కొంది. గతేడాది ఫిబ్రవరిలో భర్తతో కలిసి స్వీటీ బీజేపీలో చేరింది. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో రోహతక్ జిల్లాలోని మేహమ్ నియోజకవర్గం నుంచి దీపక్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యాడు. స్వీటీ 2023 వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. ఇక దీపక్ 2016 దక్షిణాసియా క్రీడల్లో స్వర్ణం, 2014 ఆసియాడ్‌లో కాంస్యం సాధించిన భారత జట్టులో సభ్యుడు.

పాక్.. విజయం లేకుండానే

బంగ్లాతో మ్యాచ్ రద్దు



రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో మరో మ్యాచ్ వర్షార్పణమైంది. గురువారం ఆతిథ్య పాకిస్థాన్-బంగ్లాదేశ్ జట్ల మధ్య నామమాత్రపు మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ వర్షంతో టాస్ కూడా వీలు కాకుండానే రద్దయ్యింది. దీంతో 29 ఏళ్ల తర్వాత ఆతిథ్యమిస్తున్న ఐసీసీ టోర్నీని పాక్ విజయం లేకుండానే ముగించింది. గ్రూప్ 'ఎ' నుంచి భారత్-న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్ చేరిన విషయం తెలిసిందే. రెండు ఓటములతో ఉన్న రిజ్వాన్ సేన కనీసం ఆఖరి మ్యాచ్‌లోనైనా ఓదార్పు విజయం దక్కించుకోవాలని భావించింది. కానీ వీరి ఆశలపై వరుణుడు నీళ్లు జల్లాడు. గురువారం ఉదయం నుంచే ఇక్కడ వర్షం కురుస్తుండడంతో మైదానం పూర్తిగా చిత్తడిగా మారింది. అవుట్‌ఫీల్డ్ అంతా జలమయం కావడంతో మ్యాచ్ నిర్వహణ అసాధ్యమైంది. చివరకు భారత కాలమాన ప్రకారం సాయంత్రం నాలుగు గంటలకు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు. ఫలితంగా గ్రూప్ 'ఎ'లో పాక్-బంగ్లా జట్లకు ఒక్క విజయమూ దక్కకుండా పోయింది. మరోవైపు మంగళవారం ఇదే మైదానంలో జరగాల్సిన ఆస్ట్రేలియా-దక్షిణాఫ్రికా మ్యాచ్ కూడా వర్షంతో రద్దయిన విషయం తెలిసిందే.

పాకిస్థాన్‌కు రూ.2.3 కోట్ల ప్రైజ్‌మనీ


చాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ దశ నుంచే నిష్క్రమించిన ఆతిథ్య పాకిస్థాన్‌కు ప్రైజ్‌మనీ రూపంలో రూ.2 కోట్ల 31 లక్షలు దక్కాయి. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న ఈ సీటీ కోసం ఐసీసీ 53 శాతం ప్రైజ్‌మనీని పెంచింది. దీంట్లో భాగంగా సెమీస్‌కు అర్హత సాధించలేకపోయిన జట్లకు రూ.కోటీ 22 లక్షలు ఇవ్వనుండగా, పార్టిసిపేషన్ ఫీజు కింద మొత్తం 8 జట్లకూ తలో రూ. కోటీ 9 లక్షలు ఇస్తారు. దీంతో పాక్‌కు మొత్తంగా రూ.2 కోట్ల 31 లక్షలు అందనుంది. చాంపియన్స్ ట్రోఫీ మొదలైన తర్వాత ఓ ఆతిథ్య జట్టు ఒక్క విజయమూ లేకుండా నిష్క్రమించడం ఇదే తొలిసారి.

ఎవరిదో సెమీస్ బెర్త్?

నేడు ఆసీస్ X అఫ్ఘాన్ పోరు

- మ్యాచ్ రద్దయితే కంగారూలకే చాన్స్
- మ. 2.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

చాంపియన్స్ ట్రోఫీ


స్మిత్


షాహిదీ

లాహోర్: చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ 'బి'లో తొలి సెమీస్ బెర్త్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం ఆస్ట్రేలియా-అఫ్ఘానిస్థాన్ మధ్య జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు నాకౌట్‌కు వెళ్తుంది. ఆసీస్ ఖాతాలో మూడు పాయింట్లు ఉండగా.. ఇంగ్లండ్‌పై సంచలన విజయంతో అఫ్ఘాన్ రెండు పాయింట్లతో ఈ రేసులో నిలిచింది. అయితే వర్షం కారణంగా మ్యాచ్ రద్దయితే ఆసీస్ నాలుగు పాయింట్లతో ముందుకెళ్లే అవకాశముంటుంది. కానీ మూడు పాయింట్లతో నిలిచే అఫ్ఘాన్ దాదాపు నిష్క్రమించినట్టే. ఒకవేళ ఇంగ్లండ్ జట్టు దక్షిణాఫ్రికా (3 పాయింట్లు)పై అతి భారీ విజయం సాధిస్తే.. రన్‌రేట్ ప్రకారం అఫ్ఘాన్‌కు చాన్స్ ఉంటుంది. ప్రస్తుతానికైతే షాహిదీ సేన ఎనలేని ఆత్మవిశ్వాసంతో ఉంది. బుధవారం అసాధారణ ఆటతీరుతో పటిష్ఠ ఇంగ్లండ్‌కు ఓటమి రుచి చూపించింది. 200 పరుగులు కూడా కష్టమే అనుకున్న చోట జద్రాన్ వీరోచిత శతకంతో ఏకంగా 300 స్కోరు దాటగలిగింది. అదే ఊపులో ఆసీస్‌ను కూడా మట్టికరిపించాలన్న ఆశయంతో ఉన్నారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో మ్యాక్స్‌వెల్ డబుల్ సెంచరీతో ఆసీస్ టీమ్ అఫ్ఘాన్‌ను చిత్తుగా ఓడించింది. నేటి మ్యాచ్‌లో ప్రతీకారం తీర్చుకుని ఈ ఫార్మాట్‌లో కంగారూలపై తొలి విజయం అందుకోవాలనుకుంటోంది. అటు ఆసీస్ జట్టు టోర్నీలో ఒక్క మ్యాచే పూర్తిగా ఆడగా, వర్షంతో సౌతాఫ్రికా మ్యాచ్ రద్దయ్యింది. కమిన్స్, స్టార్క్, హాజెల్‌వుడ్, మార్ష్ లేకపోయినా బలంగానే కనిపిస్తోంది. ఇంగ్లండ్‌పై 352 పరుగుల ఛేదనను సునాయాసంగా పూర్తి చేయగలిగింది. పైగా వారం రోజులపాటు విశ్రాంతి లభించడంతో ఆసీస్ ప్లేయర్లు తాజాగా బరిలోకి దిగబోతున్నారు. హెడ్, స్మిత్ బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. లబుషేన్, ఇన్‌గ్లిస్, క్యారీ, మ్యాక్స్‌వెల్‌లతో మిడిలార్డర్ అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది.

'వన్ లాస్ట్ టైమ్' !

ధోనీ టీ షర్ట్‌పై సంకేత భాష

మహీకిదే చివరి ఐపీఎల్ అంటూ వార్తలు



చెన్నై: మరో మూడు వారాల్లో వేసవి ధమాకా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఐదుసార్లు చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ 10 రోజుల ప్రీ టోర్నీ క్యాంప్‌ను గురువారం ఇక్కడ ప్రారంభించింది. శిబిరంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎస్‌కే సూపర్ స్టార్ ధోనీకి ఫ్రాంచైజీ ఘనంగా స్వాగతం పలికింది. అయితే ఈ సందర్భంగా..ఐపీఎల్ నుంచి ధోనీ రిటైర్మెంట్‌పై ఒక్కసారిగా ఊహాగానాలు హల్‌చల్ చేశాయి. అందుకు కారణంగా ధోనీ ధరించిన నల్ల టీ షర్ట్‌పై ఉన్న సంకేత భాషే. టెలి కమ్యూనికేషన్ వ్యవస్థలో ఉపయోగించే 'మోర్స్ కోడ్' ధోనీ టీషర్ట్‌పై ఉంది. మోర్స్ కోడ్ అంటే డాట్‌లు, డాష్‌లతో కూడిన సంకేత భాష. మహీ టీ షర్ట్‌పై ఉన్న ఆ కోడ్‌ను డీ కోడ్ చేస్తే 'వన్ లాస్ట్ టైమ్' అని వచ్చింది. అంతే..మహీ ఆడే చివరి ఐపీఎల్ ఇదేనంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వార్త వ్యాపించింది. అయితే ఏదో టీ షర్ట్ ధరించినంత మాత్రాన అదే ఆఖరని భావించరాదని, వచ్చే ఏడాది ధోనీ 'ఇంకొద్ది కాలం' అని అర్థం వచ్చేలా మరో టీ షర్ట్ ధరించి ఐపీఎల్ ఆడేస్తాడంటూ ఓ అభిమాని ట్వీట్ చేశాడు.

గార్డ్‌నర్ ధనాధన్

- గుజరాత్ గెలుపు
- బెంగళూరుకు వరుసగా మూడో ఓటమి

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ x ముంబై
రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో


ఆష్లే గార్డ్‌నర్ (58)

బెంగళూరు: ఆష్లే గార్డ్‌నర్ (31 బంతుల్లో 58) ధనాధన్ అర్ధ శతకంతో.. గుజరాత్ జెయింట్స్ మళ్లీ గెలుపు బాటపట్టింది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో గురువారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ 6 వికెట్ల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై గెలిచింది. కాగా, మంధాన సేనకు ఇది వరుసగా మూడో ఓటమి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 125/7 స్కోరు చేసింది. డోటిన్, తనూజ చెరో రెండు వికెట్లతో విజృంభించడంతో.. పవర్‌ప్లేలోపే వ్యాట్ (4), పెర్రీ (0), మంధాన (10) వికెట్లను చేజార్చుకొన్న చాలెంజర్స్ 25/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. అయితే, రాఘ్వి బిస్త్ (22), కనిక (33), వేర్హమ్ (20 నాటౌట్), గార్త్ (14) తలో చేయి వేయడంతో.. టీమ్ స్కోరు కష్టంగా 120 మార్క్ దాటింది. ఛేదనలో గుజరాత్ 16.3 ఓవర్లలో 4 వికెట్లకు 126 పరుగులు చేసి గెలిచింది. గార్డ్‌నర్, లిచ్‌ఫీల్డ్ (30 నాటౌట్) నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో జెయింట్స్ సులువుగా నెగ్గింది.

హంపికి రెండో స్థానం



మాంటే కార్లో (మొనాకో): ఫిడే మహిళల గ్రాండ్‌ప్రీ చెస్ టోర్నీ మూడో అంచెలో తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి రెండో స్థానంలో నిలిచింది. గురువారం జరిగిన తొమ్మిదో, ఆఖరి రౌండ్‌లో బిబిసారా అసౌబయేవా (కజకిస్థాన్)పై హంపి విజయం సాధించింది. తెల్లపావులతో ఆడిన హంపి 55 ఎత్తుల్లో ప్రత్యర్థి ఆటకట్టించింది. కాగా, ఆడిన 9 రౌండ్ల నుంచి హంపి మొత్తం 5.5 పాయింట్లతో రెండో స్థానం సొంతం చేసుకొంది. అలెగ్జాండ్రా గోర్యాంచ్‌కినా (రష్యా) కూడా 5.5 పాయింట్లతో సమంగా నిలిచినా.. సూపర్ టైబ్రేక్ ఆధారంగా విజేతగా నిలిచింది. 4 పాయింట్లు సాధించిన హారిక 8వ స్థానం దక్కించుకొంది.

కేరళ 131/3

- సర్వాటే అర్ధ శతకం
- విదర్భ 379 ఆలౌట్
- రంజీ ఫైనల్


సర్వాటే

నాగ్‌పూర్: ఆదిత్య సర్వాటే (66 బ్యాటింగ్) అర్ధ శతకంతో రాణించడంతో.. విదర్భతో రంజీ ఫైనల్లో కేరళ నిలకడగా ఆడుతోంది. ఆటకు రెండో రోజు తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన కేరళ 131/3 స్కోరు చేసింది. గురువారం ఆటముగిసే సమయానికి సర్వాటేతోపాటు కెప్టెన్ సచిన్ బేబి (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఓపెనర్లు రోహన్ కున్నుమ్మల్(0), అక్షయ్ చంద్రన్ (14)ను నల్కండే పెవిలియన్ చేర్చాడు. సర్వాటే.. ఇమ్రాన్ (37)తో కలసి మూడో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నాడు. అయితే, ఇమ్రాన్‌ను యశ్ ఠాకూర్ వెనక్కిపంపాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 254/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ 379 పరుగులకు ఆలౌటైంది. నిధీష్, ఈడెన్ యాపిల్ టామ్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు కేరళ ఇంకా 248 పరుగుల దూరంలో ఉంది.

'ఢిల్లీ' మెంటార్‌గా కేపీ



న్యూఢిల్లీ: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ మెంటార్‌గా నియమితుడయ్యాడు. 44 ఏళ్ల కెవిన్‌కు ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించడం ఇదే తొలిసారి. 2014 సీజన్‌లో ఢిల్లీ డేర్ డెవిల్స్‌కు పీటర్సన్ సారథిగా వ్యవహరించాడు.

మ్యాచ్ రెఫరీగా వైదొలగనున్న బూన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా మాజీ బ్యాటర్ డేవిడ్ బూన్ ప్రస్తుతం నిర్వర్తిస్తున్న ఐసీసీ మ్యాచ్ రెఫరీ బాధ్యతలనుంచి చాంపియన్స్ ట్రోఫీ అనంతరం వైదొలగనున్నాడు. ఆపై క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) బోర్డు డైరెక్టర్‌గా అతడు చేరనున్నాడు.

ప్రజ్ఞానందకు రెండో డ్రా

ప్రేగ్: ప్రేగ్ మాస్టర్స్‌లో భారత గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద మరోగేమ్‌ను డ్రా చేసుకొన్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో ఎడిజ్ గురెల్ (టర్కీ)తో ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నాడు. నల్లపావులతో ఆడిన ప్రజ్ఞానంద 52 ఎత్తుల అనంతరం ప్రత్యర్థితో డ్రాకు అంగీకరించాడు. తొలి రౌండ్‌లో డేవిడ్ నవారా (చెక్)తో గేమ్‌ను కూడా భారత జీఎం డ్రా చేసుకొన్నాడు.

ఏపీలో 3 ఎమ్మెల్సీ స్థానాలకు ముగిసిన పోలింగ్

అమరావతి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలతోపాటు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఓటేసేందుకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. రాత్రి కడపటి వార్తలు అందే సమయానికి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ 65.59 శాతం, ఉభయగోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 69.50 శాతం, శ్రీకాకుళం-విజయనగరం, విశాఖపట్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి 92.4 శాతం నమోదైనట్లు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. ఫైనల్ పోలింగ్ శాతం వివరాలు వస్తే పోలింగ్ శాతం ఒకింత పెరిగే అవకాశం ఉందని సమాచారం.

రేవంత్..కేంద్రం నిధులపై చర్చకు సిద్ధమా?:ఈటల

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమా..? అని ఎంపీ ఈటల రాజేందర్.. సీఎం రేవంత్‌కు సవాల్ చేశారు. కేంద్రం నిధులతోనే పంచాయతీలు, మునిసిపాలిటీల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని.. చివరకు పంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి కూడా ఆర్థిక సంఘం నిధుల నుంచే జీతాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. అమృత్ స్కీం, ప్రజలు కడుతున్న పన్నులతోనే మునిసిపాలిటీల పాలన సాగుతోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గడచిన పదేళ్లలో జరిగిన కుంభకోణాలు బయటకు రాకుండా ఉండేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం జరిగిందని బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే పదేళ్లలో జరిగిన కుంభకోణాలను సీబీఐకి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవు: లక్ష్మణ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ నియోజవర్గాల పునర్విభజన ప్రక్రియలో దక్షిణాదిలో పార్లమెంట్ స్థానాలు తగ్గవని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. ఎంపీ సీట్ల విషయంలో దక్షిణాదికి చెందిన బీఆర్ఎస్, డీఎంకే తదితర పార్టీలు అసత్య ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

నేడు టీపీసీసీ విస్తృత సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ విస్తృత సమావేశాన్ని శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించనున్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీపీసీసీ కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు తదితరులు పాల్గొంటారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ హోదాలో.. మీనాక్షి నటరాజన్ తొలిసారిగా ఇందులో పాల్గొంటున్నారు. రాష్ట్ర, దేశ రాజకీయ పరిస్థితులు, ఇతర అంశాలపైనా చర్చించనున్నారు. అయితే మీనాక్షి సూచనతో ఈ కార్యక్రమాన్ని నిరాడంబరంగా నిర్వహిస్తున్నారు. ఆమె రాక సందర్భంగా ఫ్లెక్సీల ఏర్పాటు, ఆర్భాటపు కార్యక్రమాలు చేపట్టొద్దంటూ మహేశ్ గౌడ్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

వర్గీకరణ చట్టబద్ధతలో లోపాలు సవరించాలి

» వచ్చే 3 నుంచి 10 వరకు డప్పులతో ప్రదర్శన: మంద కృష్ణ

పంజాగుట్ట, బర్కత్‌పుర, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో లోపాలు సవరించి అందరికీ న్యాయం జరిగేలా చూడాలని, వర్గీకరణను ఏ, బీ, సీ, డీ రూపంలోనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర మంత్రివర్గంలో ఇద్దరు మాదిగలకు అవకాశం కల్పించాలన్నారు. బషీరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ డిమాండ్లను నెరవేర్చాలని మార్చి 3 నుంచి 10 వరకు మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాలలో డప్పులతో నిరసన ప్రదర్శన చేపట్టనున్నట్టు ఆయన ప్రకటించారు. అన్ని కులాల వారితో కలిసి నిర్వహించే ఈ ప్రదర్శనలకు డప్పు కళాబృందాలు సారథ్యం వహిస్తాయన్నారు. మార్చి 10 లోపు లోపాలను సవరించకుండా, ఎస్సీలను గ్రూపులుగా విభజించకుండా రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తే 11వ తేదీ నుంచి తమ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని అన్నారు. హైదరాబాద్ సమీపంలో 5 ఎకరాల్లో మాదిగ అమరవీరుల గుర్తుగా మ్యూజియం, స్థూపం నిర్మించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలు సహా ఎమ్మార్పీఎస్ ఉన్న రాష్ట్రాల్లో మార్చి 1న మాదిగ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన భారతీయ మైనార్టీస్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఆవిర్భావ సభకు మంద కృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి సహకరించిన ముస్లింలకు మంత్రివర్గంలో స్థానం కల్పించలేదన్నారు. అలాగే ముస్లింలలో పేదరికం నిర్మూలించడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. ఇక తాను ఏ పార్టీలోనూ చేరే ప్రసక్తే లేదని, మాదిగ కండువా మార్చబోనని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ నేతల వల్ల నా కుటుంబానికి ప్రాణహాని

» నా భర్త హత్య కేసును సీబీసీఐడీకి అప్పగించాలి

» సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి భార్య సరళ

భూపాలపల్లి, ఫిబ్రవరి 27(ఆంధ్ర జ్యోతి): బీఆర్ఎస్ నేతల వల్ల తన కుటుంబానికి ప్రాణహాని ఉందని సామాజిక కార్యకర్త నాగవెల్లి రాజలింగమూర్తి భార్య సరళ ఆరోపించారు. తన భర్త హత్య కేసును సీబీసీఐడీకి అప్పగించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె గురువారం మీడియాకు ఓ వీడియోను విడుదల చేశారు. తన భర్త ఇంటికి వచ్చేదారిలో కరెంట్ లేకుండా చేసి నడిరోడ్డుపై ఆయనను అత్యంత కిరాతకంగా చంపారని అందులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని, కానీ ఫిర్యాదును మార్చి కేసును తప్పుదోవ పట్టించేలా వారు వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. భూవివాదం వల్లే ఈ హత్య జరిగిందనడం పూర్తి అవాస్తవమన్నారు. మేడిగడ్డ నిర్మాణంలో అవినీతిపై తన భర్త కేసు వేయడం వల్లే తనను చంపేశారని, ఇందులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ సహా స్థానిక మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు హస్తముందని ఆరోపించారు తన భర్త హత్య జరిగినప్పటి నుంచి తాము భయపడుతున్నామని, బయటకు వెళ్తే ఎవరైనా చంపేస్తారేమోనని తాను, తన పిల్లలు ఆందోళనలో బతుకుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి తమకు రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని కన్నీటి పర్యంతమయ్యారు.

రేవంత్‌రెడ్డివి చిల్లర వ్యాఖ్యలు

» పాలన చేతగాకనే కొన్ని మరణాలపై రాజకీయం: కేటీఆర్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పాలనా వైఫల్యం, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఎస్ఎల్‌బీసీ విషయంలో గత ప్రభుత్వంపై నెపంపెడుతున్నారని, చిట్‌చాట్ పేరుతో ఆయన చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం ఆయన ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ నిపుణులు, జీఎస్ఐ వంటి సంస్థలతో సంప్రదించకుండా, ముందు జాగ్రత్తలు తీసుకోకుండానే ఆగిపోయిన ప్రాజెక్టును అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాతయంత్రాలతో ప్రారంభించారని విమర్శించారు. కేవలం రేవంత్‌రెడ్డి ధనదాహం వల్లనే 8 మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని ఆరోపించారు. కార్మికులను రక్షించాల్సిందిపోయి బ్లేమ్ గేమ్ ప్రారంభించాని, దేవుడిచ్చిన ముఖ్యమంత్రి అవకాశాన్ని వాడుకొని ప్రజలకు మంచి చేయాల్సిందిపోయి రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆయనకు పరిపాలన చేతకాకనే రాష్ట్రంలో జరుగుతున్న మరణాలపై ఇతరుల పేరు ప్రస్తావిస్తున్నారని, చీఫ్ మినిస్టర్‌గా మాట్లాడాలని, ఒక ఛీప్ మినిస్టర్‌గా మాట్లాడొద్దన్నారు. కాలయాపన కోసం పరిపాలనను పక్కన పెట్టారని, అధికారంలో ఉన్నది తామేనని మరిచిపోయి మాట్లాడుతున్నారని, సీఎంకు చిత్తశుద్ధి ఉంటే కావాల్సిన విచారణలు, దర్యాప్తులు చేసుకోవచ్చన్నారు. రేవంత్‌రెడ్డికి ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన లేదని, రూ.6500 కోట్లు కేవలం వడ్డీ లెక్క అయిపోతుందంటూ రాష్ట్ర ప్రజలను, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన అన్నారు.

ఒకటి పక్కా.. రెండింట్లో గట్టి పోటీ

» ఎమ్మెల్సీ ఎన్నికలపై కమల నాథుల్లో చర్చ

» పట్టభద్రుల స్థానంలో క్యాడర్, అభ్యర్థికి గ్యాప్

» పార్టీ సానుభూతిపరుల రెండో ఓటు బీఎస్పీకి

» జాతీయ నాయకత్వానికి రాష్ట్ర పార్టీ నివేదిక

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ వర్గాలు కమలం పార్టీ పట్ల కొంత సానుకూల వైఖరి ప్రదర్శించినా, పట్టభద్రులు మాత్రం మరోవిధంగా స్పందించారా..? పార్టీ ముఖ్య నేతలు శ్రమించినా అభ్యర్థికి, క్యాడర్‌కు మధ్య సమన్వయం లోపించిందా..? అంటే అవుననే అంటున్నాయి బీజేపీ వర్గాలు. గురువారం మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన పోలింగ్‌పై పార్టీలో అంతర్గత విశ్లేషణలు జరిగాయి. మూడింటినీ గెలుచుకుంటామని కమలనాథులు పైకి ధీమా వ్యక్తం చేస్తున్నా.. రెండు స్థానాల్లో గట్టి పోటీ ఎదుర్కొంటున్నామని అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్- కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థిగా అంజిరెడ్డి.. ఉపాధ్యాయ నియోజకవర్గం అభ్యర్థిగా మల్క కొమరయ్య.. ఖమ్మం- వరంగల్- నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరోత్తమ్ రెడ్డి బరిలోకి దిగారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం చేశారు. మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో పార్టీకి నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు స్థానాలను పార్టీ సునాయసంగా గెలుచుకుంటుందని తొలుత భావించారు. అయితే, పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి ప్రచార క్రమంలో క్యాడర్‌తో కొంత సమన్వయలోపం ఏర్పడిందని పార్టీ రాష్ట్ర నాయకత్వం.. జాతీయ పార్టీకి నివేదించింది." సంజయ్‌తో పాటు పార్టీ స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు శ్రమించినా, పలు పోలింగ్ బూత్‌ల పరిధిలో క్యాడర్‌కు అభ్యర్థి అనుచరులకు మధ్య గ్యాప్ వచ్చింది. దీంతో ఆయా ప్రాంతాల్లో స్థానిక కార్యకర్తలు సైతం ప్రత్యర్థులవైపు మొగ్గు చూపారు. మరికొన్ని చోట్ల రెండో ప్రాధాన్య ఓటును బీఎస్పీకి వేశారు. దీంతో కచ్చితంగా గెలుస్తామని అనుకున్న ఈ స్థానంలో గట్టి పోటీ ఎదుర్కోవాల్సి వస్తోంది." అని రాష్ట్ర పార్టీ.. జాతీయ నాయకత్వానికి నివేదించింది. మరోవైపు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలోకి దిగిన కొంరయ్య సునాయాసంగానే గెలుస్తారని పోలింగ్ సరళిని బట్టి భావిస్తున్నామని మరో ముఖ్యనేత అభిప్రాయపడ్డారు. కాగా, ఖమ్మం-వరంగల్-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఫలితం ఎలాగైనా ఉండవచ్చని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు. "మా అభ్యర్థి గెలుపు కోసం కష్టపడ్డాం. గట్టిపోటీ ఎదుర్కొన్నాం. ఫలితం ఎలా ఉంటుందో చూద్దాం" అని పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.

పోలింగ్ ప్రశాంతం

(మొదటిపేజీ తరువాయి)

మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో 4.30 గంటల దాకా కొనసాగింది. మొదట రెండు, మూడు గంటల పాటు కొంత మందకొడిగా సాగిన పోలింగ్.. ఆ తర్వాత బాగా పుంజుకుంది. కొన్ని పోలింగ్‌కేంద్రాల్లో సాధారణ ఎన్నికలను తలపిస్తూ క్యూలో వేచి ఉండి మరీ.. పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక, రెండు నియోజకవర్గాల్లోనూ ఓటేసేందుకు టీచర్లు పోటెత్తారు. పోలింగ్ సమయం ముగిసేప్పటికి నల్లగొండ-వరంగల్-ఖమ్మం టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో 93.55శాతం, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో 91.90శాతం, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 70.42శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'నల్లగొండ' టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 25,797 మంది ఓటర్లు ఉండగా.. 24,132 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 'కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో 27,088 మంది ఓటర్లు ఉండగా.. 24895 మంది ఓటు వేశారు. ఇక, పట్టభద్రుల నియోజకవర్గంలో 3,55,159 మంది ఓటర్లు ఉండగా.. 2,50,106 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా నియోజకవర్గాలకు చెందిన బ్యాలెట్ బ్యాక్సులను పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో సీజ్ చేసి.. భారీ బందోబస్తు మధ్య గోదాములకు తరలించారు. నల్లగొండలోని స్టేట్‌వేర్ హౌస్ గోదాము, కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఉన్న అంబేడ్కర్ స్టేడియంలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో మార్చి 3న ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖమ్మంలో ఫ్లెక్సీపై వివాదం.. ఉద్రిక్తత

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత ఏర్పడింది. ప్రచారం కోసం బీజేపీ ఏర్పాటు చేసిన టెంట్‌లో ఉన్న ప్రధాని మోదీ ఫ్లెక్సీని తొలిగించాలని యూటీఎఫ్, టీఎస్‌పీఆర్టీయూ సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. మోదీపై టీఎస్‌యూటీఎఫ్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ కార్యకర్తలు టెంట్లను కిందపడేశారు. దీంతో రెండువర్గాల మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఇరువర్గాలకు పోలీసులు సర్ది చెప్పి వదిలేశారు.



హుస్నాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు వేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు



కరీంనగర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

- భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలో ఒకే ఒక్క ఓటుతో వంద శాతం పోలింగ్ నమోదైంది. ఆ ఒక్క ఓటు కోసం ఐదుగురు పోలింగ్ సిబ్బంది, ఒక రూట్ ఆఫీసర్, భద్రతకు ఇద్దరు పోలీసులు పర్యవేక్షించగా ఉపాధ్యాయుడు జాడి సుధాకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- సిద్దిపేట జిల్లా కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు వంగ అమరేందర్‌రెడ్డి తన ఓటుహక్కు వినియోగించుకునేందుకు వినూత్న తీరులో వ్యవహరించారు. ఆయన స్వగ్రామం నుంచి కొమురవెల్లిలోని పోలింగ్ కేంద్రానికి సుమారు 6కిలోమీటర్లు ఉండగా, సమీప గ్రామాల మీదుగా 22కిలోమీటర్ల మేర జాగింగ్ చేస్తూ ఆయన పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఓటింగ్ పట్ల అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో 22 కిలోమీటర్లు జాగింగ్ చేసినట్లు తెలిపారు.
- సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని ప్యారానగర్‌లో డంపుయార్డుకు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు దూరంగా ఉన్నారు. 295మంది ఓటర్లకుగానూ 42 మందే ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామానికి చెందిన జాకీర్ పాషాకు రెండు చేతులు లేకున్నా పోలింగ్ కేంద్రానికి వెళ్లి కాలి బొటన వేలుతో ఓటు వేశారు. చేతులు, కాళ్లు బాగున్నా ఓటేయడానికి నేటి యువత ఆసక్తి చూపని తరుణంలో.. జాకీర్ పాషా పట్టుదల భేష్ అని పలువురు ప్రశంసించారు.
- పట్టభద్రుల ఓట్ల నమోదులో ఎన్నికల కమిషన్ విఫలమైందని స్వతంత్ర అభ్యర్థి నిమ్మతోట వెంకటేశ్వర్లు విమర్శించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 10లక్షల మంది పట్టభద్రులు ఉంటే.. 3.55లక్షల మంది మాత్రమే ఓటర్లుగా నమోదు చేసుకోవడమేంటని నిలదీశారు.

హోరాహోరీ పోరులో ఎవరి ధీమా వారిదే

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గంలో అభ్యర్థుల నడుమ బలమైన పోటీ కొనసాగింది. మొత్తం 19 మంది అభ్యర్థులు పోటీ పడగా.. పింగళి శ్రీపాల్‌రెడ్డి (పీఆర్‌టీయూటీఎస్), అలుగుబెల్లి నర్సిరెడ్డి (సిట్టింగ్ ఎమ్మెల్సీ, యూటీఎఫ్‌టీఎస్), పూల రవీందర్ (మాజీ ఎమ్మెల్సీ, బీసీ జేఏసీ), గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి (టీపీసీసీ అధికారప్రతినిధి, టీపీఆర్‌టీయూ), పులి సర్వోత్తంరెడ్డి (బీజేపీ), సుందర్‌రాజ్‌యాదవ్‌కు ఎక్కువ ఓట్లు పోలైనట్లు ఉపాధ్యాయవర్గాల్లో చర్చ సాగుతోంది. మొదటి ప్రాధాన్య ఓట్లలో తమకే ఆధిక్యత వస్తుందంటే, తమకే ఆధిక్యత వస్తుందని నలుగురు ప్రధాన అభ్యర్థులకు మద్దతిచ్చిన ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్లలోనే కోటా ఓటు సాధ్యం కాదని, ద్వితీయ ప్రాధాన్య ఓట్లే గెలుపును నిర్ణయించబోతున్నాయని ఉపాధ్యాయ ఓటర్లు చెబుతున్నారు. కరీంనగర్-ఆదిలాబాద్- నిజామాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఉపాధ్యాయ సంఘాలు మద్దతిచ్చిన అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చారు. పోలింగ్ సరళి ఆయనకు అనుకూలంగా ఉందన్న వాదన వినిపిస్తోంది. మల్క కొమురయ్యకు పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ, జాక్టో అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. ఇక, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ పోటీ చేసిన విషయం తెలిసిందే. మొదటి నుంచి భావించినట్టుగానే ఇక్కడ ముక్కోణపు పోటీ జరిగింది. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణకు కరీంనగర్‌లో ఎక్కువ ఓట్లు పడ్డాయన్న చర్చ జరుగుతోంది. ఉమ్మడి నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్, బీజేపీ హవా ఎక్కువగా కనిపించినట్లు చెబుతున్నారు. బీఎస్పీ అభ్యర్థి గట్టి పోటీ ఇచ్చినా కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల్లో ఒకరు ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకునే అవకాశాలున్నట్లు అంచనా వేస్తున్నారు.



30 ఏళ్లుగా పార్టీనే నమ్ముకున్న కుసుమ్, కుమార్‌రావుకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

» నాకు పదవి కావాలని నేను అడగట్లేదు

» పార్టీ ఇస్తున్న ప్రాధాన్యతతో తృప్తిగా ఉన్నా

» కమ్మ వర్గానికి చెందిన కుసుమ్‌కు ఇస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం

» 30 ఏళ్లుగా గాంధీభవన్‌లో సేవలు అందించిన కుమార్‌రావుకూ ఇవ్వాలి

» రేవంత్, భట్టి, మహేశ్, ఉత్తమ్‌కు చెప్పా

» మీడియాతో చిట్‌చాట్‌లో జగ్గారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ముప్పై ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని సేవలు అందిస్తున్న సీనియర్ నాయకులు జెట్టి కుసుమ్ కుమార్, కుమార్‌రావుకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవులు ఇవ్వాలని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అభిప్రాయపడ్డారు. తనకు ఎమ్మెల్సీ పదవి ముఖ్యం కాదని, ఎమ్మెల్సీ టికెట్‌నూ తాను అడగబోనని స్పష్టం చేశారు. పార్టీ తనకు ఇస్తున్న ప్రాధాన్యతతో తృప్తిగా ఉన్నానన్నారు. సంగారెడ్డి ప్రజలు తనను గెలిపించినా.. ఓడించినా లాభమే చేస్తున్నారని చెప్పారు. తాను ఓటమిపాలైనా తన భార్య నిర్మలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ అయ్యే అవకాశం వచ్చిందన్నారు. సీనియర్ నేతలు జెట్టి కుసుమ్‌కుమార్, కుమార్‌రావుకు ఎమ్మెల్సీ టిక్కెట్లు ఇస్తే బాగుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కు తన అభిప్రాయంగా చెప్పానని తెలిపారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళతానని వెల్లడించారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన కుసుమ్‌కుమార్.. 30 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్నారన్నారు. కుసుమ్ కుమార్‌కు అవకాశం ఇస్తే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పార్టీకి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. టీపీసీసీ చీఫ్‌గా ఉత్తమ్ ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి, పొన్నంతో పాటు కుసుమ్‌కుమార్ కార్యనిర్వాహక అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారని గుర్తు చేశారు. ఆ తర్వాత రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, పొన్నం మంత్రి అయ్యారని గుర్తు చేశారు. ఈ క్రమంలో కుసుమ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ పదవి ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఇక, 30 ఏళ్లుగా గాంధీభవన్‌కు సేవలందిస్తున్న వ్యక్తిగా కుమార్‌రావుకు ఎమ్మెల్సీ పదవి ఇస్తే బాగుంటుందన్నారు. పార్టీకి సేవ చేసిన వ్యక్తిగా ఆయనకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్‌ను కోరుతున్నానన్నారు.

కేదార్ మృతిపై మౌనమెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

అని కవిత మాట్లాడుతున్నరు. ఎవరు ఎవరితో జట్టు కట్టారో ఎమ్మెల్సీ ఎన్నికలతోనే తేలిపోయింది. రాష్ట్రంలో బీజేపీ 8 ఎంపీ సీట్లు గెలవడానికి ఎవరు సహకరించారు.. ఇప్పుడు జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టకుండా అంతర్గతంగా ఎవరు ఎవరికి మద్దతు ఇచ్చారన్నది ప్రజలు గమనిస్తున్నారు' అని పేర్కొన్నారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్‌రెడ్డి కలిసినప్పుడు.. అక్కడ మూడో వ్యక్తి లేడని, వారు ఏం మాట్లాడుకున్నారన్నది కవితకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఆమె కాకమ్మ కథలు మానేస్తే మంచిదని హితవు పలికారు. '2015 నుంచి.. చనిపోయేంత వరకు కేదార్‌తో అంటకాగిన వ్యక్తులు ఎవరు? దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దర్యాప్తు సంస్థలు దృష్టి పెట్టాలి' అని కాంగ్రెస్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ కేసులో నిందితుడైన కేదార్.. గతంలో జూబ్లీహిల్స్‌లో పబ్‌లను నిర్వహించారని, ఆ పబ్‌లలో పలువురు రాజకీయ ప్రముఖుల భాగస్వామ్యమూ ఉందని చెప్పారు. గత ఐదేళ్లలో తెలంగాణలో అక్రమంగా సంపాదించిన రూ.వేల కోట్ల సంపద.. దుబాయ్‌లో పెట్టుబడులుగా మారాయని, వాటికి కేదార్ సహా మరికొందరు బినామీలుగా ఉన్నారని ఆరోపించారు. వారు ఎవరెవరికి బినామీలుగా ఉన్నారు.. వెళ్లిన సంపద చట్టబద్ధంగా వెళ్లిందా.. లేక హవాలా రూపంలో వెళ్లిందా అన్నది దర్యాప్తు సంస్థలు తేల్చాలన్నారు. సినీ ప్రముఖులు.. వారు సంపాదించిన సొమ్మును ఎవరెవరినో నమ్మి విదేశాల్లో పెట్టుబడులు పెడితే ఒక్క రూపాయి కూడా తిరిగి రాదన్నారు. సంపాదించిన సొమ్ములో కొంత సాయం చేసి.. ప్రభుత్వం చేపట్టే మంచి కార్యక్రమాలకు అండగా నిలవాలని కోరారు. బీఆర్ఎస్ నేతల పాపాలపై పోరాటం చేస్తున్నవారు వరుసగా చనిపోతున్నారని, రానున్న రోజుల్లో ఈ మరణాలకు కారణాలు బయటికి వస్తాయని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కేదార్ మృతిపై కేటీఆర్ ఎందుకు స్పందించట్లేదని నిలదీశారు. కేదార్ చనిపోయినప్పుడు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే, కేటీఆర్ నమ్మిన బంటు అక్కడే ఉన్నాడన్నది నిజమా కాదా అని ప్రశ్నించారు. కేదార్ మృతి ఘటనలో ఎలాంటి ప్రమేయం లేనప్పుడు.. విచారణ జరిపించాలని ఎందుకు డిమాండ్ చేయట్లేదన్నారు.

ఆ మరణాలను బీఆర్ఎస్‌కు అంటగట్టడమేంటి?

» రాజలింగమూర్తి, సంజీవ రెడ్డి, కేదార్ మరణాలపై సీఎం వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందన

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై పోరాడిన రాజలింగమూర్తి, ఆయన తరఫున వాదించిన న్యాయవాది సంజీవరెడ్డి, డ్రగ్స్ కేసు నిందితుడు కేదార్ మరణాలపై సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తప్పుపట్టారు. ఏమాత్రం సంబంధంలేని బీఆర్ఎస్‌కు ఈ సంఘటనలను ఎందుకు అంటగడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. ఇది బీజేపీ, కాంగ్రెస్‌లు కలిసి ఆడుతున్న డ్రామా అని మండిపడ్డారు. ప్రతీ విషయంలో బీజేపీతో కలిసి పని చేస్తున్న రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్నారని కవిత అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మధ్య భాగస్వామ్యం ఉందని, అందులో భాగంగానే ఆ రెండు పార్టీల నేతలు లేనిపోని విషయాలను బీఆర్ఎస్‌కు అంటగడుతున్నారని తెలిపారు. న్యాయవాది సంజీవ రెడ్డి ఆరు నెలల క్రితం కోర్టులో అందరి కళ్ల ముందే ప్రాణాలు కోల్పోయారని, రాజలింగమూర్తి భూవివాదాల వల్ల హత్యకు గురయ్యారని ఆ జిల్లా ఎస్పీ చెప్పారని కవిత గుర్తు చేశారు. అలాగే, దుబాయ్‌లో ఒక వ్యక్తి నిద్రలోనే చనిపోయారని పత్రికల్లో వచ్చిందన్నారు. కానీ, ఈ సంఘటనలను ముఖ్యమంత్రి బీఆర్ఎస్‌కు ఎందుకు అంటగడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్‌పై కేసులు పెడతామని ప్రధానిని కలిసిన తర్వాత సీఎం అనడం చూస్తే.. ఆ రెండు పార్టీలు కలిసి కుట్ర చేస్తున్నాయనే విషయం అర్థమవుతుందని అన్నారు.

రేవంత్.. దమ్ముంటే నిరూపించు

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ డబ్బులు ఇస్తేనే తెలంగాణను అభివృద్ధి చేస్తానని రేవంత్ చెప్పారా..? కేంద్ర ప్రభుత్వ అనుమతి తీసుకుని ప్రాజెక్టులకు రూపకల్పన చేశారా..?" అని నిలదీశారు. తాను అనేక ఏళ్లుగా తెలంగాణకు సంబంధించిన ఒక్కో ప్రాజెక్టు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. సంబంధిత అధికారులతో చర్చిస్తున్నానని తెలిపారు. గతంలో ఉన్న ముఖ్యమంత్రికి కూడా ఉత్తరాలు రాశానని గుర్తు చేశారు. "రేవంత్ బెదిరింపు రాజకీయాలకు భయపడే వారెవరూ లేరు. ఆయన అసమర్థతను కేంద్రంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ ప్రాజెక్టులకు రేవంత్ బాధ్యుడవుతారు కానీ.. నేనెందుకు అవుతాను. చేతకాని మాటలు చెప్పి, చేతులు దులుపుకోవాలని చూస్తున్నాడు. మెట్రో రెండో దశకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం దగ్గర రూపాయి లేదు. కనీసం కార్యాచరణ ప్రణాళిక లేదు. ఇవన్నీ పక్కన పెట్టి.. కేంద్రాన్ని, కిషన్ రెడ్డిని బద్నాం చేయాలని చూస్తారా..?" అని కిషన్‌రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మెట్రో రెండో దశ ప్రాజెక్టు నివేదికను మొన్ననే పంపించారని తెలిపారు. దానిని అన్ని మంత్రిత్వ శాఖలకు పంపాలని, ఆ తర్వాత ప్రధాని కార్యాలయం సమీక్షిస్తుందని, అప్పుడు కేంద్ర మంత్రి వర్గానికి చేరుతుందని వివరించారు. కేంద్రంలో ఒక వ్యవస్థ ఉంటుందని, రేవంత్ దుందుడుకు వైఖరితో మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.

మైనింగ్‌లో రాష్ట్రాల పాత్ర కీలకం..

మైనింగ్ రంగంలో రాష్ట్రాల పాత్ర కీలకమని కిషన్ రెడ్డి అన్నారు. మినరల్ బ్లాకుల వేలం, ఉత్పత్తిపై రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. పదేళ్లుగా ప్రధాని మోదీ నేతృత్వంలో మైనింగ్ రంగంలో ఎంతో ప్రగతిని సాధించామని తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఈ ఏడాది 448 కొత్త ప్రాజెక్టులను అన్వేషించిందని, అందులో 195 క్లిష్టమైన మినరల్ ప్రాజెక్టులు ఉన్నాయని తెలిపారు. వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల్లో స్వాతంత్ర్యం తర్వాత గనుల తవ్వకం తగ్గిందని, దాన్ని ఒకటిన్నర రెట్లు పెంచామన్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ (డీఎంఎఫ్)లో రూ.లక్ష కోట్లకు పైగా నిధులు జమయ్యాయని తెలిపారు. ఈ నిధుల్లో విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, తాగునీరు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. డీఎంఎఫ్‌లో కొత్తగా గృహ, వ్యవసాయ, పశుపోషణ తదితర అంశాలను చేర్చామని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి సముద్రపు నీటి నుంచి పొటాషియం వంటివి వెలికి తీసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.



చాకలి ఐలమ్మ వర్సిటీ నూతన భవన నిర్మాణ నమూనాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, తదితరులు

చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీకి నిధులిస్తాం

- దేశంలోనే అత్యుత్తమ వర్సిటీగా తీర్చిదిద్దుతాం: భట్టి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీని దేశంలోనే అత్యుత్తమ వర్సిటీగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ(కోఠి ఉమెన్స్ కాలేజ్)ని గురువారం ఆయన సందర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న వారసత్వ భవనాలను పునరుద్ధరించడానికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తుందని చెప్పారు. తరగతి గదులు, లేబొరేటరీలు, గ్రంథాలయం, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది వసతి గృహాలు, వైస్ చాన్స్‌లర్ కార్యాలయం, అతిథి గృహం, ఆడిటోరియం, పరిపాలన విభాగ భవన నిర్మాణ ప్రదేశాలు, నిర్మాణ నమూనాలను భట్టి పరిశీలించారు. ఇటీవల పునరుద్ధరించిన దర్బార్ మహల్ హెరిటేజ్ బిల్డింగును కూడా పరిశీలించారు. నూతనంగా నిర్మించే భవన నమూనాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కొత్తగా నిర్మించే భవనాలు రాబోయే తరాలకు వారసత్వ కట్టడాలుగా నిలవాలని, అందుకు తగిన విధంగా ఆకృతులు ఉండాలని డిప్యూటీ సీఎం చెప్పారు.

ధరణిలో అవకతవకలను నిగ్గు తేల్చే ఫోరెన్సిక్ ఆడిట్ ఏజెన్సీ ఎంపిక ఎప్పుడో?

- టెండర్లలో జాప్యంపై మంత్రి పొంగులేటి ఆగ్రహం
- త్వరలో టెండర్లు పూర్తి చేసే యోచనలో సీసీఎల్ఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ధరణి పోర్టల్‌లో జరిగిన అవకతవకల నిగ్గు తేల్చేందుకు ఫోరెన్సిక్ ఆడిట్‌ను నిర్వహించే ఏజెన్సీని ఎంపిక చేసే ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఏజెన్సీ ఎంపికకు సంబంధించిన టెండర్ల దశ దాటకపోవడంతో ఇటీవల సీసీఎల్ఏ అధికారుల సమీక్షలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిబ్రవరి చివరికల్లా టెండర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా టెండర్ల ప్రక్రియ ముందుకుకదల్లేదు. ఇప్పటికీ ప్రతిపాదన ఆహ్వాన (ఆర్ఎఫ్‌పీ-రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్) దశ దాటలేదు. ఈ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ధరణి పోర్టల్‌లో అవకతవకలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. గత ప్రభుత్వ హయాంలో వేల కోట్ల రూపాయల భూములు చేతులు మారాయని, శాస్త్రీయంగా ఆ అక్రమాల నిగ్గు తేల్చేందుకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని గత డిసెంబరు 20న అసెంబ్లీలో మంత్రి ప్రకటించారు. ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన రెండు సంస్థలను పరిగణనలోకి తీసుకున్నామని, త్వరలోనే ఉత్తర్వులు ఇస్తామని ఫిబ్రవరి 14న పేర్కొన్నారు. మంత్రి పదేపదే చెబుతున్నా ఫోరెన్సిక్ ఆడిట్ ఏజెన్సీ ఎంపిక ప్రక్రియ వేగవంతంకావడం లేదు. ఈ నేపథ్యంలో జాప్యానికి తావులేకుండా తక్షణమే ఏజెన్సీని ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి మార్చి 5న తిరిగి రానున్నారు. ఈలోగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్న యోచనలో సీసీఎల్ఏ అధికారులు ఉన్నట్లు తెలిసింది.

నేటితో కులగణన రీ-సర్వే ముగింపు!

- కొన్ని ప్రాంతాల్లో వివరాల సేకరణకు రాలేదని బీసీ సంఘాల అసంతృప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే 2024లో మిగిలిపోయిన కుటుంబాలను గుర్తించేందుకు చేపట్టిన రీ- సర్వే గడువు శుక్రవారంతో ముగియనున్నది. నవంబరు 6 నుంచి డిసెంబరు 25 వరకు నిర్వహించిన కులగణన సర్వేలో తమను గుర్తించలేదని వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో మరో దఫా సర్వేను ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే నేటితో రీ-సర్వే గడువు ముగియనున్నప్పటికీ మిగిలిపోయిన కుటుంబాల నుంచి వివరాలు సేకరించేందుకు అధికారుల సర్వే బృందాలు అనేక ప్రాంతాలకు రాలేదని బీసీ సంఘాల ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మిగిలిపోయిన కుటుంబాల సర్వే మొక్కుబడిగా సాగిందని, క్షేత్ర స్థాయిలో అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,15,71,457 కుటుంబాలున్నట్టు అంచనా వేసిన అధికారులు 50 రోజుల్లో 1,12,15,134 కుటుంబాలను సర్వే చేసి 3,54,77,554 మందిని ఆయా వర్గాలకు చెందిన వారిగా గుర్తించారు. కాగా, సర్వే కోసం వెళ్లిన అధికారులకు కుటుంబసభ్యుల వివరాలు వెల్లడించకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సర్వేకు సహకరించకపోవడంతో దాదాపు 3.5 లక్షల కుటుంబాల నుంచి సమాచారం సేకరించలేకపోయారు. దీంతో సర్వేలో సమగ్రత లోపించిందని కొన్ని వర్గాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో విగిలిపోయిన కుటుంబాల కోసం 13 రోజుల పాటు రీ- సర్వే చేయాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

జయహో మల్లన్న.. మమ్మేలు మల్లన్న.. !

- వైభవంగా కొమురెల్లి మల్లన్న పెద్దపట్నం

చేర్యాల, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జయహో మల్లన్న.. మమ్మేలు మల్లన్న.. కొమురెల్లి మల్లన్న.. అంటూ భక్తుల జయజయధ్వానాలతో సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాలు మార్మోగాయి. మల్లన్న పెద్దపట్నం గురువారం తెల్లవారు జామున కన్నుల పండువగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున ఒగ్గుపూజారులు ఆలయ తోటబావి ప్రాంగణంలో యాదవ సంప్రదాయబద్ధంగా మల్లన్న కల్యాణం ఘనంగా జరిపారు. లింగోద్భవ సమయంలో గర్భాలయంలో వీరశైవార్చకులు స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పల్లకీసేవ తదితర పూజలు జరిపారు. పెద్దపట్నాన్ని తిలకించిన భక్తులు మల్లన్నను స్తుతిస్తూ పట్నంపై చిందేస్తూ తన్మయత్వం చెందారు. పట్నం తొక్కిన శివసత్తులు, పోతురాజుల సిగాలతో పాటు మల్లన్న నామస్మరణలు, భక్తుల జయజయధ్వానాలు మిన్నంటాయి.

వ్యక్తిగత కారణాలతోనే వైద్యులు వెళ్లిపోతున్నారు

- ఆంధ్రజ్యోతి కథనానికి నిమ్స్ డైరెక్టర్ వివరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) నుంచి వ్యక్తిగత కారణాలతోనే వైద్యులు వెళ్లిపోతున్నారని ఆ సంస్థ డైరెక్టర్ డా.ఎన్.బీరప్ప తెలిపారు. 'నిమ్స్‌కు వైద్యుల టాటా' పేరిట గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. 2022 జూన్ 30 నుంచి 2024 మే వరకు మొత్తం ఎనిమిది మంది వైద్యులు ఆసుపత్రిని వీడి వెళ్లిపోయారని తెలిపారు. ఇందులో ఐదుగురు స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారని, మిగతా ముగ్గురు ఉద్యోగాలకు రాజీనామా చేశారని వివరించారు. నిమ్స్‌లో ప్రొఫెసర్లకు పదోన్నతులు కల్పిస్తున్నామని, 2023లో 14 మందికి, 2024లో 35 మందికి కల్పించామని చెప్పారు. సీనియర్ వైద్యులకు రూ.1.50 లక్షల చొప్పున లర్నింగ్ రిసోర్స్ అలవెన్సును ఇస్తున్నామని తెలిపారు. ఖాళీ పోస్టుల భర్తీకి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను చేపడుతున్నామని తెలిపారు. 61 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించామని, ఇందులో 42 మందిని రెగ్యులర్ ప్రాతిపదికన, మరో 19 మందిని తాత్కాలిక ప్రాతిపదికన నియమించామని నిమ్స్ డైరెక్టర్ వివరించారు.

గోల్ఫ్ కోర్స్-విల్లా భూముల వివాదాన్ని

సామరస్యంగా పరిష్కరించుకుందాం

సీఎంను కలిసిన ఎమ్మార్ ప్రాపర్టీస్ వ్యవస్థాపకుడు.. యూఏఈ అనుమతితో మధ్యవర్తిత్వ ప్రతిపాదన

- సానుకూలంగా స్పందించిన రేవంత్
- 2015లోనే ఓ కమిటీ వేసిన కేసీఆర్
- దానికి అదనంగా న్యాయ నిపుణుల కమిటీ ఏర్పాటుకు తాజాగా నిర్ణయం
- అన్ని అంశాలను పరిశీలించాలని ఆదేశం
- పరిష్కారానికి సూచనలిచ్చిన కేంద్రం
- వైఎస్ హయాంలో వివాదాస్పదమైన ఎమ్మార్ భూకేటాయింపుల వ్యవహారం
- అనేక కేసులు, ఈడీ, సీబీఐ దర్యాప్తులు
- ప్రస్తుత విలువ రూ.40 వేల కోట్ల పైనే



సచివాలయంలో సీఎం రేవంత్‌తో సమావేశమైన ఎమ్మార్ సంస్థ ప్రతినిధులు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో చిక్కుకుని....ఈడీ, సీబీఐల విచారణ ఎదుర్కొంటున్న ఎమ్మార్ ప్రాపర్టీస్ వివాదాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణుల కమిటీని వేయాలని నిర్ణయించింది. 2005లో మొదలైన ఎమ్మార్ కంపెనీ వ్యవహారాలపై ఈడీ, సీబీఐ దర్యాప్తులతో పాటు హైకోర్టు, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ)లోనూ కేసులున్నాయి. ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో వీటికి సంబంధించిన విచారణలు రాష్ట్ర విభజన తర్వాత కూడా కొనసాగుతున్నాయి. దుబాయ్‌కి చెందిన ఎమ్మార్ కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి, వివాదాలన్నింటినీ పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మార్ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ మహమ్మద్ అలబ్బర్, సీఈవో అమిత్ జైన్ పాల్గొన్నారు. ఎమ్మార్ సంస్థకు సంబంధించిన వ్యవహారాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సంస్థకు కేటాయించిన భూములకు సంబంధించిన వివాదాలపై న్యాయస్థానంలో కేసులను. ఈడీ, సీబీఐ కేసులను పరిష్కరించేందుకు రాష్ట్ర విభజన తర్వాత నాటి కేసీఆర్ ప్రభుత్వం 2015లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఒక కమిటీని నియమించింది. సదరు కమిటీకి తోడు న్యాయ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేయాలని తాజాగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రెండు కమిటీలు అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. న్యాయ వివాదాల అధ్యయనానికి, సామరస్యపూర్వక పరిష్కారానికి యూఏఈ ప్రభుత్వ ఆమోదంతో ఒక లీగల్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తామని ఎమ్మార్ సంస్థ ప్రతిపాదించింది. అందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే న్యాయ నిపుణుల కమిటీ ఎమ్మార్ సంస్థ ఏర్పాటు చేసే లీగల్ ఏజెన్సీతో సంప్రదింపులు జరిపి, తదుపరి ఏం చేయాలన్న దానిపై సలహాలు అందిస్తుంద ని ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ఎమ్మార్ భూముల వ్యవహారం పరిష్కారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది. భారత విదేశాంగ శాఖ నుంచి, న్యాయశాఖ నుంచి సొలిసిటర్ జనరల్ కూడా కొన్ని సూచనలు చేశారు. నిర్ణయం తీసుకొనే సమయంలో వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు.

నానక్‌రాంగూడలో 532 ఎకరాలు

ఎమ్మార్ వివాదం మొదలై రెండు దశాబ్దాలు గడిచింది. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఈ కంపెనీకి అనుకూలంగా తీసుకున్న నిర్ణయాలు, ప్రభుత్వానికి తక్కువ ఆదాయం వచ్చేలా సదరు కంపెనీ ప్రయత్నాలు చేసిందన్న ఆరోపణలు మొత్తం వ్యవహారంపై సీబీఐ, ఈడీ కేసులకు దారితీశాయి. హైకోర్టులోనూ కేసులున్నాయి. విల్లా ప్లాట్లకు డబ్బులు చెల్లించిన వారు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. దర్యాప్తు సంస్థల కేసులతో పాటు అనేక న్యాయపరమైన కేసులు కొనసాగుతున్నాయి. 2002లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు దుబాయ్‌కు చెందిన ఎమ్మార్ కంపెనీకి హైదరాబాద్‌లోని నానక్‌రాంగూడలో 532 ఎకరాల భూమిని కేటాయించేందుకు ఒప్పందం కుదిరింది. అక్కడ ఒక గోల్ఫ్‌కోర్స్, కన్వెన్షన్ సెంటర్, హోటల్, విల్లాలు అభివృద్ధి చేయాలి. ఎకరం రూ.29 లక్షల చొప్పున ఎమ్మార్ కంపెనీకి కేటాయించారు. అక్కడ విల్లా ప్లాట్లను అభివృద్ధి చేసి అమ్మగా వచ్చిన ఆదాయంలో 26 శాతం నాటి ఏపీఐఐసీకి ఇవ్వాలని ఒప్పందంలో పెట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని రద్దు చేసింది. మళ్లీ కొత్తగా ఒప్పందం చేసుకుంది. కొత్త ఒప్పందంలో ఏపీఐఐసీకి వచ్చే వాటాను 26 శాతం నుంచి సుమారు 5 శాతానికి తగ్గించేశారు. ఎమ్మార్ సంస్థ, ఆ సంస్థ తరఫున మార్కెటింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న స్టైలిష్ హోమ్ సంస్థలు వందకు పైగా విల్లా ప్లాట్లను విక్రయించాయి. అవన్నీ 500 గజాలు విల్లా ప్లాట్లు. గజం రూ.45 వేల చొప్పున అమ్మారు. అంటే, ఒక్కో ప్లాటు రూ.2.25 కోట్ల చొప్పున విక్రయించారు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వాటా లెక్కలు చూపించినప్పుడు గజం రూ.5 వేలకే అమ్మినట్లు చూపించారని ఆరోపణలు వచ్చాయి. అంటే ఒక విల్లా ప్లాట్‌ను రూ.25 లక్షలకే అమ్మినట్లు లెక్క చూపడం ద్వారా రెండు కోట్ల రూపాయల లెక్క దాటేశారని అప్పట్లో వెలుగులోకి వచ్చింది. ఎమ్మార్ కంపెనీ విల్లా ప్లాట్ల అమ్మకం ద్వారా వచ్చిన మొత్తం రూ.96.01 కోట్లలో 45.21 కోట్లను సౌత్ ఎండ్ ప్రాజెక్ట్‌కి బదిలీ చేసింది. ఇందూ(జగన్ క్విడ్ ప్రో కో కేసుల్లో నిందితుడిగా ఉన్న శ్యాంప్రసాద్‌రెడ్డిది) ప్రాజెక్టుకు రూ.36.82 కోట్ల మేర బదిలీ చేశారు. అసలు ఏపీఐఐసీకే తెలియకుండా ఎమ్మార్ కంపెనీ ఎమ్మార్ హిల్స్ ప్రాపర్టీస్‌తో ఆ స్థలం అభివృద్ధికి ఒప్పందం చేసుకుంది. ఈ వ్యవహారాలకు సంబంధించి పలువురు రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఎమ్మార్ సంస్థ ప్రతినిధులు, స్టైలిష్ హోమ్స్ ప్రతినిధులు అందరిపైనా ఈడీ, సీబీఐలు కేసులు నమోదు చేసి విచారిస్తున్నాయి. ఎమ్మార్ నుంచి విల్లా ప్లాట్లు కొనుగోలు చేసిన వారు తమ ప్లాట్లను తమకు ఇవ్వకపోవడంతో సదరు సంస్థపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో కేసులు వేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించింది. ఈ భూముల్లో ఒక్క విల్లా ప్లాట్‌ను కూడా ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది. ఈ కేసులో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చింది.

ఆ భూముల విలువ రూ.40 వేల కోట్ల పైనే

ఎమ్మార్ ప్రాపర్టీస్‌కు కేటాయించిన భూమి విలువ ఇప్పుడు రూ.40 వేల కోట్ల పైనే ఉంటుందని అంచనా. గచ్చిబౌలి ఫ్లై ఓవర్ నుంచి మొదలయ్యే అవుటర్ రింగు రోడ్డుకు కుడివైపున కూతవేటు దూరంలో ఈ భూమి ఎకరా రూ.100 కోట్ల వరకు పలికే అవకాశం ఉంది. ఏడాది క్రితం ప్రభుత్వం వేలం వేసిన నియో పోలీస్ భూముల కంటే ఇది గచ్చిబౌలికి చాలా దగ్గరలో ఉండడంతో అత్యధిక విలువలు పలికే అవకాశాలున్నాయి.

తెలంగాణ పరుగు ఆగదు!

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణానికి అద్దం పట్టాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రపంచమంతా ఒప్పుకుంటోందని, ఇక తెలంగాణ పరుగు ఆగదని వ్యాఖ్యానించారు. మాదాపూర్‌లో 3.2 లక్షల చదరపు అడుగుల్లో, 5 వేల ఉద్యోగుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం హైదరాబాద్, తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా, రాష్ట్రంగా నిలిచాయని చెప్పారు. ఇప్పుడు మన పోటీ ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు నగరాలతో కాదని, ప్రపంచ స్థాయి నగరాలతోనని స్పష్టం చేశారు. రాష్ట్రం అనేక రంగాల్లో సాధించిన పెట్టుబడులే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఎలక్ట్రానిక్ వాహనాలను ప్రోత్సహించడంలో, పారిశ్రామిక అభివృద్ధిలో తెలంగాణ దేశంలోనే నంబర్ 1గా ఉందని చెప్పారు. రాష్ట్రం డేటా సెంటర్ల హబ్‌గా, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్, స్కిల్ డెవలప్‌మెంట్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ రంగాల్లో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణ అత్యధిక పెట్టుబడులను ఆకర్షించి దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ)ను ముందుగా అందిపుచ్చుకున్నామని ప్రస్తావించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల జీడీపీ కలిగిన రాష్ట్రంగా మార్చుతామని చెప్పినప్పుడు కొందరు సాధ్యం కాదన్నారని, తాము సాధించిన పెట్టుబడులు అది సాధ్యమేనని నిరూపిస్తున్నాయని చెప్పారు. 60 దేశాల్లో డిజిటల్, ఇంజనీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో 2.2 లక్షల మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ దేశ గౌరవాన్ని పెంచిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 2007లో హైదరాబాద్‌లో ప్రారంభమైన హెచ్‌సీఎల్.. ఇప్పుడు కొత్త క్యాంపస్ ఏర్పాటుతో మరో ఐదువేల మందికి ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు.

సిటీ కంపెనీలకు 15 పేటెంట్లు

నైపుణ్యాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యునివర్సిటీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కూడా భాగస్వామి కావాలని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు కోరారు. ఆనంద్ మహీంద్రా లాంటి దిగ్గజ పారిశ్రామికవేత్తలను యునివర్సిటీలో భాగస్వామ్యం చేశామని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు. ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఏర్పాటులో ఐటీ రంగం కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. నూతన ఆవిష్కరణలకు హైదరాబాద్ హబ్‌గా మారిందని, ఇటీవలే నగరానికి చెందిన టెక్ కంపెనీలు 15 పేటెంట్లు పొందాయని ప్రస్తావించారు. త్వరలోనే క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించబోతున్నామని వెల్లడించారు. ఇందుకు సంబంధించి స్విట్జర్లాండ్ దిగ్గజ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఎల్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులు తెచ్చే బాధ్యత కిషన్‌రెడ్డిదే

- లేనట్లయితే తీవ్ర పోరాటాలు తప్పవు: మంత్రి పొన్నం

హుస్నాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు ప్రతి ప్రాజెక్టును కేంద్రం నుంచి తీసుకొచ్చే బాధ్యత రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిదేనని, లేనట్లయితే భవిష్యత్తులో తీవ్ర పోరాటాలు తప్పవని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ రాష్ట్రానికి రావాల్సిన ప్రాజెక్టులపై తమను సంప్రదించలేదని, ఈ రాష్ట్రానికి ఏం కావాలో అడగలేదని కేంద్ర ప్రభుత్వం కారణాలు చూపి పదేళ్లుగా పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మెట్రో రైలు మలిదశ, మూసీ, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్, హైదరాబాద్‌లో తాగునీటి సమస్య వంటి అనేక ప్రాజెక్టులపై కేంద్రానికి నివేదిక సమర్పించామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల మంజూరు కోసం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు తామూ కేంద్రం చుట్టూ తిరుగుతున్నామని ఆయన చెప్పారు.


ఆరోగ్య శాఖలో రిటైర్డ్ అధికారులకు చెక్

- 16 మందిని తొలగిస్తూ ఉత్తర్వుల జారీ
- ఆరోగ్యశ్రీలో 8 మంది, టీజీఎంఎస్ఐడీసీ, ఎన్‌హెచ్ఎంలో నలుగురు చొప్పున

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఏళ్ల తరబడి ఇన్‌చార్జి హోదాల్లో కొనసాగుతున్న రిటైర్డ్ అధికారులను తొలగించే ప్రక్రియను ప్రభుత్వం మొదలుపెట్టింది. ఆరోగ్యశ్రీ, జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్ఎం), తెలంగాణ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) తదితర విభాగాల్లోని మొత్తం 16 మంది పదవీ విరమణ పొందిన అధికారులను తొలగిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్.చోంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఆరోగ్యశ్రీలో 8 మంది, టీజీఎంఎస్ఐడీసీ, ఎన్‌హెచ్ఎంలో నలుగురేసి రిటైర్డ్ అధికారులను తొలగించారు. ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి తొలగించిన 8 మందిలో ముగ్గురు డాక్టర్లు, ఐదుగురు నాన్-టెక్నికల్ అధికారులు ఉన్నారు. ప్రజారోగ్య సంచాలకులు (డీపీహెచ్), తెలంగాణ వైద్య విధాన పరిషత్, వైద్య విద్య సంచాలకులు (డీఎంఈ), డ్రగ్ కంట్రోల్, ఆయుష్ విభాగాల్లోనూ రిటైర్డ్ అధికారులను తొలగించడానికి రంగం సిద్ధమవుతోంది. ఇప్పటికే ఆయా విభాగాల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్న రిటైర్డ్ అధికారుల వివరాలు ఇవ్వాలని ఉన్నతాధికారులు కోరారు. పదవీ విరమణ తర్వాత ఎన్ని రోజుల నుంచి వారు పని చేస్తున్నారు? వారి ప్రవర్తన ఎలా ఉంది? వాళ్లనే కొనసాగించాల్సిన అవసరం ఏముంది? వంటి అంశాలపై స్పష్టమైన వివరాలు పంపించాలని అడిగారు. దీంతో ఆయా విభాగాల హెచ్‌వోడీలు నివేదిక తయారుచేస్తున్నట్లు తెలిసింది.

డీపీఆర్‌కు రూ. 677 కోట్లా?

(మొదటిపేజీ తరువాయి)



జస్టిస్ ఘోష్

హెచ్చరించింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో అవకతవకతలపై విచారణ నిర్వహిస్తున్న కమిషన్ గురువారం నీటి పారుదల శాఖలోని మాజీ ఈఎన్‌సీలు సి.మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఈఎన్‌సీ బి.హరిరామ్‌లను మరోసారి ప్రశ్నించింది. గతంలో ప్రశ్నించినపుడు పలు అంశాలపై వీరు తమను తప్పుదోవ పట్టించారని కమిషన్ గుర్తించింది. అవే అంశాలకు సంబంధించి వాస్తవిక పత్రాలు పక్కన పెట్టుకొని మరోసారి ప్రశ్నలు అడిగింది. వ్యాప్కోస్‌కి డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందని మురళీధర్ చెప్పగా, ప్రభుత్వం అంటే ఎవరని కమిషన్ ప్రశ్నించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి అని ఆయన బదులిచ్చారు. నామినేషన్‌పై వ్యాప్కోస్‌కు అప్పగించాలని సీఎం నిర్ణయించారని మీరే రాశారు కదా? అని కమిషన్ ఒక లేఖను చూపించగా, నిజమేనని మురళీధర్ అంగీకరించారు. కమిషన్ అడిగిన చాలా ప్రశ్నలకు ఆయన తనకు గుర్తు లేదని బదులిచ్చారు. తన జ్ఞాపకశక్తి తగ్గుతోందని, మతిమరుపు వచ్చిందని చెప్పారు. బ్యారేజీ నిర్మాణం లొకేషన్‌ను మేడిగడ్డకు మార్చడాన్ని వ్యతిరేకిస్తూ నిపుణుల కమిటీ చేసిన సిఫారసులను ఉద్దేశ పూర్వకంగానే పాటించలేదని కమిషన్ మురళీధర్‌ను తప్పుబట్టింది. స్టీల్ కొనుగోలుకు కాంట్రాక్టర్లకు 60 శాతం సొమ్మును ముందుగానే చెల్లించాలని, అందుకు నిబంధనలను సడలించాలని ముఖ్యమంత్రితో జరిగిన సమావేశంలో తానే ప్రతిపాదించానని మురళీధర్ అంగీకరించారు. అదనపు పనులకు ఎంత వ్యయం చేసినా చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారా? అని అడగ్గా మినిట్స్ చూస్తే గాని చెప్పలేనని మురళీధర్ బదులిచ్చారు. వ్యాప్కోస్ అభిప్రాయం తీసుకోకుండానే అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ ప్రదేశాలను మార్చామని మురళీధర్ అంగీకరించారు. బ్యారేజీల నిర్మాణ గడువు పొడిగించడానికి ముందు నిర్మాణ సంస్థలపై నిబంధనల ప్రకారం జరిమానాలు ఎందుకు విధించలేదని రామగుండం మాజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లును అడగగా, నిర్మాణ స్థలంలో పరిస్థితుల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని ఆయన బదులిచ్చారు. ఎవరి ఆదేశాలతో బ్యారేజీలలో నీటిని నిల్వ చేశారని కమిషన్ ప్రశ్నించగా, ప్రభుత్వం అని వెంకటేశ్వర్లు బదులిచ్చారు. ప్రభుత్వమంటే ఎవరు? అని నిలదీయగా కేసీఆర్ అని బదులిచ్చారు. బ్యారేజీల నిర్వహణ, పర్యవేక్షణలో ఇద్దరు అధికారులు విఫలమయ్యారని, భారీ మొత్తంలో ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన బ్యారేజీల పట్ల కనీస శ్రద్ధ చూపలేదని కమిషన్ తప్పుబట్టింది.

సీడబ్ల్యూసీ లేఖలెందుకు దాచారు?

'మీరు ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు సీఈగా ఉన్నప్పుడు 2015 జనవరి 31, మార్చి 4 తేదీల్లో కేంద్ర జల సంఘం మీకు రాసిన లేఖలను నిపుణుల కమిటీ దృష్టికి తీసుకెళ్లారా? అని గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్‌ను జస్టిస్ ఘోష్ కమిషన్ ప్రశ్నించగా.. అవునని బదులిచ్చారు. నిపుణుల కమిటీతో పాటు కమిషన్‌కు కూడా లేఖలు ఇవ్వలేదని ఆధారాలున్నాయని కమిషన్ స్పష్టం చేసింది. తనకు గుర్తు లేదని, రికార్డులు పరిశీలించి చెప్తానని హరిరామ్ దాటవేశారు. డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ ఆమోదించడానికి ముందే పనులు ప్రారంభించడం, ప్రాజెక్టుకు రూ.81,911 కోట్ల అంచనాలతో ఒకే పరిపాలన అనుమతి ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో పనికి విడివిడిగా అనుమతులివ్వడం, రూ.1,10,248 కోట్లతో వేర్వేరు పనులకు వేర్వేరు అనుమతులు ఇవ్వడం, రూ.1,09,768 కోట్లతో ఒప్పందాలు చేసుకోవడం నిజమేనా? అని కమిషన్ అడగ్గా కాగ్ అధికారి జె.నిఖిల్ చక్రవర్తి అవునని బదులిచ్చారు. కాగ్ నివేదికలో పేర్కొన్న అంశాలన్నీ వాస్తవాలేనన్నారు.

ఫోన్‌ట్యాపింగ్ కేసు దర్యాప్తునకు అనుమతివ్వండి

- హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి
- తప్పుదోవ పట్టించి, స్టే పొందారని వెల్లడి
- చక్రధర్‌గౌడ్ కంటే ప్రభుత్వమే ఎక్కువగా బాధపడుతోంది
- హరీశ్‌రావు తరఫు న్యాయవాది



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): చక్రధర్‌గౌడ్ ఫోన్ ట్యాపింగ్ కేసుపై విధించిన స్టేను ఎత్తివేసి, దర్యాప్తునకు అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ కేసులో ఏ-1గా ఉన్న మాజీ మంత్రి హరీశ్‌రావు కేసు నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని.. మంత్రిగా ఉన్నప్పుడు ప్రభుత్వ వ్యవస్థలను సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని పేర్కొంది. రియల్‌ఎస్టేట్ వ్యాపారి, కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు తనపై పెట్టిన ఫోన్‌ట్యాపింగ్(రెండో ఎఫ్ఐఆర్) కేసు కొట్టేయాలని కోరుతూ మాజీ మంత్రి హరీశ్‌రావు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.! ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం మరోసారి విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలను వినిపించారు. ఇదే కేసులో అరెస్టయిన మరో ముగ్గురు నిందితుల గురించి వాస్తవాలను చెప్పకుండా, దర్యాప్తుపై స్టే పొందారని వారు కోర్టుకు వివరించారు. కస్టడీ పిటిషన్లను తేల్చకుండా దిగువకోర్టు ముగ్గురు నిందితులకు బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. తన ఇంట్లో మెడికల్ ఎమర్జెన్సీ ఉందని చెప్పినా.. విచారణకు పట్టుబట్టి దర్యాప్తుపై స్టే పొందారని హరీశ్‌రావు తరఫు న్యాయవాదుల తీరును సిద్ధార్థ లూథ్రా తప్పుబట్టారు. "ఫోన్‌ట్యాపింగ్ కేసు డైరీ ధర్మాసనానికి అందుబాటులో ఉంది. దాన్ని ఒక్కసారి పరిశీలిస్తే.. షాకింగ్ విషయాలు తెలుస్తాయి. ఒక వ్యక్తి గోప్యత విషయంలో మితిమీరి జోక్యం చేసుకునే హక్కు ప్రభుత్వ అధికారులకు ఎక్కడిది? భార్యాబిడ్డలతో మాట్లాడుకునే వ్యక్తిగత విషయాలను సైతం వింటున్నారు. చక్రధర్ గౌడ్, అతడి కుటుంబ సభ్యుల సీడీఆర్ ఫైల్స్ ట్యాపింగ్‌ను నిరూపిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. హరీశ్ తరఫున సీనియర్ న్యాయవాది శేషాద్రినాయుడు వాదనలను వినిపించారు. "ఈ కేసు విషయంలో.. చక్రధర్‌గౌడ్ కంటే ఎక్కువ ప్రభుత్వం బాధపడుతోంది. ప్రభుత్వానికి ఇంత ఆసక్తి ఎందుకు? దీన్నిబట్టే ప్రభుత్వ కుట్రపూరిత ఉద్దేశం బయటపడుతోంది. 11 క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తికి ప్రభుత్వం వత్తాసు పలకడం ఏమిటి? సీడీఆర్ ఉన్నంత మాత్రాన ఫోన్‌ట్యాపింగ్ జరిగినట్లు కాదు. ఎఫ్ఐఆర్ అంతా డొల్ల అని ప్రభుత్వానికి ముందే తెలుసు. అందుకే, వాయిదాలు తీసుకుని హరీశ్‌రావును ఇరికించేందుకు మరో ముగ్గురిని అరెస్టు చేసి, వారి నుంచి నేరాంగీకార వాంగ్మూలాలను తీసుకున్నారు" అని ధర్మాసనానికి వివరించారు. చక్రధర్‌గౌడ్ తరఫు న్యాయవాది వాదనలను వినిపిస్తూ.. హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ తప్పని.. కేసులో దర్యాప్తు కొనసాగాలని స్పష్టం చేశారు. సిద్ధార్థ లూథ్రా ఇంట్లో మెడికల్ ఎమర్జెన్సీ ఉండగా.. దర్యాప్తుపై స్టే పొందారు అన్న అంశంపై సీనియర్ న్యాయవాదుల మధ్య వాగ్వాదం నెలకొంది. ధర్మాసనం కల్పించుకుంటూ.. కేవలం కేసులో మెరిట్స్‌పై వాదనలను వినిపించాలని సీనియర్ న్యాయవాదులను కోరుతూ.. క్వాష్ పిటిషన్‌లో తీర్పును రిజర్వ్ చేసింది.

'జేఆర్ ఇన్ఫినిటీ' కేసులో 7.98 కోట్లు సీజ్

» డ్రగ్స్ డబ్బుతో 22చోట్ల స్థలాలు కొన్నట్లు గుర్తించిన ఈడీ

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): టాబ్లెట్ల రూపంలో నిషేధిత మత్తుమందులను ఆన్‌లైన్‌లో విదేశాలకు సరఫరా చేస్తూ పట్టుబడిన జేఆర్ ఇన్ఫినిటీ గ్రూపు యాజమాన్యం ఆ డబ్బుతో 22చోట్ల ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు గుర్తించారు. జేఆర్ గ్రూపుకు చెందిన ఆశిశ్ జైన్ పేరిట ఇండోర్, హైదరాబాద్‌లో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసినట్లు ఈడీ విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలో ఆశిశ్ జైన్, అతని కుటుంబసభ్యులకు చెందిన రూ.7.98కోట్ల విలువైన 30 స్థిరచరాస్తులను స్వాధీనం చేసుకున్నామని హైదరాబాద్ జోన్ ఈడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో జేర్ ఇన్ఫినిటీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీని ప్రారంభించిన ఆశిశ్ జైన్ అల్ప్రాజోలం, జోల్పిడెమ్, లోరెజ్‌పామ్ తదితర మత్తుమందులను ఆన్‌లైన్‌లో అమ్మకానికి ఉంచారు. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు 2022లో జేఆర్ ఇన్ఫినిటీ కేంద్రంపై దాడి చేసి కేసు నమోదు చేశారు. విదేశాల నుంచి మత్తుమందుల అమ్మకానికి సంబంధించి కోట్ల రూపాయల డబ్బు ఆశిశ్ బ్యాంక్ ఖాతాల్లో జమ అయినట్లు గుర్తించిన ఈడీ అధికారులు ఎన్‌సిబీ కేసు ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు.

అప్పుల బాధతో మిర్చి రైతు ఆత్మహత్య

రేగొండ , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మిర్చి పంటకు నల్లి తెగులు సోకి తీవ్ర నష్టాలు రావడం, పంట కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన భూపాలపల్లి జిల్లా కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లిలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన బండారి రవి (54) రెండెకరాల్లో మిర్చి పంట వేశాడు. నల్లి తెగులు సోకడంతో పంట దిగుబడి సరిగా రాక నష్టపోయాడు. దీంతో పెట్టుబడికి తెచ్చిన రూ. 5 లక్షల అప్పును తీర్చలేక మనస్తాపంతో గురువారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పుల పాలు

» ఐటీ ఉద్యోగం మానేసి గంజాయి దందా

» ముగ్గురి అరెస్టు.. 40 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగుల్లో అప్పులపాలైన ఓ ఐటీ ఉద్యోగి.. ఉద్యోగం మానేసి గంజాయి దందా మొదలుపెట్టాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. ఏపీకి చెందిన శ్రీనివాసులు కొంతకాలం హైదరాబాద్‌లోని ఓ ఐటీ సంస్థలో పని చేశాడు. ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటు పడిన అతడు అధిక మొత్తంలో అప్పులు చేశాడు. అతడి బంధువుల్లో ఒకరు గంజాయి దందా చేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలుసుకుని ఆ పని మొదలు పెట్టాడు. ఒడిశాకు చెందిన బాలాహంతల్ అలియాస్ స్టీవ్, అలియాస్ రాజు, అలియాస్ రంజు నుంచి గంజాయిని కొనుగోలు చేసేవాడు. డెలివరీ కోసం ఏపీకి చెందిన తన స్నేహితుడు అభిషేక్‌ను నియమించుకున్నాడు. బాలహంతల్ నుంచి హైదరాబాద్‌లో గురువారం శ్రీనివాస్ గంజాయి తీసుకుంటుండగా దాడి చేసి 40 కిలోల గంజాయి, ప్యాకింగ్ సామగ్రి, కేటీఎం బైక్, 3 మొబైల్ ఫోన్లు, రూ.40,440 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

మార్చి 2, 3వ తేదీల్లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లింగంపల్లి- విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను మార్చి 2, 3వ తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే గురువారం ప్రకటించింది. విజయవాడ డివిజన్ పరిధిలోని కడియం-ద్వారపూడి-అనపర్తి సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల నిమిత్తం 2వ తేదీన విశాఖపట్నం నుంచి లింగంపల్లి రావాల్సిన (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను, అలాగే 3వ తేదీన లింగంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. రైళ్ల రద్దు కారణంగా టికెట్లు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు 100 శాతం సొమ్ము తిరిగి జమ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.

'బార్' ఎన్నికలపై యథాతథ స్థితి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు సహా అన్ని కోర్టుల బార్ అసోసియేషన్ల ఎన్నికలపై హైకోర్టు గురువారం స్టేటస్ కో (యథాతథ స్థితి) ఆదేశాలు ఇచ్చింది. అధికార పరిధికి విరుద్ధంగా తెలంగాణ బార్ కౌన్సిల్.. బార్ అసోసియేషన్ల ఎన్నికల్లో జోక్యం చేసుకుంటోందని, పదవీకాలాన్ని రెండేళ్లకు పెంచుకోనివ్వడం లేదని పేర్కొంటూ పలు బార్ అసోసియేషన్లు పిటిషన్ దాఖలు చేశాయి. దీనిపై జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. బార్ అసోసియేషన్‌ల తరఫున సీనియర్ న్యాయవాదులు సునీల్, రవీందర్‌రెడ్డి వాదనలు వినిపించారు. పదవీకాలం పూర్తయినా బార్ కౌన్సిల్ కార్యవర్గం కొనసాగుతోందని, ఏడేళ్లుగా పదవుల్లో ఉన్నారని పేర్కొన్నారు. అసోసియేషన్ల కార్యవర్గాలకు మాత్రం మార్చి 31లోగా ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిడి చేస్తోందని ఆరోపించారు. బార్ కౌన్సిల్ తరఫున సీనియర్ న్యాయవాది అశోక్ కుమార్ వాదిస్తూ.. బైలాస్‌కు విరుద్ధంగా బార్ అసోసియేషన్ పదవీకాలాన్ని ఏడాది నుంచి రెండేళ్లకు పెంచుకోవాలనుకోవడం చట్టసమ్మతం కాదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం అన్ని కోర్టుల బార్ అసోసియేషన్ల ఎన్నికలపై మార్చి 4 వరకు స్టేటస్ కో విధించింది.

మెట్రో కారిడార్-6 పనులపై జవాబివ్వండి: హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపడుతున్న మెట్రో కారిడార్-6 పనులు ఆపాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సమాధానం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం, హెచ్ఎండీఏ, మెట్రోరైల్ ఎం.డి. తదితరులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ (ఏపీడబ్ల్యూఎఫ్) సంస్థ అధ్యక్షుడు మహమ్మద్ రహీమ్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. వారసత్వ కట్టడాలపై ప్రభావం ఎంత ఉంటుందో తెలిపేలా హెరిటేజ్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ జరగనుందున పనులు ఆపాలని కోరారు. ఈపిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వం తరఫు న్యాయవాది మూడువారాల సమయం కోరడంతో విచారణ ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది.



నిమ్మకూరులో ఎన్టీఆర్ బసవతారకం దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న బాలయ్య

ఎన్టీఆర్‌కు భారతరత్న వస్తుందని ఆశిస్తున్నా

నిమ్మకూరులో సినీనటుడు బాలకృష్ణ

పామర్రు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): 'తెలుగు జాతి అభ్యున్నతికి పాటుపడ్డ మహోన్నతుడు, నా తండ్రి స్వర్గీయ ఎన్టీఆర్. ఆ మహోన్నత వ్యక్తికి ఎన్డీయే కూటమి హయాంలో భారతరత్న తప్పక వస్తుందని భావిస్తున్నా' అని సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. తన స్వగ్రామమైన నిమ్మకూరుకు గురువారం ఆయన ఆకస్మికంగా వచ్చారు. గ్రామంలోని ఎన్టీఆర్ బసవతారకం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తన సమీప బంధువు ఇంట్లో కాసేపు గడిపారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ బిడ్డగా తనను ఆదరిస్తున్నవారికి రుణపడి ఉంటానన్నారు. తన సేవలను భారత ప్రభుత్వం గుర్తించి పద్మభూషణ్ అవార్డు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మిస్తామన్నారు.

పసిమొగ్గలకు

చచ్చేంత సమస్యలా?

పెన్ను తెచ్చుకునేందుకు దుకాణానికి వెళ్లిన కూతురు ఆలస్యంగా ఇంటికి తిరిగిరావడంతో 'ఇంతసేపు షాపు వద్ద ఏం చేశావు?' అని తల్లి కాస్తంత మందలించింది. ఆ మాత్రానికే బాధపడిపోయిన ఆ బాలిక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు ఖమ్మం పట్టణం మామిళ్ల గూడేనికి చెందిన పదో తరగతి విద్యార్థిని లక్ష్మీ నక్షత్ర (14).

కాలేజీకి ఎందుకు వెళ్లడం లేదు? అని తండ్రి మందలించడంతో జనవరి 6న జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేటకు చెందిన డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థి సిద్దార్థ రెడ్డి (19) ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆ బాలిక అడిగితే తల్లి సెల్‌ఫోన్ ఇవ్వలేదు. ఆ మాత్రానికే అలిగిన బాలిక ఇంట్లో సీలింగ్ ఫ్యానుకు ఉరివేసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కౌటాల మండల కేంద్రంలో ఫిబ్రవరి 8న ఈ ఘటన జరిగింది. మృతురాలు టెన్త్ విద్యార్థిని బొమ్మకంటి స్ఫూర్తి (14)

జగిత్యాల రూరల్ మండలం వేంపేట గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి, మామిడాల రణధీర్.. తల్లిదండ్రులు తనకు బైక్ కొనివ్వలేదనే ఆవేదనతో గత డిసెంబరు 22న ఆత్మహత్య చేసుకున్నాడు.

ఇంటర్ ప్రీ ఫైనల్స్ రాయకపోతే ఎలా? నీ కెరీర్‌కే నష్టం కదా? అని తల్లి మందలించడంతో గోదావరిఖనిలో ముక్క రోహిత్ (16) అనే విద్యార్థి గత డిసెంబరు 30న ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది తెలిసి.. రోహిత్ స్నేహితుడు, గోదావరిఖనికే చెందిన శ్రీనాథీశ్వర్ (18) బలవన్మరణానికి పాల్పడ్డాడు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబితే స్నేహితురాలు కొట్టిందన్న ఆవేదనతో జగిత్యాల జిల్లా గంభీర్‌రావుపేట మండలం మల్లారెడ్డిపేటలో జనవరి 1న శివ కిషోర్ (17) అనే టెన్త్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు.

(మొదటిపేజీ తరువాయి)

దానికే అలకా? నేనున్నాను కదా అని ఓ భరోసా ఇస్తే అప్పటిదాకా ఎర్రగా కందిన ఆ మోములో నవ్వులు విరిసేవి. ఈ పరిస్థితి ఇప్పుడుందా? పిల్లల మనసు గాయపడితే ముఖకవళికలు, ఉద్వేగాల ద్వారా బయటపడటం లేదు. ఫలానా విషయంలో బాధపడుతున్నామని ఆ పసిమొగ్గలు చెప్పడమూ లేదు. ఆ క్షణం దాకా మామూలుగానే ఉండి.. మరుక్షణంలో ఏకంగా ప్రాణాలను తీసుకుంటున్నారు. టీనేజర్లు చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్య చేసుకుంటున్నారు. పొద్దున స్నానం చేయించి.. యూనిఫాం వేసి, తలదువ్వి.. టిఫిన్ తినిపించి.. పుస్తకాలు, నోటు బుక్కులు బ్యాగులో సర్ది.. లంచ్‌బాక్సు ఇచ్చి బడికి పంపితే.. ఆ బిడ్డడు ఆ స్కూలు భవనం మీద నుంచే దూకి ప్రాణాలు తీసుకున్నాడని ఆ తల్లికి ఫోనొస్తోంది. సెలవులు అయిపోయాక అమ్మాయిని హాస్టల్‌లో దిగబెట్టి ఇంటికొచ్చిన తల్లిదండ్రులకు తమ గారాలపట్టి ఇక లేదనే గుండె పగిలే వార్త చెవిన పడుతోంది. పుస్తకం ముందరేసుకొని కూర్చో అని కుమారుడికి చెప్పి పొద్దున పొలానికి వెళ్లి, సాయంత్రం ఇంటికి తిరిగొచ్చిన రైతు దంపతులకు ఆ బిడ్డ ఉరికి వేలాడుతున్న స్థితిలో కనిపిస్తున్నాడు. హాస్టల్లో స్నేహితురాళ్లతో అప్పటిదాకా కలిసి చదువుకున్న అమ్మాయి, తన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుంటోంది. చదువు ఒత్తిడితోనో, ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులు మందలించారనో, ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు కోల్పోయామనో, హాస్టల్లో ఉండలేమన్న బాధతోనో, ర్యాగింగ్ పేరుతో సీనియర్లు వేధిస్తున్నారనో, పరీక్షలు బాగా రాయలేదనో, మార్కులు తక్కువొచ్చాయనో, చదువులో వెనుకబడ్డామనో, తల్లిదండ్రులు బైకో, సెల్‌ఫోనో కొనివ్వలేదనో, స్నేహితులతో గొడవ పడో, ప్రేమ విఫలమైందనో పిల్లలు ప్రాణాలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలు ఇటీవల బాగా పెరిగాయి. గత 12 నెలలో ఆదిలాబాద్ జిల్లాలోనే 46 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 34 మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పదిమంది విద్యార్థులు, ఉమ్మడి మెదక్ జిల్లాలో 11 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకున్నారు.



తల్లిదండ్రులు అర్థం చేసుకోవాలి

పిల్లలకు కన్నవారికంటే ఆప్తులు ఇంకెవరుంటారు? అలాంటిది.. వారే తమను అర్థం చేసుకోలేకపోతున్నారనే భావన పిల్లల్లో ఒకసారి కలిగితే అది తీవ్ర మానసిక సమస్యలకు.. కొన్నిసార్లు ఆత్మహత్యకు పాల్పడే దాకా దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పిల్లల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా వారికి చదువు పరంగా లక్ష్యాలను నిర్దేస్తుండటంతో వారిపై ఒత్తిడి పెరుగుతోందంటున్నారు. ఫలితంగా చదువులో వెనుకబడిపోయి, పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చిన సందర్భాల్లో తల్లిదండ్రులు మందలించడంతో పిల్లలు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారని అంటున్నారు. ఇష్టం లేకుండా ఇంటికి దూరంగా హాస్టల్లో ఉంచడం.. ఇష్టం లేని గ్రూప్‌లో చదివించడం. వంటి ఘటనలతో ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతుండటం గమనార్హం. ఉద్యోగవ్యాపారాలతో బిజీగా ఉంటున్న తల్లిదండ్రులు, పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించడం లేదు. ఫలితంగా పిల్లలు కొన్ని సందర్భాల్లో డిప్రెషన్‌లోకి వెళ్లడాన్ని వారు గమనించలేకపోతున్నారు.

భవనంపై నుంచి దూకేసి

ఆ విద్యార్థికి 13 ఏళ్లు. పేరు సంగారెడ్డి. ఉప్పల్‌ని ఓ స్కూల్లో ఎనిమిదో క్లాసు చదువుతున్నాడు. 21న బడిలో స్నేహితుల ప్రోద్బలంతో సీసీ కెమెరా యాంగిల్‌ను మార్చాడు. ఇది తెలిసి సంగారెడ్డిని పీఈటీ మందలించాడు. మర్నాడు, సంగారెడ్డి మళ్లీ అదేపని చేయడంతో ఈసారి పీఈటీ ఓ లెంపకాయ వేశాడు. సంగారెడ్డి, అదే పాఠశాల భవనం నాలుగో అంతస్తుపైకి వెళ్లి.. అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యార్థుల ఆత్మహత్యల్లో కొన్ని..

- మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్న చింతకుంటకు చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీకన్య (15)కు చదువుకోవడం ఇష్టం లేదు. కస్తూర్బా హాస్టల్ నుంచి ఇంటికొచ్చేయడంతో తల్లిదండ్రులు నచ్చజెప్పి హాస్టల్‌కు పంపారు. కన్నవారు తనను అర్థం చేసుకోలేకపోయారనే ఆవేదనతో ఈనెల 11న ఆమె హాస్టల్ గదిలో ఉరి వేసుకుని చనిపోయింది.
- గోదావరిఖనికి చెందిన డిప్లొమా విద్యార్థి సాయి అవినాశ్ ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడుకుంటూ సమయం వృథా చేస్తున్నాడని తల్లిదండ్రులు మందలించడంతో ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు.
- మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన టీనేజర్లు ప్రేమ విఫలమైందన్న అసంతృప్తితో ఒకేరోజు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నారు.
- మంచిర్యాల జిల్లా తాండూరు మండలం అచ్చలాపూర్ మైదం సాత్విక్ (18) ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం ఉప్పుగల్లుకు చెందిన రాజ్‌కుమార్ (15) స్టేషన్‌ఘన్‌పూర్ మండలం శివునిపల్లిలోని హాస్టల్లో ఉంటూ పదో తరగతి చదువుతున్నాడు. బయటివ్యక్తులు కొందరు హాస్టల్లో చొరబడి రాజ్‌కుమార్, అతడి స్నేహితులతో గొడవ పడ్డారు. ఈ విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో మళ్లీ ఆ మూక వచ్చి ఏం చేస్తుందోనన్న భయంతో రాజ్‌కుమార్ నిరుడు సెప్టెంబరు 22న ఆత్మహత్య చేసుకున్నాడు.
- మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని తీగల్‌పహాడ్‌కు చెందిన చిలువేరు యోగిత (16) అనే టెన్త్ విద్యార్థిని రానున్న వార్షిక పరీక్షల్లో టెన్ జీపీఏ సాధించలేననే ఆవేదనతో ఫిబ్రవరి 1న ప్రాణాలు తీసుకుంది.
- గద్వాల రూరల్ మండలం అనంతపురానికి చెందిన బోయ పావని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదువుతోంది. సెలవులకు ఇంటికొచ్చిన ఆ అమ్మాయి.. చదువుపై ఏమాత్రం ఆసక్తి లేకపోవడంతో కాలేజీకి వెళ్లడం లేదు. ఈ విషయంలో తల్లి గట్టిగా మందలించడంతో జనవరి 27న పావని ఆత్మహత్య చేసుకుంది.

టీనేజర్లలో ఎక్కువగా క్షణికావేశంలోనే ..

టీనేజర్లలో ఎక్కువమంది తమకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు ఉండాలనే భావనతో ఉంటారు. ఇలాంటి వారు చదువు, పరీక్షలతో ఒత్తిడి గురవుతుంటారు. ఈ క్రమంలో ఇంట్లోవాళ్లు కాస్త మందలించినా కూడా క్షణికావేశానికి లోనవుతారు. ఒత్తిడిలో ఏం చేయాలో తెలియక తాము చనిపోతే తమ విలువేంటో కుటుంబసభ్యులకు తెలిసివస్తుందన్న అభిప్రాయానికొచ్చి ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇంకొందరిలో జన్యుపరమైన కారణాలుంటాయి. ఆత్మహత్యకు ప్రేరేపించే 12 రకాల జన్యుపరమైన కారణాలను పరిశోధకులు కనుగొన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం ఆత్మహత్య చేసుకోవాలనే వారి మెదడులో ఒక రకమైన రసాయనాలు వెలువడుతాయి. వాటిని అయా పరీక్షల ఆధారంగా గుర్తించి అటువంటి వారిని కాపాడొచ్చు. మనదేశంలో ఏటికేడు ఆత్మహత్యల సంఖ్య పెరుగుతోంది. నేషనల్ క్రైమ్ రిపోర్ట్ బ్యూరో 2022 గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా ఆ ఏడాది 1.71 లక్షల మంది ఆత్మహత్య చేసుకున్నారు. అందులో 15-22 ఏళ్ల మధ్యవయస్కులు 14వేల మంది ఉన్నారు. ఆత్మహత్య చేసుకుంటున్నవారిలో 40శాతం క్షణికావేశంతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నారు. ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే ఎలా ఆత్మహత్య చేసుకున్నాడు? అనే విషయాన్ని బహిర్గతపర్చకూడదు. అది బయటపెడితే ఆ పంథాలోనే ఆత్మహత్య చేసుకోవాలని కొందరు ప్రేరితులవుతారు

- డాక్టర్ వడ్లమాని నరేశ్, సీనియర్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, అడ్వైయిజర్, నేషనల్ సూసైడ్ ప్రివెన్షన్ కమిటీ, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ.

న్యాక్ డైరెక్టర్ జనరల్‌గా

దాసరి హరిచందన

» జాతీయ రహదారుల సీఈగా జయభారతి నియామకం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖతోపాటు దానికి అనుబంధంగా ఉండే నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో రెండు పోస్టులను భర్తీ చేస్తూ సంబంధిత శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆర్ అండ్ బీలోని జాతీయ రహదారుల విభాగం చీఫ్ ఇంజనీరుగా జయభారతిని, న్యాక్ డైరెక్టర్ జనరల్ పోస్ట్‌లో ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న ఐఏఎస్ దాసరి హరిచందనను నియమించారు. హరిచందన బాధ్యతలు చేపట్టారు. 'ఆర్ అండ్ బీలో కీలక పోస్టులు ఖాళీ' శీర్షికన ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది. ఈ నేపథ్యంలో తాజా నియామకాలు చోటు చేసుకున్నాయి. కాగా రెండు పోస్టులను భర్తీ చేసినప్పటికీ ఆర్ అండ్ బీలో కీలకమైన ఇంజనీరు ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) పోస్టు ఇంకా ఖాళీగానే ఉంది. ఇది రాష్ట్ర స్థాయి పోస్టు. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఆర్డర్ ఇవ్వలేదని తెలుస్తోంది. అయితే న్యాక్ డీజీ పోస్టును భర్తీ చేసి ఈఎన్‌సీ పోస్టును ఖాళీగా ఉంచడం చర్చనీయాంశమైంది. కాగా ఆర్ అండ్ బీలో మరో ఇద్దరు అధికారుల బాధ్యతల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ప్రతి ఏటా ఫిబ్రవరి 4న తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం

» రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే, షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణపై ఈ నెల 4న తీసుకున్న విశేషమైన నిర్ణయానికి గుర్తుగా ప్రతి ఏటా ఫిబ్రవరి 4న 'తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని' నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సామాజిక న్యాయం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనికి అనుగుణంగానే సామాజిక న్యాయ దినోత్సవాన్ని ప్రకటిస్తున్నామని తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమానత్వం, సాధికారతను అందించాలన్న నిర్ణయానికి పునరంకితమవుతామని ప్రభుత్వం పునరుద్ఘాటించింది. ప్రతి ఏటా ఫిబ్రవరి 4న నిర్వహించే తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు, ప్రసంగాలు, సామాజిక న్యాయాన్ని ఉద్దీపింపజేసే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించింది. గుర్తింపు అవార్డులు, సంక్షేమ శిబిరాలు, ప్రజలతో సంభాషణలు వంటి ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఉంటాయని తెలిపింది. వివిధ సంక్షేమ శాఖలు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాలు చేపడతాయని, దీనికి బీసీ సంక్షేమ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందని పేర్కొంది.

తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు కళకళ

గతేడాదితో పోలిస్తే ఈ జనవరిలో భారీగా పెరిగిన ప్రయాణికుల సంఖ్య

» శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 21.2 శాతం వృద్ధి

» విజయవాడలో 46, విశాఖలో 33.8% పెరుగుదల

» రోజుకు లక్ష మంది ప్రయాణికులకు చేరువలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)



జనవరి నెలలో దేశంలోని వివిధ ఎయిర్‌పోర్టుల్లో ప్రయాణికుల రాకపోకలు

ఎయిర్‌పోర్టు	2025 జనవరిలో ప్రయాణికుల సంఖ్య	గత జనవరితో పోలిస్తే కనిపించిన వృద్ధి శాతం
ఢిల్లీ	69,03,650	9.7
ముంబై	49,94,239	3.5
బెంగుళూరు	37,24,850	14.7
హైదరాబాద్	26,42,587	21.2
కోల్‌కతా	19,41,893	14.3
చెన్నై	20,64,961	9.8
విశాఖపట్నం	2,72,717	33.8
విజయవాడ	1,31,061	46.0

(దేశీయ, అంతర్జాతీయ)

తెలుగు రాష్ట్రాల్లోని విమానాశ్రయాలు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) గురువారం విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. దీని ప్రకారం.. గత ఏడాది జనవరితో పోలిస్తే 2025 జనవరిలో ఏపీలోని విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రయాణించిన వారి సంఖ్య 46 శాతం పెరిగింది. అలాగే వైజాగ్‌లో 33.8 శాతం వృద్ధి కనిపించింది. తెలంగాణలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో 21.2 శాతం వృద్ధి కనిపించింది. అలాగే దక్షిణాదికి చెందిన బెంగళూరులో 14.7 శాతం, చెన్నై విమానాశ్రయంలో 9.8 శాతం వృద్ధి నమోదైంది. ఇక, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 9.7, ముంబైలో 3.5, కోల్‌కతాలో 14.3 శాతం వృద్ధి రికార్డయింది. మెట్రో నగరాల విషయంలో ప్రయాణీకుల సంఖ్యలో శంషాబాద్ విమానాశ్రయం దూసుకెళుతోంది. ఇక, విమాన సర్వీసుల పెరుగుదల అంశంలో హైదరాబాద్ 16.2 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా చెన్నై 13.8, బెంగుళూరు 10.4, ఢిల్లీ 7.9, కోల్‌కతా 9.8, ముంబైలో 0.3శాతం పురోగతి కనిపించింది. ఇక, విజయవాడలో 22.4శాతం, విశాఖపట్నంలో 34శాతం పెరుగుదల నమోదైంది.

రోజుకు లక్షకు చేరువలో...

శంషాబాద్ విమానాశ్రయంలో రోజు వారీ ప్రయాణికుల(దేశీయ, అంతర్జాతీయ) సంఖ్య లక్ష దాటే రోజు మరెంతో దూరంలో లేదు. శంషాబాద్ నుంచి ఇటీవల మరిన్ని దేశీయ, అంతర్జాతీయ సర్వీసులు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రయాణీకుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఫిబ్రవరి 21న రికార్డు స్థాయిలో 96వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు. కాగా, దేశీయ ప్రయాణికులు విశాఖపట్నంలో 31.9 శాతం పెరగగా విజయవాడ ఎయిర్‌పోర్టులో 48.1 శాతం పెరిగారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి దేశంలోని 72 ప్రాంతాలకు, విదేశాల్లోని 20 ప్రాంతాలకు ప్రతీ రోజూ సర్వీసులు నడుస్తున్నాయి. రోజుకు సగటున 600 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ విమానాల సంఖ్య మరింత పెరగనుంది. వచ్చే నెల 18న వియత్నం (హోచిమిన్)కు నేరుగా విమాన సర్వీసులు ప్రారంభించనున్నారు. మదీనా, హాంకాంగ్, పారిస్, ఆస్ట్రేలియా, ఆమ్‌స్టర్‌డామ్, రియాద్, హనోయ్, ఆడిస్ అబాబా(ఇథియోపీయా)కు సర్వీసులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఉన్నత విద్యలో నాన్-లోకల్ కోటా ఎత్తివేత

» ఇకపై సీట్లన్నీ స్థానికులకే... జీవో విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఉన్నత విద్యకు ఇకపై నాన్-లోకల్ క్యాటగిరీ ఉండదు. ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్య కోర్సులతో పాటు.. డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, ఫార్మ్-డి, బిజినెస్, లా, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇప్పటి వరకు ఉన్న రిజర్వేషన్లను ప్రభుత్వం సవరించింది. ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2013 ప్రకారం.. రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసించేందుకు స్థానికులకు 85%, స్థానికేతరులకు 15% కోటా అమల్లో ఉంది. గత ఏడాది జూన్ 2తో ఆ చట్టంలో విధించిన పదేళ్ల గడువు పూర్తవ్వడంతో మొత్తం సీట్లను స్థానికులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థానికేతరుల కోటాను ఎత్తివేశాక మిగిలే 15% సీట్ల భర్తీపై ప్రభుత్వం ఇప్పటికే నిపుణుల కమిటీని నియమించింది. ఉన్నత విద్యపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఆ కమిటీ నివేదికను అందజేసింది. 15% సీట్లను నాలుగు భాగాలుగా విభజించింది. ఇందులో రాష్ట్ర విద్యార్థులతోపాటు.. తల్లిదండ్రుల కేంద్ర సర్వీసు ఉద్యోగాల కారణంతో ఇతర రాష్ట్రాల్లో చదివిన తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించాలని సిఫారసు చేసింది. అయితే.. వీరు పదేళ్లు తెలంగాణలో చదివి ఉండాలనే నిబంధనను విధించింది. రాష్ట్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థల్లో పనిచేస్తున్న వారి పిల్లలు, ఉద్యోగుల జీవిత భాగస్వాములను కూడా 15% కోటాకు అర్హులుగా పరిగణించాలని సూచించింది. కమిటీ సిఫారసులను పరిశీలించిన ప్రభుత్వం వాటిని ఆమోదిస్తూ.. ఉత్తర్వులను విడుదల చేసింది.

శ్రీశైలం, సాగర్ జలాలు

పొదుపుగా వాడుకోవాలి

» కృష్ణాబోర్డు అత్యవసర సమావేశంలో నిర్ణయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జలాశయాలు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను పొదుపుగా వాడుకోవాలని తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. తొలుత తాగునీటి అవసరాలకే వినియోగించాలని, మిగిలితేనే సాగుకు వాడుకోవాలని ఆదేశించింది. పంటలకు సాగునీటి అవసరాలు, వినియోగంపై ప్రతీ 15 రోజులకోసారి ఈఎన్‌సీలు భేటీ కావాలని స్పష్టం చేసింది. తాము నెలకోసారి బోర్డు సమావేశాన్ని నిర్వహించి.. నీటి వినియోగంపై సమీక్షిస్తామని తెలిపింది. జూలై దాకా ఇదే రీతిలో సమావేశాలు నిర్వహించి.. సమీక్షిస్తూ తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని వెల్లడించింది. గురువారం కృష్ణా బోర్డు చైర్మన్ అతుల్‌జైన్ అధ్యక్షతన జలసౌధలో బోర్డు రెండో అత్యవసర సమావేశం జరిగింది. రాష్ట్రం తరఫున నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్‌సీ (జనరల్) అనిల్ కుమార్, సీఈ రమేశ్‌బాబు, ఎస్ఈ విజయ్‌కుమార్.. ఏపీ తరఫున జలవనరులశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి జి.సాయిప్రసాద్, ఈఎన్‌సీ ఎం.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాటా కంటే ఎక్కువ నీటిని ఏపీ వాడుకుందని తెలంగాణ అధికారులు బోర్డుకు ఫిర్యాదు చేశారు. శ్రీశైలం, సాగర్‌లలో విద్యుదుత్పత్తి చేస్తూ.. దిగువకు నీటిని విడుదల చేసి సముద్రంలో కలిసేలా చేసి వృథా చేసింది తెలంగాణనేని ఏపీ అధికారులు బదులిచ్చారు. రెండు రాష్ట్రాల అధికారుల వాదనలు విన్న బోర్డు చైర్మన్.. ఉమ్మడి ప్రాజెక్టుల్లో మిగిలిన నిల్వలను సమర్థంగా వాడుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.